

STAY UPDATED IN REAL-TIME WITH OUR WHATSAPP CHANNEL



GST NO: 36ACPPF9587L2ZM    TELTEL/2013/53323

# సమయజ్యోతి

ప్రతీ అక్షరం - ప్రజలకోసం    తెలుగు దిన పత్రిక

CELEBRATING 12TH YEAR ANNIVERSARY

సంపుటి: 12 | సంచిక : 29 | పేజీలు: 12 | ఆదిలాబాద్ | వేలా: రూ.01 | మంగళవారం 01 ఏప్రిల్ 2025 | ఎడిటర్: ఫైసల్ ఖాన్




దివంగత షఫీఉల్లా ఖాన్
మాజీ మేనేజింగ్ ఎడిటర్



## గ్లోబల్ కెపాబిలిటీ సెంటర్ ఏర్పాటుకు

# సుముఖం

● సిఎం రేవంత్‌తో సంస్థ ప్రతినిధుల భేటీ ● హైదరాబాద్‌లో వాన్‌గార్డ్ పెట్టుబడులు

హైదరాబాద్,మార్చి31(సమయజ్యోతి):

ప్రపంచంలోని అత్యంత ప్రతిష్టాత్మక సంస్థలలో ఒకటైన వాన్‌గార్డ్ కంపెనీ హైదరాబాద్‌లో గ్లోబల్ కెపాబిలిటీ సెంటర్ (ఏఈఈ) ఏర్పాటు చేయనున్నట్లు ప్రకటించింది. మన దేశంలో వాన్ గార్డ్ నెలకొల్పే తొలి జీసీసీ ఇదే కావటం విశేషం. వాన్ గార్డ్ ప్రతినిధి బృందం సోమవారం ఉదయం బంజారాహిల్స్ లోని సీఎం నివాసంలో ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డితో భేటీ అయింది. వాన్‌గార్డ్ సీఈఓ సలీం రాంజీ, ఐటీ- డివిజన్ సీఐఓ, ఎండీ నితిన్ టాండన్, చీఫ్ హెచ్ఆర్ ఆఫీసర్ జాన్ కౌచర్, జిసిసి-వాన్‌గార్డ్ ఇండియా హెడ్ వెంకటేష్ నటరాజన్ నేతృత్వంలో కంపెనీ ప్రతినిధి బృందం ఈ చర్చల్లో పాల్గొన్నారు.

## హెచ్‌సియూ భూముల అమ్మకం

# దుర్మార్గం

● కోర్టు తీర్పు రాగానే అమ్మకానికి సిద్ధం
● విద్యార్థుల పోరాటం అభినందనీయం
● భారాస కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్

హైదరాబాద్,మార్చి31(సమయజ్యోతి):

హెచ్‌సియూ భూములు అమ్మకాన్ని కెటిఆర్ తీవ్రంగా తప్పు పట్టారు. తున్నారని ప్రభుత్వాన్ని భారాస కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ ప్రశ్నించారు. హైదరాబాద్‌లో హెచ్‌సీయూ పరిసర ప్రాంతాలే కాస్త ఆక్సిజన్ ఇచ్చే ప్రాంతాలుగా ఉన్నాయని అన్నారు. 400 ఎకరాలు అమ్మి.. రూ.30వేల కోట్లు రాబట్టుకోవాలని అధికార పార్టీ నేతలు చూస్తున్నారని విమర్శించారు.

మిగతా 2 లో



## ఫిలిప్పీన్స్‌కు

# తెలంగాణ బియ్యం

## కాకినాడ పోర్టు వద్ద జెండా ఊపిన ఉత్తమ్

కాకినాడ,మార్చి31(సమయజ్యోతి):

కాకినాడ పోర్టు నుంచి ఫిలిప్పీన్స్‌కు తెలంగాణ రాష్ట్రానికి చెందిన బియ్యంవెళ్లాయి. ఫిలిప్పీన్స్‌కు 8 లక్షల టన్నుల బియ్యం ఇవ్వడానికి ఒప్పందం కుదిరింది.. ఈ ఒప్పందంలో భాగంగా తొలి విడతలో 12,500 టన్నుల బియ్యం పంపించారు.. లోడింగ్ ప్రక్రియ పూర్తి చేసుకుని ఫిలిప్పీన్స్‌కు వెళ్తున్న షిప్‌ను తెలంగాణ పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి జెండా ఊపి ప్రారంభించారు.. ఈ సందర్భంగా మంత్రి ఉత్తమకుమార్ రెడ్డి మాట్లాడుతూ ఫిలిప్పీన్స్ కి 8 లక్షల టన్నులు బియ్యం ఇవ్వడానికి ఒప్పందం చేసుకున్నాం.. అందులో భాగంగా తొలివిడతగా 12500 టన్నుల బియ్యం పంపిస్తున్నాం అని వెల్లడించారు.. ఇతర దేశాలతో కూడా సంప్రదింపులు జరుగుతున్నాయి.. తెలంగాణలో 280 లక్షల టన్నుల బియ్యం ఉత్పత్తి జరుగుతోందన్నారు.. మా రాష్ట్ర రేషన్ అవసరాలు తీరిన తర్వాత మిగిలిన వాటిని ఎగుమతి చేస్తున్నామని పేర్కొన్నారు.. గత ప్రభుత్వాలు ఇటు-వంటి ప్రయత్నాలు చేయలేదు.. స్వయంగా నేను వెళ్లి రైస్ ఎగుమతులు పై చర్చిస్తానని మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి అన్నారు ..





## భూములతో సెంట్రల్ వర్సిటీకి

# సంబంధం లేదు

మంత్రి పొన్నం ప్రభాకర్ సమర్థన

హైదరాబాద్,మార్చి31(సమయజ్యోతి):

సెంట్రల్ యూనివర్సిటీ భూములపై మంత్రి పొన్నం ప్రభాకర్ కీలక ప్రకటన చేశారు. హెచ్‌సియూకి పక్కనే ఆనుకుని ఉన్న ఆ 400 ఎకరాల భూమి ప్రభుత్వానిదేనని అన్నారు. ప్రైవేట్ సంస్థలకు 21 ఏళ్ల క్రితం కేటాయించిన భూమిని న్యాయ పోరాటం చేసి తిరిగి తెలంగాణ ప్రభుత్వం దక్కించుకుందని తెలిపారు.

మిగతా 2 లో



## ఆఫ్‌షోర్ మైనింగ్‌తో

# తీవ్ర నష్టం

తీరప్రాంత జీవజాలానికి ముప్పు

ప్రధానికి రాసిన లేఖను విడుదల చేసిన రాహుల్

న్యూఢిల్లీ,మార్చి 31(సమయజ్యోతి):

కేరళ, గుజరాత్, అండమాన్ నికోబార్ దీవులలో ఆఫ్‌షోర్ మైనింగ్‌కు టెండర్లను రద్దు చేయాలని కోరుతూ లోక్‌సభ ప్రతిపక్షనేత రాహుల్ గాంధీ ప్రధాని మోడీకి ఇటీవల లేఖ రాశారు. మార్చి 25న రాసిన లేఖ రాహుల్ వాట్సాప్ ద్వారా షేర్ చేశారు. ఆఫ్‌షోర్ మైనింగ్ వల్ల సముద్ర జీవులకు ముప్పు వాటిల్లుతుంది. జీవరాశికి జరిగే నష్టాన్ని అంచనా వేయకుండానే మైనింగ్‌కు ప్రైవేటు టెండర్లను ఆహ్వానించడం పట్ల తాను తీవ్రంగా వ్యతిరేకిస్తున్నట్లు రాహుల్ లేఖలో పేర్కొన్నారు.

మిగతా 2 లో

## స్థానిక ఎన్నికల్లో

# బిజెపి గెలవాల్సిందే

▶▶ స్థానిక సంస్థల బలోపేతం బిజెపికే సాధ్యం
▶▶ బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు కిషన్ రెడ్డి



హైదరాబాద్,మార్చి31(సమయజ్యోతి):

కాంగ్రెస్, బీఆర్ఎస్ కలిసి కుట్రలు చేసినా తెలంగాణలో ఇటీవల జరిగిన ఎమ్మెల్సీ ఎన్నికల్లో రెండు స్థానాలను గెలుచుకున్నామని కేంద్ర మంత్రి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్ రెడ్డి తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్వయంగా ప్రచారం చేసినప్పటికీ, ఓటర్లు బీజేపీకి మద్దతు తెలిపారని ఆయన వ్యాఖ్యానించారు. నాంపల్లిలోని పార్టీ రాష్ట్ర కార్యాలయంలో జరిగిన బీజేపీ ఆఫీస్ బేరర్స్ మీటింగ్‌లో కేంద్ర మంత్రి బండి సంజయ్, ఎంపీ ఈటల రాజేందర్ సహా ముఖ్యనేతలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కిషన్ రెడ్డి మాట్లాడుతూ, స్థానిక సంస్థలు బలపడాలంటే బీజేపీ గెలవాలనే నినాదంతో బీజేపీ స్థానిక సంస్థల ఎన్నికలకు సిద్ధమవుతుందని తెలిపారు కిషన్ రెడ్డి. కేంద్రం ఇచ్చే నిధులు తప్ప గ్రామ పంచాయితీలకు కాంగ్రెస్, బీఆర్ఎస్ ప్రభుత్వాలు ఏమాత్రం చేయలేకపోయాయని కిషన్ రెడ్డి ఆరోపించారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం హామీలు ఇచ్చి నెరవేర్చలేదని, ఇప్పుడు కాంగ్రెస్ పార్టీ కూడా ఇచ్చిన హామీలను నెరవేర్చలేక చేతులెత్తేసిందని ఆయన మండిపడ్డారు. తెలంగాణలో బీఆర్ఎస్ పార్టీ మళ్లీ రాకుండా ఈ రెండు పార్టీలపై పోరాటం చేయాలని ఆయన బీజేపీ శ్రేణులకు పిలుపునిచ్చారు. బీజేపీ బలపడాలని, రాష్ట్ర సమస్యలపై పోరాడాలని, అధికారంలోకి రావాలని ప్రజలు చూస్తున్నారు అని కిషన్ రెడ్డి అన్నారు.



## హెచ్‌సియూ భూములు

# వేలం తగదు

◆పర్యావరణహితం కోసం వాటిని కాపాడాలి
◆ప్రభుత్వానికి ఎక్స్ వేదికగా కిషన్ రెడ్డి సూచన
◆మొండిగా వెళితే అడ్డుకుంటామన్న ఈటెల

హైదరాబాద్,మార్చి31(సమయజ్యోతి):

హైదరాబాద్ కంచ గచ్చిబౌలిలోని 400 ఎకరాల భూములు వేలం వేయాలనన్న రేవంత్ రెడ్డి ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంపై కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి జి. కిషన్ రెడ్డి తప్పు పట్టారు. ఈ మేరకు సోమవారం తన ఎక్స్ ఖాతా వేదికగా స్పందించారు. తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం తీసుకున్న నిర్లక్ష్య చర్యను తాను తీవ్రంగా ఖండిస్తున్నానన్నారు. పర్యావరణ విధ్వంసాన్ని వెంటనే ఆపాలని రేవంత్ ప్రభుత్వానికి ఈ సందర్భంగా ఆయన సూచించారు. హైదరాబాద్ పర్యావరణానికి ఇతోధికంగా తోడ్పాటును అందిస్తున్న ఈ ప్రదేశాలను రక్షించాలని సీఎం రేవంత్ రెడ్డిని కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి కోరారు.

# మూడోసారి అధ్యక్షుడినయ్యే ఛాన్స్

## జోక్ కాదు..నిజమే చెబుతున్నాను-అమెరికా అధ్యక్షుడు ట్రంప్ సంచలన వ్యాఖ్య



వాషింగ్టన్,మార్చి31(సమయజ్యోతి):

అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మరోమారు సంచలన వ్యాఖ్యలు చేశారు. రెండోసారి అధ్యక్ష బాధ్యతలు చేపట్టిన ట్రంప్.. తన పాలన ఎలా ఉంటుందో మరోసారి అందరికీ రుచిచూపిస్తున్నారు. ఈ క్రమంలో ఆయన మూడోసారి కూడా అమెరికా అధ్యక్షుడు కావాలనుకుంటున్నారు. తాను మూడోసారి అమెరికా అధ్యక్షుడిగా ఎన్నిక కావడానికి మార్గాలున్నాయని ఓ న్యూస్ ఛానెల్‌కి ఇచ్చిన ఇంటర్వ్యూలో తెలిపారు.

మిగతా 2 లో

# గ్లోబల్ కెపాబిలిటీ సెంటర్ ఏర్పాటుకు సుముఖం



ముఖ్యమంత్రితో పాటు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి, ఉన్నతాధికారులు ఈ సమావేశంలో ఉన్నారు. ఈ సందర్భంగా జరిగిన చర్చల అనంతరం హైదరాబాద్‌లో జీసీసీ ఏర్పాటు నిర్ణయాన్ని ఆ సంస్థ ప్రకటించింది. ఈ ఏడాది చివరి నాటికి హైదరాబాద్‌లో తమ జీసీసీ కార్యాలయాన్ని అధికారికంగా ప్రారంభించనున్నట్లు తెలిపింది. రాబోయే నాలుగు సంవత్సరాల్లో 2,300 మంది ఉద్యోగులను నియమించుకోవాలని లక్ష్యంగా నిర్ణయించింది. వాన్‌గార్డ్ ప్రపంచంలో పేరొందిన పెట్టుబడి సంస్థ. ప్రపంచ వ్యాప్తంగా సుమారు 10 ట్రిలియన్ డాలర్ల విలువైన ఆస్తులను ఈ కంపెనీ నిర్వహిస్తుంది ప్రపంచ వ్యాప్తంగా 50 మిలియన్లకు పైగా పెట్టుబడిదారులకు తమ సేవలు అందిస్తుంది. హైదరాబాద్‌లో వాన్ గార్డ్ ఏర్పాటు చేసే కేంద్రం ఇన్నోవేషన్ హబ్‌గా పనిచేయనుంది. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, డేటా అనలిటిక్స్, మొబైల్ ఇంజనీరింగ్ వంటి అధునాతన సాంకేతిక రంగాల్లో అందుకు అవసరమైన ఇంజనీర్లను తక్షణమే నియమించుకోవాలని ఎ÷-లాన్ చేస్తోంది. హైదరాబాద్ లో వాన్ గార్డ్ జీసీసీ ఏర్పాటుకు ముందుకు రావటం ఆనందంగా ఉందని ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి అన్నారు. తెలంగాణ రైజింగ్ విజన్‌లో భాగంగా హైదరాబాద్‌ను ప్రపంచ స్థాయి జీసీసీ గమ్య స్థానంగా తీర్చిదిద్దుతున్నామని అన్నారు. వాన్‌గార్డ్ రాకతో ప్రపంచ స్థాయిలో హైదరాబాద్ మరింత బలపడుతుందని అన్నారు. మన దేశంలోని ప్రతిభను ఉపయోగించుకోవడానికి, సాంకేతిక నిపుణులకు ఉద్యోగ అవకాశాలను మెరుగుపరుస్తుందని అన్నారు. ప్రభుత్వం తరఫున తగినంత సహకారం అందిస్తుందని కంపెనీ ప్రతినిధులకు భరోసా ఇచ్చారు. హైదరాబాద్‌లో వైవిధ్యమైన ప్రతిభతో పాటు, జీవన నాణ్యత, సాంకేతిక నైపుణ్యం, ఆవిష్కరణలకు అనుకూలమైన వాతావరణముందని కంపెనీ సీఈవో సలీం రాంజీ అభిప్రాయపడ్డారు. వీటికి తోడుగా రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న సహాయ సహకారాలతో హైదరాబాద్ను తమకు అనువైన చోటుగా ఎంచుకున్నామన్నారు. తమ వినియోగదారులకు ప్రపంచస్థాయి సేవలను అందించటంతో పాటు ఏఐ, మొబైల్, క్లౌడ్ -టె-క్నాలజీలో ప్రతిభావంతులైన ఇంజనీర్లను అవకాశాలు కల్పించటం తమకు సంతోషంగా ఉందన్నారు.

మొదటి పేజీ తరువాయి

# హెచ్‌సియూ భూముల అమ్మకం దుర్మార్గం

ఫ్యూచర్ సిటీలో 50వేల ఎకరాలు సిద్ధం చేస్తూ.. ఈ 400 ఎకరాలు ఎందుకని ప్రశ్నించారు. హైకోర్టులో పిటిషన్ విచారణకు రాకముందే భూములు చదును చేస్తున్నారని, హెచ్‌సీయూ భూములపై రాహుల్ గాంధీ ఎందుకు మాట్లాడటం లేదని నిలదీశారు. హెచ్‌సీయూ విద్యార్థుల పోరాటానికి అన్ని రకాలుగా అండగా నిలుస్తామన్నారు. ఈ వ్యవహారంపై హెచ్‌సీయూ పూర్వ విద్యార్థులు భట్టి విక్రమార్క, శ్రీధర్‌బాబు స్పందించాలని డిమాండ్ చేశారు.హైదరాబాద్ నగరం, విశ్వవిద్యాలయ భవిష్యత్ కోసం హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ విద్యార్థులు పడుతున్న ఆరాటం చాలా గొప్పదని కెటిఆర్ అన్నారు. హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ భూముల పరిరక్షణ కోసం పాటుపడుతున్న విద్యార్థులపైన ప్రభుత్వం చేస్తున్న దుర్మార్గమైన అణచివేతకు పాల్పడుతుందని కేటీఆర్ మండిపడ్డారు. యూనివర్సిటీకి చెందిన విద్యార్థులు కేటీఆర్ తెలంగాణ భవన్‌లో కలిశారు. వారి పోరాటానికి అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. ఈ సందర్భంఅ ఆయన మాట్లాడుతూ.. 'తొలి దశ తెలంగాణ ఉద్యమం తర్వాత హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీని ఏర్పాటు చేయడం జరిగింది. హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ కాలక్రమంలో అనేక పేరు ప్రఖ్యాతలు సాధించుకుంది. అక్కడ చదివిన విద్యార్థులు దేశ విదేశాల్లో గొప్ప సేవ చేస్తున్నారు. హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ- దేశానికి తలమానికంగా ఉన్న విద్యాసంస్థల్లో ఒకటిగా ఉన్నది. హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ- విద్యార్థులు ఎలాంటి స్వార్థం లేకుండా సమాజ హితం కోసం చేస్తున్న గొప్ప పోరాటం ఇది . హైదరాబాద్ నగర భవిష్యత్తు కోసం విశ్వవిద్యాలయ భవిష్యత్తు కోసం పడుతున్న ఆరాటం చాలా గొప్పది' అన్నారు.ఈ మధ్య కొత్తతరం పిల్లల్లో విద్యార్థుల్లో పోరాట స్ఫూర్తి తగ్గిందని అప్పుడప్పుడు బాధపడతాం. కానీ, ఇలాంటి సరైన సందర్భంలో యూనివర్సిటీ విద్యార్థులు చూపెడుతున్న తెగువ, వారి పోరాటానికి సెల్యూట్ చేస్తున్నాం. ఇక్కడున్న కాంగ్రెస్ ప్రభుత్వాన్ని సూటిగా కొన్ని ప్రశ్నలను విద్యార్థుల తరఫున పార్టీ తరఫున అడుగుతున్నాం. రాష్ట్ర ప్రభుత్వం యూనివర్సిటీ- విద్యార్థులపైన, యూనివర్సిటీ- భూములపైన రాజకీయం చేస్తున్నది? వందల బుల్డోజర్లను, హిటాచి యంత్రాలను పెట్టి అక్కడున్న చెట్లను, జంతువులను, చంపి మరీ వేగంగా కబ్జా చేసే ప్రయత్నం చేస్తున్నది? ఎందుకు ఇంత వేగంగా భూముల కబ్జాకు ఆరాటపడుతున్నదో చెప్పాలని డిమాండ్ చేశారు. గచ్చిబౌలి నానక్‌రామ్‌గూడ ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్ ఏరియాలో నగరం విస్తృతంగా పెరిగింది. ఒక కాంక్రీట్ జంగల్‌గా మారింది. భారత దేశంలోని ఏ నగరంలో అంత తక్కువ విస్తీర్ణంలో భారీగా నగరం అభివృద్ధి చెందలేదు. కోట్లాది చదరపు అడుగుల నివాస గృహాలు నిర్మాణం అవుతున్నాయి. పశ్చిమ హైదరాబాద్‌కి ఊపిరినిచ్చే కొన్ని గ్రీన్ ప్రాంతాలలో హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ-, దాని చుట్టూ ఉన్న ప్రాంతాలే. పశ్చిమ హైదరాబాద్‌లో భవిష్యత్తులో ఢిల్లీ మాదిరి ఊపిరి పీల్చుకోవడమే కష్టం అయ్యే పరిస్థితి ఏర్పడుతున్నది' అంటూ ఆందోళన వ్యక్తం చేశారు. సెంట్రల్ యూనివర్సిటీ- చుట్టూ ఉన్న హరితాన్ని అలాగే ఉంచితే భవిష్యత్తుకు కొంత భరోసా ఉంటు-ంది. ఒక ఎన్విరాన్మెంటల్ ఇంపాక్ట్ అసెస్మెంట్ అనేది చేయకుండా ఏ విధంగా ఈ 400 ఎకరాలు అమ్ముతారని విద్యార్థులు అడుగుతున్నారు. ఈ 400 ఎకరాలను అమ్మేముందు జరిగే పర్యావరణ నష్టం ప్రభావంపై అధ్యయనం చేయాలి అని అడుగుతున్నారు. 2003లో ఐఎంజీ భారత అనే కంపెనీకి క్రీడా సదుపాయాల కోసం ఈ 400 ఎకరాలను కేటాయించింది. కేవలం స్టేడియాలు క్రీడా శిక్షణకు సంబంధించిన మౌలిక వసతులను ఏర్పాటు- చేసేందుకు గత ప్రభుత్వాలు భూములను ఆ సంస్థకు ఇచ్చింది. కానీ ఈ ప్రభుత్వం అదే ప్రాంతంలో 400 ఎకరాలలో కోట్లాది చదరపు అడుగుల నిర్మాణాలు చేపట్టి కాంక్రీట్ జంగల్‌గా మార్చే ప్రయత్నం చేస్తున్నది. 21 సంవత్సరాల తర్వాత కేసు తేలింది. కానీ, ప్రభుత్వం మాత్రం వెంటనే ఆ భూములను అమ్మి రూ.30వేలకోట్లు- సేకరించాలని ప్రయత్నం చేస్తుంది. రేవంత్ రెడ్డి ఆస్తులు అమ్మడం, అప్పులు తేవడం అనే ఎజెండాను ప్రజలు నిర్ణయిస్తారు. ఇప్పటికే వేల ఎకరాల భూమి మీకు అందుబాటులో ఉన్నప్పుడు 45 వేల ఎకరాలను అమ్ముకునే ప్రయత్నం ఎందుకు చేస్తున్నారని కేటీఆర్ ప్రశ్నించారు.

మొదటి పేజీ తరువాయి

మొదటి పేజీ తరువాయి

# మూడోసారి అధ్యక్షుడినయ్యే ఛాన్స్

ఈ విషయంలో తాను జోక్ చేయడం లేదని వ్యాఖ్యానించారు. ఇంటర్వ్యూలో భాగంగా మరోమారు అధ్యక్షుడు కావాలనుకుంటు-న్నారా..? అందుకు ఏమైనా వ్యూహాలున్నాయా..? అన్న ప్రశ్న ట్రంప్‌కు ఎదురైంది. ఇందుకు ఆయన సమాధానమిస్తూ.. 'రాజ్యాంగం అనుమతించకపోయినా.. మూడోసారి అధ్యక్షుడు కావడానికి చాలా మార్గాలు ఉన్నాయి. ఈ విషయంలో నేను జోక్ చేయడం లేదు. నన్ను మూడోసారి కూడా అధ్యక్షుడిగా చూడాలని చాలామంది కోరుకుంటున్నారు. అయితే, దాని గురించి ఇప్పుడే మాట్లాడటం తొందరపాటే అవుతుంది. ఆ విషయం మీకు కూడా తెలుసని ట్రంప్ పేర్కొన్నారు.నిజానికి అమెరికా రాజ్యాంగం ప్రకారం ఏ వ్యక్తీ రెండుసార్లకు మించి అధ్యక్ష పదవిని అధిష్ఠించడానికి వీల్లేదు. ట్రంప్ మూడోసారి అధ్యక్షుడు కావాలంటే 22వ రాజ్యాంగ సవరణను మార్చాల్సి ఉంటుంది. దానికి అమెరికా కాంగ్రెస్‌తోపాటు- రాష్ట్రాల ఆమోదం పొందాల్సి ఉంటుంది. అది చాలా కష్టమైన పని. అమెరికా చరిత్రలో ఫ్రాంక్లిన్ రూజ్ వెల్ట్ ఒక్కరే నాలుగుసార్లు అమెరికా అధ్యక్షుడిగా ఎన్నికయ్యారు. ఆ తర్వాత ఇటు-వంటిది జరగకుండా నివారించడానికి 1951లో 22వ రాజ్యాంగ సవరణ తెచ్చారు. అయితే, ట్రంప్ మాత్రం మూడోసారి, వీలైతే నాలుగోసారి కూడా అమెరికాను ఏలాలని కలలు కంటున్నారు. మూడోసారి అధ్యక్ష పీఠాన్ని అధిష్ఠించడంపై ఆయన ఇప్పటికే పలు వ్యాఖ్యలు చేసిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో ఓ వ్యక్తి రెండుసార్లకు మించి దేశాధ్యక్ష పదవి చేపట్టేందుకు వీలుగా రాజ్యాంగాన్ని సవరించాలంటూ పాలక రిపబ్లికన్ పార్టీ కాంగ్రెస్ (పార్లమెంటు-) సభ్యుడు యాండీ ఓగిల్స్ దిగువ సభలో ఇటీవలే సంయుక్త తీర్మానం ప్రవేశపెట్టిన విషయం తెలిసిందే. ఇది ఆమోదం పొందితే డొనాల్డ్ ట్రంప్ మూడుసార్లు అధ్యక్ష పదవికి ఎన్నిక కావడానికి వీలు కలుగుతుంది.

# సీఎంఆర్‌ఎఫ్ చెక్కులు అందజేసిన బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాధవ్

సమయజ్యోతి న్యూస్ మార్చి 31 బజార్ హత్నూర్

నేరడిగొండ మండల కేంద్రానికి చెందిన దావ్వుల రుక్మవ్వ కి మంజూరు అయిన రూ. 55,500/- మరియు ఇచ్చోడ మండలంలోని ఆడిగావ్ బి గ్రామానికి చెందిన కైలాష్ కి మంజూరు అయిన రూ. 60,000/- లు మరియు నెరడిగొండ మండలంలోని నారాయణ పూర్ గ్రామానికి చెందిన బెక్కం వినోద్ కి మంజూరు అయిన రూ. 16,500/- విలువ గల సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను ఆయన స్వగృహంలో బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాధవ్ అందజేశారు. ఈ కార్యక్రమంలో అయా గ్రామాల ప్రజలు పాల్గొన్నారు



మొదటి పేజీ తరువాయి

# ఆఫ్‌షోర్ మైనింగ్‌తో తీవ్ర నష్టం

ఆఫ్‌షోర్ మైనింగ్‌కు స్థానికుల అభిప్రాయం, పర్యావరణ అధ్యయనాలు నిర్వహించకుండా అనుమతించడాన్ని తాను తీవ్రంగా ఖండిస్తున్నానని మోడికి రాసిన లేఖలో రాహుల్ పేర్కొన్నారు. ??ఆఫ్‌షోర్ ఏరియాస్ మినరల్ (డెవలప్‌మెంట్ అండ్ రెగ్యులేషన్) సవరణ చట్టం 2023 తీవ్ర అభ్యంతరాలను ఎదుర్కొందని రాహుల్ తెలిపారు. కేరళ, గుజరాత్, అండమాన్ నికోబార్ దీవులలో గనుల మంత్రిత్వశాఖ 13 ఆఫ్‌షోర్ బ్లాక్‌లకు లైసెన్స్ మంజూరు చేసినప్పుడు ఈ నిర్ణయానికి వ్యతిరేకంగా మత్స్యకారులు నిరసన చేశారు. అలాగే ఆఫ్‌షోర్ మైనింగ్ వల్ల ముఖ్యంగా కొల్లంలో వినాశకరమైన ప్రభావం చూపుతుందని కేరళ విశ్వవిద్యాలయం లోని అక్వాటిక్ బయాలజీ మరియు ఫిషరీస్ విభాగానికి చెందిన మెరైన్ మానిటరింగ్ ల్యాబ్ (ఎంఎంఎల్) నిర్వహిస్తున్న సర్వేలో వెల్లడైందని రాహుల్ పేర్కొన్నారు. కేరళలో 11 లక్షల మందికిపైగా ప్రజలు చేపల వేటపై ఆధారపడుతున్నారు. ఈ మైనింగ్ వల్ల వారి జీవితాలపై తీవ్ర ప్రభావం పడుతుంది. ఈ మైనింగ్ వల్ల ప్రకృతి వైపరీత్యాల ప్రభావాన్ని అంచనా వేయకుండానే ఉద్దేశపూర్వకంగానే మోడీ ప్రభుత్వం ప్రయివేటు-కి అప్పగించడం ఆందోళకరం అని ఆయన లేఖలో తెలిపారు. ఈ నేపథ్యంలో ప్రయివేటు- టెండర్లను రద్దు చేయాలని ప్రభుత్వాన్ని కోరుతున్నానని రాహుల్ లేఖలో పేర్కొన్నారు.

మొదటి పేజీ తరువాయి

# భూములతో సెంట్రల్ వర్సిటీకి సంబంధం లేదు

భూముల వేలం, అక్కడ చేపట్టబోయే అభివృద్ధి పనులతో యూనివర్సిటీకి ఎలాంటి నష్టం వాటిల్లదన్నారు. అభివృద్ధికి పనులకు ఇచ్చిన భూమిలో చెరువు లేదని స్పష్టం చేశారు. అవసరం అయితే మరోసారి హెచ్‌సియూ భూములపై ప్రభుత్వం పున: పరిశీలన చేస్తుందని హామీ ఇచ్చారు. యూనివర్సిటీ భూములను కాపాడడానికి తమ ప్రభుత్వం కట్టు-బడి ఉందని మంత్రి పొన్నం ప్రభాకర్ స్పష్టం చేశారు. కాగా హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ- లో భూములు చదును చేయడాన్ని నిరసిస్తూ విద్యార్థులు ఆదివారం రాత్రి పెద్ద ఎత్తున ఆందోళనకు దిగారు. అయితే అక్కడ ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటు- చేసుకోకుండా పోలీసులు ముందస్తుగా భారీ భద్రతను ఏర్పాటు- చేశారు. యూనివర్సిటీ- పరిధిలోని 400 ఎకరాలను బుల్డోజర్లతో చదును చేసేందుకు ప్రయత్నించడంతో విద్యార్థి సంఘాలు అడ్డుకునేందుకు ప్రయత్నించాయి. వెంటనే పనులను ఆపాలని అక్కడే బైఠాయించి నిరసన తెలుపగా వారికి పోలీసులకు మధ్య స్వల్ప తోపులాట చోటు-చేసుకుంది.

మొదటి పేజీ తరువాయి

# హెచ్‌సియూ భూములు వేలం తగదు

ఈ 400 ఎకరాల భూమిని వేలం వేయాలంటూ రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని ఆయన క్రూరమైన చర్యగా అభివర్ణించారు. ప్రతిపక్షాల గొంతు నొక్కడం..విద్యార్థులను అణచివేయడం.. చెట్లను నరికివేయడంతోపాటు- పచ్చదనం, జీవవైవిధ్యాన్ని నాశనం చేయడం దారుణమని ఆయన పేర్కొన్నారు. నిధుల సమీకరణ కోసం ఈ తరహా చర్యలు చేపట్టడం పట్ల ఆయన తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. ఈ తరహా చర్యలను తెలంగాణలో కనికరం లేని కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తుందని ఆగ్రహం వ్యక్తం చేశారు. కంచ గచ్చిబౌలిలోని వందలాది ఎకరాల భూమిని ఈ ప్రభుత్వం వేలం వేయడం ద్వారా ఆ ప్రాంతంలోని గొప్ప వృక్షజాలంతోపాటు- జంతుజాలాన్ని నిర్లక్ష్యంగా తుడిచిపెట్టుకు పోవడం ఖాయమని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. మన జాతీయ పక్షులు - నెమళ్ళు అర్ధరాత్రి ఈ ప్రాంత జీవవైవిధ్యాన్ని నాశనం చేస్తున్నప్పుడు వాటి కేకలు వినడం హృదయ విదారకంగా ఉందన్నారు. హెచ్‌సియు వంటి ప్రఖ్యాత సంస్థలను ఆక్రమించుకుంటూనే..విద్యార్థుల గొంతులను దారుణంగా నొక్కేస్తున్నారని కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికే ఇదే అంశంపై సీఎం రేవంత్ రెడ్డికి కిషన్ రెడ్డి నాలుగు రోజుల క్రితం లేఖ రాసిన విషయం విదితమే. ఈ భూమల పట్ల రేవంత్ రెడ్డి ప్రభుత్వం వ్యవహరిస్తున్న తీరుపై మండిపడ్డారు. ఇదిలావుంటే హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ విశ్వవిద్యాలయం భూముల అమ్మకం ప్రతిపాదనను ఉప సంహరించుకోవాలని బిజపి జాతీయ కార్యవర్గ సభ్యుడు, మల్కాజ్‌గిరి ఎంపి ఈటల రాజేందర్ డిమాండ్ చేశారు. హైదరాబాద్‌లోని బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో సోమవారం ఈటల రాజేందర్ మీడియాతో మాట్లాడుతూ రేవంత్ రెడ్డి ప్రభుత్వం హెచ్‌సియూ భూములు అమ్మి అప్పులు కట్టాలనే నీచమైన ప్రయత్నం చేస్తుందని ఆగ్రహం వ్యక్తం చేశారు. కొన్ని వేలమంది నిష్ణాతులను తీర్చిదిద్దిన ప్రముఖ విశ్వవిద్యాలయంలో రేవంత్ రెడ్డి ఎందుకు ఇలాంటి ఆలోచన చేస్తున్నారో తెలియడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. యూనివర్శిటీ- భూముల వేలాన్ని విద్యార్థులు, అధ్యాపకులు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నా ప్రభుత్వం మొండిగా ముందుకు వెళుతోందని అన్నారు. హైదరాబాద్‌లో శ్మశానవాటికలకు కూడా జాగా దొరకని పరిస్థితి వచ్చిందని అన్నారు. పార్కులకు సైతం స్థలం లేక కాంక్రీట్ జంగల్‌గా మారుతుందని అన్నారు. కాంగ్రెస్ 15 నెలల పాలనలో ప్రతి నిర్ణయం ప్రజాకటకం, ప్రజా వ్యతిరేకమైనదేనని తెలిపారు. విద్యార్థుల మీద దాడిని తీవ్రంగా ఖండిస్తున్నామని తెలిపారు. వారికి సంఘీభావం తెలుపుతున్నామని, అవసరమైతే ప్రత్యక్ష కార్యాచరణకు దిగుతామని ఈటల హెచ్చరించారు. ఇకనైనా విశ్వవిద్యాలయం భూములు అమ్మకూడదని ఆయన డిమాండ్ చేశారు.

# హెచ్‌సిఎ, సన్‌రైజర్స్ వివాదం

## విజిలెన్స్ విచారణకు ఆదేశించిన సిఎం రేవంత్

హైదరాబాద్,మార్చి31(సమయజ్యోతి):

హైదరాబాద్ క్రికెట్ సంఘం, సన్‌రైజర్స్ హైదరాబాద్ మధ్య జరుగుతున్న వివాదం ప్రస్తుతం తీవ్ర చర్చనీయాంశంగా మారింది. కాంప్లిమెంటరీ పాస్‌లు కోసం హెచ్‌సీఏ ఉన్నతాధికారులు ఎస్‌ఆర్‌హెచ్ ఫ్రాంఛైజీని బెదిరిస్తున్నారనే ఆరోపణలు వచ్చాయి. ఈ కారణంగా సన్‌రైజర్స్ హైదరాబాద్ తమ హోమ్ గ్రౌండ్ ఉప్పల్ స్టేడియాన్ని వదిలిపెట్టే అవకాశం ఉందని కొన్ని వార్తలు చక్కర్లు కొట్టాయి. ఇకపోతే ఈ విషయంపై తాజాగా తెలంగాణ ముఖ్యమంత్రి సీఎం రేవంత్ రెడ్డి సీరియస్ అయ్యారు. ఎస్‌ఆర్‌హెచ్ యాజమాన్యాన్ని వేధింపులకు గురిచేసి పాసులు అడిగిన విషయంపై సీఎంఓ కార్యాలయం అధికారులు వివరాలు సేకరించారు. ఈ నేపథ్యంలో ఎస్‌ఆర్‌హెచ్ యాజమాన్యాన్ని పాసుల విషయంలో ఐఈఆ బెదిరించిందో లేదో అనే అంశంపై విజిలెన్స్ ఎంక్వయిరీకి ఆదేశించారు. ఈ అంశాన్ని విచారణ జరపాల్సిందిగా విజిలెన్స్ డిజి కొత్తకోట శ్రీనివాస్ రెడ్డికి ఆదేశాలు జారీ చేసారు. అయితే, ఎస్‌ఆర్‌హెచ్ యాజమాన్యాన్ని పాసుల కోసం ఇబ్బంది పెడితే చర్యలు తీసుకుంటామని సీఎం రేవంత్ హెచ్చరికలు చేసారు. ఐపీఎల్ టికెట్లు, పాస్‌ల కోసం హెచ్‌సీఏ వేధిస్తోందని ఎస్‌ఆర్‌హెచ్ ఆరోపణలు చేసిన సంగతి తెలిసిందే. ఉచిత టికెట్ల కోసం హెచ్‌సీఏ నుంచి ఎదురవుతున్న బెదిరింపుల నేపథ్యంలో తీవ్ర ఆందోళన చెందినట్లు హెచ్‌సీఏ కోశాధికారికి సన్‌రైజర్స్ ప్రతినిధి రాసిన లేఖ వెలుగులోకి వచ్చింది.ఒప్పందం ప్రకారం హెచ్‌సీఏకు 10శాతం కాంప్లిమెంటరీ టికెట్లు- కేటాయిస్తున్నామని, 50 సీట్ల సామర్థం ఉన్న ఎఫ్ 12ఏ కార్పొరేట్ బాక్స్ టికెట్లు- కూడా అందులో భాగమేనని ఆయన లేఖలో పేర్కొన్నారు. కానీ, ఈ ఏడాది దాని సామర్థం 30 మాత్రమే అని పేర్కొంటూ... అదనంగా మరో 20 టికెట్లు- కేటాయించాలని అడిగారని తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. ఈ క్రమంలోనే గత మ్యాచ్ సందర్భంగా ఎఫ్-3 బాక్సుకు తాళాలు వేశారని తెలిపారు. ఈ వ్యవహారం సీఎం రేవంత్‌రెడ్డి దృష్టికి వెళ్లడంతో హెచ్‌సీఏ తీరుపై ఆయన తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. హెచ్‌సీఏపై వస్తున్న ఆరోపణలపై విచారణ జరపాలని విజిలెన్స్ అధికారులను ఆదేశించారు. ఐపీఎల్ 2025 సీజన్‌కు సంబంధించి హెచ్‌సీఏకు ఒప్పందం ప్రకారం 10శాతం ఉచిత టిక్కెట్లు ఇవ్వాల్సి ఉంటుంది. అందులో భాగంగా 50 టిక్కెట్ల సామర్థం ఉన్న కార్పొరేట్ బాక్స్‌ను హెచ్‌సీఏకు కేటాయించారు. కానీ ఈ ఏడాది, ఆ బాక్స్ సామర్థం 30కి తగ్గిందని చెప్పి, అదనంగా మరో 20 టిక్కెట్లు ఇవ్వాలని హెచ్‌సీఏ డిమాండ్ చేసింది. దీనిపై చర్చిద్దాం అని ఎస్‌ఆర్‌హెచ్ ప్రతినిధులు సూచించగా.. ఒక మ్యాచ్ సందర్భంగా హెచ్‌సీఏ అధికారులు వారి కార్పొరేట్ బాక్స్‌కు తాళం వేశారు. చివరకు 20 టిక్కెట్లు ఇస్తేనే తాళం తీస్తామని హెచ్‌సీఏ ఒత్తిడి తెచ్చిందని ఆరోపణలు వచ్చాయి. ఈ పరిణామాల నేపథ్యంలో ఎస్‌ఆర్‌హెచ్ జనరల్ మేనేజర్ శ్రీనాథ్ హెచ్‌సీఏ కోశాధికారి శ్రీనివాస్ రావుకు లేఖ రాసినట్లు తెలుస్తోంది. ఈ లేఖలో గత రెండు సంవత్సరాలుగా హెచ్‌సీఏ పాసులు ఇచ్చినా సరే.. అదనంగా మరికొన్నిపాసులు ఇవ్వాలని వేధిస్తోందని ఆరోపించారు. ఉప్పల్ స్టేడియంలో ఆడడం ఇష్టం లేకుండా హెచ్‌సీఏ ప్రవర్తిస్తున్నట్లు అనిపిస్తోందని.. ఈ విషయాన్ని బీసీసీఐ, తెలంగాణ ప్రభుత్వం, ఐపీఎల్ గవర్నింగ్ కౌన్సిల్‌తో చర్చించి మరొక హోమ్ గ్రౌండ్ కోసం ఆలోచించాల్సి రావొచ్చని పేర్కొన్నారు. ఈ ఆరోపణలపై హెచ్‌సీఏ వెంటనే స్పందించింది. ఎస్‌ఆర్‌హెచ్ యాజమాన్యం అధికారిక ఇమెయిల్ ద్వారా తమకు ఎలాంటి సమాచారం ఇవ్వలేదని పేర్కొంది.

# అభివృద్ధి పనులకు ప్రభుత్వ విప్.. కలెక్టర్ తో కలిసి భూమి పూజ

**సమయజ్యోతి న్యూస్ ముస్తాబాద్**

ప్రజలు, చిరు వ్యాపారులకు సౌకర్యంగా ఉండేలా వేములవాడలో వీధి విక్రయ మార్కెట్ జోన్ నిర్మాణాలు చేపడుతున్నట్లు ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ తెలిపారు. వేములవాడ పట్టణంలో 80 లక్షలతో నిర్మించనున్న వీధి విక్రయ మార్కెట్ జోన్ పనులకు, 56 లక్షలతో పట్టణంలోని 11,12 వార్డుల్లో నిర్మించనున్న సీసీ రోడ్లు, సీసీ డ్రైనేజీలు నిర్మాణానికి ప్రభుత్వ విప్, కలెక్టర్ సందీప్ కుమార్ ఝా తో కలిసి, సోమవారం శంకుస్థాపన చేశారు. వేములవాడ పట్టణంలో ప్రజలకు అందుబాటులోకి బైపాస్ రోడ్డులో కూరగాయల మార్కెట్లో రూ. 80 లక్షలతో 68 కూరగాయల స్టాల్స్ నిర్మిస్తున్నామని తెలిపారు. కలెక్టర్ చొరవతో ప్రజలు, మార్కెట్లో కూరగాయలు విక్రయిస్తున్న వారి కోరిక మేరకు నూతన నిర్మాణాలు చేపడుతున్నామని వివరించారు. ఎండాకాలం, వర్షాకాలం ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా హైదరాబాద్ లాంటి పట్టణాల్లో ఉన్న విధంగా స్టాల్స్ నిర్మిస్తున్నామని విప్ తెలిపారు. వేములవాడలో పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా పట్టణాన్ని తీర్చిదిద్దుతామని స్పష్టం చేశారు. ఇందులో భాగంగానే ప్రజల అవసరాలకు అనుగుణంగా దుకాణాల సముదాయాలు, మార్కెట్ల నిర్మాణాలు చేపట్టడం జరుగుతుందని తెలిపారు. రూ.56 లక్షల తో సీసీ రోడ్లు సైడ్ డ్రైన్ ల నిర్మాణం చేపట్టామని వెల్లడించారు. పట్టణంలో ఉన్న 28 వార్డుల్లో ప్రతి వార్డులో 10 లక్షలతో కనీస అవసరాలను దృష్టిలో ఉంచుకొని పనులను చేపడతామని పేర్కొన్నారు. భూసేకరణకు రూ.6 కోట్ల నిధులు, పట్టణ ప్రజలతోపాటు రాజన్న భక్తులు సుదీర్ఘంగా ఎదురుచూస్తున్న మూడో బ్రిడ్జి నిర్మాణం చేపడుతున్నామని వివరించారు. 47 కోట్లతో రోడ్డు వెడల్పు చేయబోతున్నామని వివరించారు. 76 కోట్లతో రాజన్న ఆలయ విస్తీర్ణకు ఇప్పటికే టెండర్ల ప్రక్రియ పూర్తయింది. త్వరలో పనులు ప్రారంభం జరుగుతుందని విప్ వెల్లడించారు. రాజన్న దర్శనానికి వచ్చే భక్తులకు మెరుగైన వసతులు కల్పిస్తామని తెలిపారు. పట్టణానికి నూతన ఆధ్యాత్మిక శోభను



తీసుకురావడానికి కృషి చేస్తున్నానని ప్రకటించారు. 1 కోటి 50 లక్షలతో బస్తీ దవాఖాన నిర్మాణం చేపట్టడం జరుగుతుందని, 80 లక్షలతో తిప్పాపూర్ వెళ్లే రోడ్డుకు ట్రాక్ నిర్మాణం చేపట్టడం జరుగుతుందనీ వివరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ నాగుల సత్యనారాయణ గౌడ్, మార్కెట్ కమిటీ చైర్మన్ రొండి రాజు, వైస్ చైర్మన్ రాకేష్, మున్సిపల్ కమిషనర్ అన్వేష్, స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

## తాడ్వాయి కి పాదయాత్ర బయలు దేరిన గిర్నూర్ గ్రామస్తులు

**సమయజ్యోతి న్యూస్ మార్చి 31 బజార్ హత్నూర్**

బజార్ హత్నూర్ మండలంలో గిర్నూర్ గ్రామస్తులు గత 30 సంవత్సరాలుగా నిజామాబాద్ జిల్లా లోని తాడ్వాయి కి పాదయాత్ర చేస్తున్నారు శ్రీ రామ నవమి సందర్భంగా ప్రతి సంవత్సరం ఉగాది మరుసటి రోజున ఈ పాదయాత్ర ప్రారంభిస్తారు శ్రీ రామ నవమి రోజున తాడ్వాయి లోని శ్రీశ్రీ పరమ హంస సద్గురు శ్రీ శబరిమత గుడిలో జరిగే శ్రీ రామ నవమి వేడుకలు అంగ రంగ వైభవంగా జరుగుతాయి వాటిని తిలకించడానికి వెళ్ళడం ఆనవాయితీ గా వస్తుంది అని శబరి మాత భక్తులు ఒక ప్రకటనలో తెలిపారు



## డి.ఎస్పి ఉద్యోగానికి ఎంపికైన ఎస్సై కు సన్మానం.

**సమయజ్యోతి న్యూస్ గుడిహత్నూర్:**

గ్రూప్-1 ఫలితాల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచి డీఎస్పీగా ఎంపికైన గుడిహత్నూర్ ఎస్సై కరాండే మహేందర్ ను సామాజిక సేవకుడు రత్న సాన్వి వెల్ఫర్ సొసైటీ వ్యవస్థాపకుడు ఉప్పారపు సత్యరాజ్ శుభాకాంక్షలు తెలిపి అంబెద్కర్ చిత్రపటాన్ని బహుకరించి శాలువాతో సన్మానించారు. ఈ సందర్భంగా సత్యరాజ్ మాట్లాడుతూ పట్టుదల,ఏకాగ్రతతో చదివి డి.ఎస్పి ఉద్యోగాన్ని సాధించిన ఎస్సై ను స్ఫూర్తిగా తీసుకొని నేటి యువకులు ఉద్యోగాలు సాధించాలన్నారు. ఈ కార్యక్రమంలో అమరేశ్వర్,సోయం సతీష్, రాహుల్, గణేష్, అశోక్, రాంకుమార్, చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.




## ప్రవక్త మార్గాన్ని అందరూ అనుసరించాలి

**సమయజ్యోతి న్యూస్ అచ్చంపేట**

అచ్చంపేట పట్టణంలోని ఈద్గాలో మహబూబ్ అలీ ఆహ్వానం మేరకు అచ్చంపేట కాంగ్రెస్ నాయకులు రాష్ట్ర లీగల్ సేల్ అధ్యక్షులు ఛత్రు నాయక్, తాలూకా ఎస్సీ సెల్ అధ్యక్షులు చింతల రాజగోపాల్ తో కలిసి రంజాన్ పండుగ సందర్భంగా నిర్వహించే ప్రత్యేక ప్రార్థనలో పాల్గొన్నారు. అనంతరం ఛత్రు నాయక్ మాట్లాడుతూ మహమ్మద్ ప్రవర్తన అనుసరించిన మార్గాన్ని ప్రతి ముస్లింలు పాటించాలని తెలిపారు ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ ముస్లిం నాయకులు పాల్గొన్నారు.



## గ్రూప్-1 లో ప్రతిభ చాటిన అదనపు కలెక్టర్ భార్య బరీరా ఫరీద్

**సమయజ్యోతి న్యూస్,నిర్మల్ బ్యూరో, మార్చి 31.**



తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ విడుదల చేసిన గ్రూప్- పరీక్ష ఫలితాల్లో, నిర్మల్ అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) ఫైజాన్ అహ్మద్ భార్య బరీరా ఫరీద్, రాష్ట్ర స్థాయిలో 68వ ర్యాంక్ మరియు విభాగంలో 1వ ర్యాంక్ సాధించి, అద్భుతమైన పనితీరును కనబరిచారు. బరీరా ఫరీద్ హైదరాబాద్‌లోని ఉస్మానియా విశ్వవిద్యాలయం నుండి డాక్టర్ ఆఫ్ ఫార్మసీ (ఫార్మ్.డి.) డిగ్రీని పూర్తి చేసింది. ఆమె గతంలో పరీక్షలకు సిద్ధమవుతున్నప్పుడు 2022లో సివిల్ సర్వీసెస్ ఇంటర్వ్యూకు హాజరయ్యారు. ఆమె హైదరాబాద్‌కు చెందిన షేక్ ఫరీరుద్దీన్ మరియు షమీమున్నీసా దంపతుల కుమార్తె. ఆమె తండ్రి భారత వైమానిక దళం నుండి రిటైర్డ్ అధికారి. ఏడుగురు తోబుట్టువులలో బరీరా ఫరీద్ చిన్నది. గ్రూప్- ర్యాంకింగ్స్‌లో ఆమె అత్యుత్తమ విజయాన్ని అభినందిస్తూ, అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్ మరియు ఆమె కుటుంబ సభ్యులు ఆమెకు హృదయపూర్వక అభినందనలు తెలిపారు.

## ఆధ్యాత్మికంగా ఉంటేనే ప్రశాంత భవిష్యత్తు, రంజాన్ శుభాకాంక్షలు తెలిపిన మాజీ మంత్రి అల్లోల

**సమయజ్యోతి న్యూస్ నిర్మల్ బ్యూరో మార్చి 31.**

ఆధ్యాత్మికంగా ఉంటేనే ఆరోగ్యకరమైన భవిష్యత్తు ఉంటుందని రాష్ట్ర మాజీ మంత్రి అల్లోల ఇంద్రకరణ్ రెడ్డి అన్నారు. సోమవారం పట్టణం లోని డాక్టర్ అజ్హరుద్దీన్, అరిఫోద్దీన్ గాజుల్పేట్ గృహంలో ఏర్పాటు చేసిన రంజాన్ వేడుకల్లో ఆయన పాల్గొన్నారు. పవిత్ర రంజాన్ మాసం మహోన్నతమైన?దని పేర్కొన్నారు. ముస్లీం సోదరులు తమ నిత్య ప్రార్థనల లో మత సమైక్యతతో పాటు దేశ సమగ్ర అభివృద్ధి కై భగవంతున్ని కోరుకోవాలని చెప్పారు.వీరితో ధర్మాజీ రాజేందర్ డాక్టర్ అజ్ హర్ ఎఫ్.ఎస్.సి.ఎస్. చైర్మన్, మహిపాల్ రెడ్డి మాజీ ఎంపీపీ, పాకాల రాంచేందర్, శ్రీకాంత్ యాదవ్, వినయ్, గజేందర్, అనుముల భాస్కర్, రవి, రాఘవేందర్ ముడుసు సత్యనారాయణ, నవీన్, నరేందర్, నీగులపు సంజీవ్ తదితరులు ఉన్నారు.



## రంజాన్ శుభాకాంక్షలు తెలిపిన ప్రముఖులు

**సమయజ్యోతి న్యూస్ రామచంద్రాపురం**

ముస్లింలకు పలువురు ప్రముఖులు రంజాన్ శుభాకాంక్షలు తెలియచేశారు శుభాకాంక్షలు తెలిపిన వారిలో కార్పొరేటర్ పుష్పానగేష్ దంపతులు బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు ఆదర్శ్ రెడ్డి భారతి నగర్ మరియు రామచంద్రపురం డివిజన్ లో పవిత్ర రంజాన్ పండుగ సందర్భంగా ఈద్గా లో ప్రార్థనలు చేసి ముస్లిం సోదరుల కు ఈద్ ముబారక్ తెలియజేశారు ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ నాయకులు పరమేష్ యాదవ్ డివిజన్ ప్రెసిడెంట్ బూన్ డివిజన్ మైనార్టీ అధ్యక్షుడు అజీముద్దీన్ మైనార్టీ నాయకులు గౌస్ రఫిక్ కుతుబద్దీన్ మునీర్ బాబా షరీఫ్ జాకీర్ షకీల్ మైనార్టీ సోదరులు తదితరులు పాల్గొన్నారు



## మత సామరస్యానికి ప్రతీక రంజాన్

**సమయజ్యోతి ప్రతినిధి హన్మకొండ**

మత సామరస్యానికి ప్రతీక రంజాన్ అని తెలంగాణ సామాజిక రచయితల సంగం రాష్ట్ర అధ్యక్షలు కామిడి సతీష్ రెడ్డీ అన్నారు హన్మకొండ టీ న్ జి వో ఎస్ కాలనీ లో తమ గురూసమానులు పరకాల పాఠశాల పూర్వ ప్రధానోపాధ్యాయులు ఎం డి మస్తాన్ వలీ ఇంటిలో జరిగిన రంజాన్ వేడుకల్లో పాల్గొని వారి కుటుంబ సభ్యులకు ఈద్ ముబారక్ తెలియ చేశారు ఈదుల్ ఫిత్రు సందర్భం గా వారు మాట్లాడుతూ రంజాన్ ముస్లిం ల గొప్ప పండగ అన్నారు అనంతరం సహ పంక్తి భోజనాలు చేశారు వారితో పాటు జగిత్యాల జిల్లా మోగిలి పేట గెజిటెడ్ ప్రధానో పాధ్యాయులు కొమ్మిడి లక్ష్మణ్ రెడ్డి శ్రీకాంత్ రెడ్డీ గోపాల్ రెడ్డి రాజీ రేడ్డి చిట్టి రెడ్డి రాజి రెడ్డీ జసగదీశ్వర్ దాస్ కుమార్ రాజు సిన్హా పాల్గొన్నారు



## రాష్ట్ర స్థాయి ఉగాది పురస్కారము అందుకున్న కామిడి సతీష్ రెడ్డి

**సమయజ్యోతి ప్రతినిధి భూపాల్ పల్లి**

సామాజిక సేవా రంగము తో పాటు వ్యాసకర్త గా రక్త దాత గా విబిన్న రంగాలలో రాణిస్తున్న ప్రభుత్వ టీచర్ కామిడి సతీష్ రెడ్డి కి ఉగాది పర్వ దిన సందర్భంగా వివేకానంద సేవా సమితి భూపాల్ పల్లి లోని పుష్ప గ్రాండ్ లో జరిగిన రాష్ట్ర స్థాయి ఉగాది అవార్డు ల ప్రదాన కార్యక్రమం లో చిట్యాల్ మండలం జడల్ పేట గ్రామానికి చెందిన కామిడి సతీష్ రెడ్డి ని భూపాల్ పల్లి శాసన సభ్యులు గండ్ర సత్యనారాయణ రావు ప్రముఖ సినీ హాస్య నటులు డి ఎస్ నంద న్ స్ ఆర్ విద్యాసంస్థల అధినేత ఎన్ సంపత్ రావు సిరికొండ తిరుపతి రావు వివేకానంద సేవా సమితి అధ్య క్షులు కొలుగూరి సంజీవ రావు తదితరులు ఘనంగ సన్మానించి అవార్డు ప్రధానం చేసారు సతీష్ రెడ్డి మహా ముత్తారం మండలం ములుగు పల్లి ఉన్నత పాఠశాలలో బయాలజీ స్కూల్ అసిస్టెంట్ గా చేస్తున్నారు సతీష్ రెడ్డి రాష్ట్ర స్థాయి అవార్డు అందుకోవడము పట్ల పాఠశాల ప్రధానోపాధ్యాయులు పాశం సంజీవ రెడ్డి ఉపాధ్యాయులు కుటుంబ సభ్యులు గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు



## పద్మశాలి సేవా సంఘం నూతన కార్యవర్గం

**సమయజ్యోతి న్యూస్ ముస్తాబాద్**

రాజన్న సిరిసిల్ల జిల్లా ముస్తాబాద్ మార్కండేయ దేవాలయంలో ఉగాది పర్వదినం వేడుకల అనంతరం పట్టణ పద్మశాలి సేవా సంఘం నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షులుగా తడక బాలకిషన్, ఉపాధ్యక్షులుగా గౌడ మల్లేశం, ఎనగందుల దశరథం, ప్రధాన కార్యదర్శిగా దొంత బాలరాజు, కార్యదర్శులుగా బిట్ల దేవానందం, బండారి శ్రీకాంత్, ప్రధాన కోశాధికారిగా గౌడ కృష్ణ హరి, చిట్టి కోశాధికారిగా శ్రీరామ్ మనోహర్, కార్యవర్గ సభ్యులుగా గౌడ సహదేవ్, మెరుగు భూమేష్, గౌడ మల్లేశం, మారెల్లి శ్రీనివాస్, దొంత శ్రీనివాస్, తడక ప్రభాకర్, గౌడ అరుణ్ కుమార్, గౌరవ సలహాదారులుగా తడక లక్ష్మీనారాయణ, బిట్ల వజ్రనందం, దండే రామకృష్ణ, ఆడెపు లక్ష్మీనారాయణ, వడ్నాల రాజు, దైవశెట్టిగా ఆమంచ సత్యనారాయణ ఎంపికయ్యారు.




సమయజ్యోతి
తెలుగు దినపత్రిక

# చర్చల ఎజెండాను ప్రజలే నిర్ణయించాలి !

ప్రజలు ఎదుర్కొంటున్న ప్రధాన సమస్యలు చట్టసభల్లో చర్చకు రావడం లేదు. అసెంబ్లీ కావచ్చు, పార్లమెంట్ కావచ్చు రాజకీయనాయకులు తమ ఎజెండా మేరకు ముందకు సాగుతున్నారు. అందువల్ల ప్రజలే ముందుకు వచ్చి ప్రధాన సమస్యలపై రచ్చబండలో చర్చించాలి. సామాజిక మాధ్యమాల్లో ప్రచారం చేయాలి. ప్రధానాంగా సాగు,తాగునీరు, రోడ్లు, కమ్యూనికేషన్, విద్యుత్, వైద్యం, విద్య, పన్నులు. నిత్యావసర ధరలపై చర్చచేయాలి. దరల పెరుగుదల, నివారణ చర్యలపై చర్చించి వాటిని తమ ప్రజాప్రతినిధులకు నివేదికల రూపంలో అందించాలి. చట్టసభల్లో ఈ సమస్యలు చర్చించాలని కోరాలి. ఎజెండాను ప్రజలే నిర్ణయించడం ద్వారా కొత్త రాజకీయాలకు తెలేపాలి. లేకుంటే చట్టసభల్లో సమస్యలు చర్చించరు. అందుకు అనుగుణంగా చట్టాలు రూపొందించడం జరగడం లేదు. ఎన్నికయ్యే సభ్యులు ఏం చేయబోతున్నారో ముందే హామీ ఇచ్చారు గనక వాటిపై నిలదీయాలి. ఎందుకంటే పార్లమెంట్‌లో చర్చలకు అవకాశం రావడం లేదు. గత పదేళు గా ఏ అంశాన్ని కూడా చర్చించడానికి బిజెపి నేతృత్వంలోని ప్రభుత్వం ముందుకు రావడం లేదు. అవసరమైనన్ని రోజులు సమావేశాలు నిర్వహించడం, తమకు అనుకూలమైన బిల్లులు రూపొందించడం..ముగించడం అన్న ప్రక్రియను బిజెపి ఎంచుకుంది. ఇది ఎవరికి లాభమో ప్రజలు ఆలోచన చేయాలి. ఈ క్రమంలో బిజెపి అభ్యర్థులను ఈవిషయంలో ప్రజలు నిలదీయాలి. మీరు సమస్యలు చర్చించే స్వేచ్ఛను మీకు పార్టీ ఇస్తుందా అని అడగాలి. నియోజకవర్గ సమస్యలను చర్చించే అవకాశం ఏ ఒకకక ఎంపికి కూడా సరిగా రావడం లేదు. పార్లమెంట్ సమావేశాలు ఎన్నిసార్లు జరిగినా మొక్కుబడిగా ముగించేస్తున్నారు. ఏటా రెండుమూడుసార్లు సమావేశాలు జరుగుతున్నా ప్రధాన సమస్యలపై చర్చించేందు కు అధికార బిజెపి ముందుకు రావడం లేదు. గొప్పలు చెప్పుకుంటున్న బిజెపి నేతలు కూడా ప్రజల సమస్యలపై చర్చించాలన్న ఆసక్తిని ప్రదర్శించడం లేదు. పార్లమెంట్ ఉన్నదే ప్రజల సమస్యలపై చర్చించడానికి అన్న స్పృహ లేకుండా కాలాన్ని గడిపేశారు. పార్లమెంట్ సమావేశాలు మొక్కుబడిగా జరుగుతున్న వేళ..ఎంపిలను ఎన్నుకుని ఏం లాభం అన్న అనుమానం కలుగుతోంది. ఈ తరహా ప్రజాస్వామ్యం ఆందోళనకరం కాక మరోటికాదు. ప్రజలు అనేకానేక సమస్యలు ఎదుర్కొంటున్నారు. రైతులు సమస్యలు ఎదుర్కొంటున్నారు. ధరల దాడితో సామాన్యులు అతలాకుతలం అవుతున్నారు. జిఎస్టీ పేరుతో బాదేస్తున్నారు. ఇవన్నీ ఎవరికి చెప్పుకోవాలి. ఎవరు వీటిని చర్చించి నిర్ణయిస్తారు. కేవలం పార్లమెంటుకు మాత్రమే చర్చించే అవకాశం ఉంది. కాబట్టి ఎంపిలు ఇప్పటినుంచి ఈ సమస్యలపై సిద్దంగా ఉండాలి. పార్లమెంటులో తమకు మెజార్టీ ఉందికదా అని అధికారపార్టీ సమస్యలపై ఇంతకాలం పెద్దగా చర్చకు పూనుకోలేదు. ఇంతకన్నా దారుణం ఉండదు. నిజానికి దేశంలో నేటికీ పంటల కొనుగోళ్లకు సంబంధించి స్పష్టమైన విధానాలు లేవు. మద్దతు ధరలకు సంబంధించి స్పష్టమైన విధానాలు లేవు. రైతులు ఆరుగాలం కష్టించి పండించిన పంటలను ఎలాగైనా కొనుగోలు చేసి... వాటిని ప్రజలకు చేర్చాలన్న విధానాలూ లేవు. పంటల కొనుగోళ్లకు సంబంధించి జాతీయ విధానం, ఆహార పంటల ఎగుమతుల విధానాలను అమలు చేయడం లేదని వ్యవసాయ నిపుణులు ఎప్పటినుంచో మొత్తుకుంటున్నారు. కందుల కొనుగోళ్లకు సంబంధించి ఇప్పటివరకు స్పష్టత లేదు. మార్క్‌ఫెడ్ రంగంలోకి దిగడంలేదు. ఇప్పటికే రైతులు పంటను అమ్మడానికి సిద్దం చేశారు. ఓవైపు కందిపప్పు ధరలు అమాంతంగా పెరుగుతున్నా.. కందులకు ధరలు మాత్రం రైతులకు దక్కడం లేదు. మార్కెట్‌లో సామాన్యులకు పప్పుల ధరలు అందనంతగా పెరిగాయి. సాగుచట్టాలను బలవంతగా రుద్దేందుకు యత్నించిన కేంద్రం ..పంటల కొనుగోళ్లకు సంబంధించి జాతీయ విధానాలను నేటికీ రూపొందించడంలేదు. నిజానికి సాగుచట్టాల్లో ఇవన్నీ పొందుపర్చి ఉంటే ఆందోళనలు జరిగి వుండేవి కాదు. ఏ రాష్ట్రంలో ఏ పంట పండుతుందో లెక్కలు వేయాలి. ఏపంట పండించాలో కూడా లెక్కలు వేయాలి. దేశానికి ఏ పంటలు అవసరమో ప్రణాళిక సిద్దం చేయాలి. కానీ అలా జరగగడం లేదు. పార్లమెంటులో ఇలాటి అత్యవసర సమస్యలపై సమగ్రంగా చర్చించడం లేదు. కేవలం ఎన్నికల కోసం పథకాలు చేపట్టడం, ఓటు బ్యాంక్‌ను సృష్టించడం వంటివాటి పైనే ప్రధానంగా దృష్టి సారిస్తున్నారు. ఈ దేశంలో అనుత్పాదక రంగాలను పెంచి పోషిస్తున్నారు. దుబారా ఖర్చులు చేస్తున్నారు. వీటి గురించి ఎవరు కూడా నిలదీయడం లేదు. బ్యాంకులను ముంచినోళ్లను.. కంపెనీలు పెట్టి రుణాలు ఎగ్గొట్టినోళ్లను వెనకేసుకుని వస్తున్న మోడీ ప్రభుత్వం రైతులకు సంబంధించి ఆమోదయోగ్య విధానాలను మాత్రం రూపొందించడం లేదు. పంటల కొనుగోళ్లను రాష్ట్రాలకు వదిలేయడం వల్ల ధాన్య సేకరణ అన్నది ఇప్పటికీ ఓ మిధ్యగా మారింది. మిర్చి,పత్తి, వరి తదితర పంటలకు సేకరణ విధానం లేక పోవడంతో రైతులు నష్టపోతున్నారు. పంటలు మార్కెట్‌కు తరలిస్తున్నా..గిట్టుబాటు ధరలు రావడం లేదు. ఈ దశలో వారివద్దనుంచి పంటలను కనీస మద్దతు ధరలకు కొనుగోళ్లు చేసేలా చర్యలు తీసుకోవాలి. వారిని ఆదుకునేందుకు ఎంత సాయం చేసినా దేశ అభివృద్ధికి పునాది పడినట్లే. రైతుల్లో నైరాశ్యం నెలకొంటే దేశానికే ప్రమాదం. పంటలు పండించిన రైతులను ఆదుకునేందుకు కేవలం పంటలను మద్దతు ధరలు ఇచ్చి కొనుగోలు చేయాలని ఏటా ఆందోళనలు చేస్తున్నా, రోడ్డెక్కుతున్నా ప్రభుత్వాలకు చీమకుట్టినట్లు కూడాలేదు. మొన్నటికి మొన్న ఎపిలో మిర్చి ధరల కోసం రైతులు ఆందోళనకు దిగారు. తమ పంటను కొనుగోలు చేయాలంటూ ఆందోళనలకు దిగడం పరిపాటే అన్న ధోరణిలో ప్రభుత్వాలు నిమ్మకు నీరెత్తినట్లుగా ఉంది. ధరలు పెరుగుతున్నా పండిన పంటను ప్రజలకు చేరువ చేయడంలో ప్రభుత్వం విఫలం అవుతోంది. సహకార సంఘాలు, మార్కెట్ కమిటీలు ఉన్నా లాభం లేదన్న పరిస్థితి ఏర్పడింది. సిసిఐ, మార్క్‌ఫెడ్ లాంటి సంస్థలు ఉన్నా న్యాయం జరగడం లేదు. ఇలా ఎంతకాలం రైతులు ఆందోళనలకు దిగాలో పాలకులు చెప్పాలి. ఇవన్నీ చెప్పుకోవడానికి వేదిక లేదు. చర్చిద్దామంటే పార్లమెంటులో అవకాశం ఇవ్వడం లేదు. అందువల్ల ప్రజలు పార్లమెంట్ చర్చలపై ఎంపిలను నిలదీయాలి. అప్పుడే పాలకులుగా ఉన్నవారు,ఓట్లు అడుగుతున్న వారు తప్పులు గుర్తిస్తారు. ప్రజలు కూడా తాయిలాలకు లొంగి ఓటేసినంత కాలం ఇలాంటి దౌర్భాగ్యపు పాలన తప్పదు.

## రక్త ప్రసరణ మార్గానికి ఆద్యులు విలియం హార్వే



మానవ శరీరం లో రక్తం ప్రధాన పాత్ర పోషిస్తుంది ఆరోగ్య వంతుడి లో సుమారు అయిదు నుండి ఆరు లీటర్ల రక్తం ఉంటుంది నేడు అనేక మంది రక్త లేమితో భాద పడుతూ వున్నారు రక్తం రక్త నాళాలలో ప్రశరణ చేస్తుంది అలాంటి రక్తము మీద ఎన్నో పరిశోధనలు చేశాడు విలయం హార్వే విలియం హార్వే ఏప్రిల్ 1, 1578 న జన్మించారు ప్రపంచ ప్రఖ్యాతి గాంచిన వైద్యశాస్త్రవేత్త. గుండె పనిచేసే తీరును, శరీరంలో రక్తప్రసరణ జరిగే పద్ధతిని చాలా క్రితమే వివరించి నేటి వైద్యులకు మార్గదర్శకుడయ్యాడు. మనిషి గుండెకు సంబంధించిన పూర్తి వివరాలను మిగతా జంతువుల గుండెలతో పోల్చి చూసి శాస్త్ర బద్ధంగా అందజేసిన ఘనత విలియం హార్వేకు దక్కుతుంది. విలియం హార్వే ఇంగ్లండులోని ఫోక్‌స్టోన్‌లో 1578 ఏప్రిల్ 1న సంపన్నుడైన పట్టణ మేయరుకు పదిమంది సంతానంలో ఒకడిగా పుట్టాడు. పదిహేనవ యేట కేంబ్రిడ్జిలోని సైన్స్ కాలేజీలో చేరాడు. పట్టభద్రుడయ్యాడు. ఆపై వైద్య విద్య కోసం ఇటలీలోని పాడువా వైద్య విద్యాలయంలో చేరాడు. అక్కడ హారోనిమస్ ఫాబ్రీసియస్ అనే ప్రముఖ వైద్య శాస్త్రజ్ఞుని వద్ద శిష్యరికం పుచ్చుకున్నాడు. 1602 లో వైద్య శాస్త్రంలో పట్టా పుచ్చుకొనటమే కాకుండా ప్రత్యేకమైన యోగ్యతా పత్రాన్ని పొందగలిగాడు. అక్కడి నుంచి లండన్ తిరిగి వచ్చాక ఇంగ్లండ్ రాజు మొదటి ఛార్లెస్ కొలువులో ఆస్థాన వైద్యుడిగా నియమితుడయ్యాడు. అంతటి హోదాలో ఉన్న సంపన్నుడెవరైనా విలాసంగా జీవితం గడిపేస్తారేమో కానీ, విలియం హార్వే మాత్రం కొత్త విషయాలు తెలుసుకోడానికి పరిశోధకుడిగా మారాడు. గుండెకు సంబంధించిన సందేహాలు మాత్రం ఆయనను వదలలేదు. గుండె నుండి బయలుదేరిన రక్తం రక్త నాళాలలో అటూ ఇటూ ప్రవహించి చివరికి హరించుకు పోతుందే తప్ప మళ్లీ గుండెను చేరదు అనే వాదంలో నిజం ఉన్నట్లు హార్వేకు తోచలేదు. పెద్ద పెద్ద సిరలలో కవాటాలు ఎందుకు ఉంటాయనే తపన కూడా ఈయనలో బయలుదేరింది. 1615 లో రాయల్ కాలేజ్ ఆఫ్ ఫిజీషియన్స్ లో ఈయన లెక్చరర్ గా నియమింప బడ్డారు. చేపలు, కప్పలు, కోళ్ళ పిండాలను జాగ్రత్తగా పరిశీలిస్తూ వాటి రక్త ప్రసరణ గురించి ఎంతో క్షుణ్ణంగా అధ్యయనం చేయసాగాడు. గుండె ముడుచు కోవటం వల్ల రక్తం ధమనుల ద్వారా రక్త నాళాలకు వెళు తుందని తెలుసుకున్నాడు. నాడి కొట్టుకోవడం అంటే గుండె కొట్టుకోవడమే అని రుజువు చేశాడు. గుండెలో నాలుగు గదులు ఉంటాయని, ధమనుల ద్వారా గుండె లోని రక్తం బయటికి పంప్ చేయబడుతుందని, సిరల ద్వారా కవాటాలు రక్తాన్ని గుండె వైపుకి వెళ్ళనిస్తాయే కాని గుండె లోంచి రక్తాన్ని వెలుపలికి రానివ్వవని తెలుసుకున్నాడు. ఒక అర గంటలో శరీరంలో ఉన్న మొత్తం రక్తం గుండె నుండి వెలువడే రక్తమే ఎక్కువగా ఉంటుందని నాడీ వేగం, గుండె స్పందించే రేటు ఆధారంగా నిర్ధారించుకోగలిగాడు. మానవ శరీరంపై ఆసక్తి పెంచుకున్న హార్వే అనేక జంతువుల శరీర అంతర్భాగాలను క్షుణ్ణంగా పరిశీలించి గుండె పనితీరు, రక్త ప్రసరణ విధానాలను గమనించాడు. చనిపోయిన ఖైదీల శరీరాలను అడుగడుగునా పరిశీలించడం ద్వారా గుండె ఒక పంపులాగా పనిచేస్తుందని, శరీరంలో సిరలు, ధమనుల ద్వారా రక్తం వలయాకారంలో ప్రవహిస్తుందని తెలుసుకున్నాడు. రక్తం ప్రవహించే మార్గంలో వాల్వులు ఎలా పనిచేస్తాయో కనిపెట్టాడు. మనిషి గుండె నిమిషానికి ఎన్ని సార్లు కొట్టు కుంటుందో, ఎంత రక్తాన్ని పంప్ చేస్తుందో చెప్పగలిగాడు. తన పరిశీలనలతో రెండు అమూల్య మైన గ్రంథాలను వెలువరించాడు. వీరు జూన్ 3 1657 లో మర ణించారు మంచి పౌస్తికా హరము తీసుకుంటే రక్తము వృద్ధి అవుతూ వుంది విలియం హార్వే జయంతి ని ప్రతీ పాఠశాల లో జరుపుకుందాం వారి గూర్చి విద్యార్థులకు తెలుపుదాం

సమయజ్యోతి తెలుగు దినపత్రిక ప్రత్యేకం

**కామిడి సతీష్ రెడ్డి ములుగు పల్లి ఉన్నత పాఠశాల భూపాల్ పల్లి జిల్లా**

**ఏప్రిల్ 1 న విలియం హార్వే జయంతి సందర్భంగా**

**9848445134**

## సీఎం చిత్రపటానికి గిరిజనుల పాలాభిషేకం

**సమయజ్యోతి న్యూస్ ముస్తాబాద్**

గోర్ బోలీ బాషను భారత రాజ్యాంగంలోని 8వ షెడ్యూలోకి చేర్చి శాసనసభలో తీర్మానం చేసి కేంద్రానికి ప్రతిపాదిస్తూ పంపడం పట్ల హర్ష వ్యక్తం చేస్తూ రాజన్న సిరిసిల్ల జిల్లా ముస్తాబాద్ మండల కేంద్రంలో సోమవారము నాయకులు భూక్య భాస్కర్ ఆధ్వర్యంలో గిరిజనులు సీఎం చిత్రపటానికి పాలాభిషేకం జరిపారు.



## హెచ్ సి యు భూములు అమ్మవద్దు:ఏఐఎస్ఎఫ్

**సమయజ్యోతి న్యూస్ ముస్తాబాద్**



హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ భూములు అమ్మ వద్దని, దీన్ని నిరసిస్తూ విద్యార్థులు శాంతియుతంగా చేస్తున్న పోరాటాన్ని ప్రభుత్వం లాఠీ చార్జీలు చేస్తూ అక్రమ అరెస్టులు చేస్తూ ఉద్యమాన్ని ఉక్కుపాదంతో అణిచివేయాలని చూడడం సమంజసం కాదని, భూముల విక్రయము నిర్ణయాన్ని ప్రభుత్వం వెంటనే ఉపసంహరించుకోవాలని ఏఐఎస్ఎఫ్ రాజన్న సిరిసిల్ల జిల్లా అధ్యక్షులు కుర్ర రాకేష్ అన్నారు. భూములను ప్రజల అవసరం కోసమే యధాతధంగా ఉంచాలని

## భగవాన్ శ్రీ సత్యసాయిబాబా సేవాసమితి సేవలు అభినందనీయం

### ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి

**సమయజ్యోతి న్యూస్ రామచంద్రాపురం**

సమాజ సేవలో శ్రీ భగవాన్ సత్యసాయి బాబా సేవాసమితి సేవలు అభినందనీయమని పటాన్చెరు శాసనసభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి అన్నారు వేసవికాలం సందర్భంగా ప్రయాణికుల దాహార్తిని తీర్చేందుకు పటాన్చెరు పట్టణంలోని బస్టాండ్ ఆవరణలో ఏర్పాటుచేసిన శ్రీ భగవాన్ సత్యసాయిబాబా చలివేంద్రాన్ని సోమవారం ఉదయం ఎమ్మెల్యే జిఎంఆర్ ప్రారంభించారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి సంవత్సరం వేసవికాలంలో చలివేంద్రాలను ఏర్పాటు చేసి ప్రజల దాహార్తిని తీర్చడం స్ఫూర్తిదాయక మన్నారు అనంతరం సత్యసాయి బాబా పూజా కార్యక్రమంలో పాల్గొన్నారు ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు చంద్రశేఖర్ రెడ్డి సంస్థ ప్రతినిధులు పాల్గొన్నారు




## రంజాన్ వేడుకల్లో ఎమ్మెల్యే జిఎంఆర్

**సమయజ్యోతి న్యూస్ రామచంద్రాపురం**

ముస్లింలు అత్యంత పవిత్రంగా నిర్వహించుకునే రంజాన్ పర్వదినం వేడుకల్లో పటాన్చెరు శాసనసభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి పాల్గొన్నారు తన నివాసంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ముస్లిం సోదరులకు రంజాన్ శుభాకాంక్షలు తెలియజేశారు పటాన్చెరు పట్టణంలోని వివిధ ఈద్గాల వద్ద నిర్వహించిన ప్రార్థనల్లో ఎమ్మెల్యే జిఎంఆర్ సోదరుడు సీనియర్ నాయకులు గూడెం మధుసూదన్ రెడ్డి కుమారుడు గూడెం విక్రమ్ రెడ్డి లు పాల్గొని రంజాన్ పండుగ శుభాకాంక్షలు తెలిపారు



# రాజీవ్ యువ వికాసం పథకానికి దరఖాస్తు చేసుకోవాలి : కలెక్టర్ సందీప్ కుమార్ ఝా



**సమయజ్యోతి న్యూస్ ముస్తాబాద్**

రాజన్న సిరిసిల్ల జిల్లాలోని అర్హులైన యువత రాజీవ్ యువ వికాసం పథకానికి దరఖాస్తు చేసుకోవాలని కలెక్టర్ సందీప్ కుమార్ ఝా సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఎస్సీ,ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాలు (ముస్లిం, క్రిస్టియన్, సిక్కు, బౌద్ధ్, జైన్ మరియు పార్శి)లకు చెందిన నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు ద్వారా ఆర్థిక పురోగతి పెంపొందించాలనే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం రాజీవ్ యువ వికాసం పథకాన్ని ప్రతిష్టాత్మకంగా ప్రకటించిందని తెలిపారు. అర్హత మరియు ఆసక్తి ఉన్న నిరుద్యోగ యువత రాజన్న సిరిసిల్ల జిల్లా వ్యాప్తంగా ఓబిఎంఎంఎస్ ఆన్లైన్ పోర్టల్ http://tgobmm-snew.cgg.gov.in ద్వారా దరఖాస్తు నమోదు చేసుకోవాలని పేర్కొన్నారు.అభ్యర్థులు, పూరించిన దరఖాస్తు ఫారమ్‌ను డౌన్‌లోడ్ చేసుకుని, హార్డ్ కాపీ, అవసరమైన పత్రాలను జత పరిచి మండల ప్రజాపాలన సేవా కేంద్రం (గ్రామీణ ప్రాంతాలలో ఎంపీడీవో కార్యాలయం) లేదా మున్సిపల్ కమిషనర్ (పట్టణ ప్రాంతాలు)లో సమర్పించాలని స్పష్టం చేశారు.అవసరమైన పత్రాలు: ఆధార్ కార్డు, రేషన్ కార్డు, ఆదాయ ధృవీకరణ పత్రం, కుల ధృవీకరణ పత్రం (తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత జారీ చేయబడినది), శాశ్వత డ్రైవింగ్ లైసెన్స్ (రవాణా రంగ పథకాలకు), పట్టాదార్ పాస్ బుక్ (వ్యవసాయ పథకాలకు), సదరం సర్టిఫికేట్ (పిడబ్ల్యుడిల కోసం). పాస్‌పోర్ట్ సైజు ఫోటో, దుర్బల (బలహీన) సమూహ ధృవీకరణ పత్రం (మండల స్థాయి కమిటీ ధృవీకరించబడినది).ఆదాయ పరిమితి: గ్రామీణ ప్రాంతాలు: సం.కి రూ.1,50,000/-. పట్టణ ప్రాంతాలు: సం.కి రూ.2,00,000/- (మునిసిపాలిటీలు, నగర పంచాయతీలు), రేషన్ కార్డు వివరాలను దరఖాస్తు ఫారంలో ఇవ్వాలి మరియు రేషన్ కార్డు అందుబాటులో లేని సందర్భాలలో మాత్రమే, అభ్యర్థులు "మీ-సేవ" జారీ చేసిన ఆదాయ ధృవీకరణ పత్రాన్ని సమర్పించాలి.వయోపరిమితి: వ్యవసాయేతర పథకాలకు 21 - 55 సంవత్సరాలు (2024 సంవత్సరం జూలై 1 నాటికి), వ్యవసాయం మరియు అనుబంధ రంగాలకు 21 - 60 సంవత్సరాలు (2024 సంవత్సరం జూలై 1 నాటికి), నిధుల కేటాయింపు, యూనిట్ ధర, సబ్సిడీ, బ్యాంకు లోన్ఎకనామిక్ సపోర్ట్ స్కీములు: యూనిట్ ధర 50,000 వరకు100%, యూనిట్ ధర 50 వేలకు పైబడి లక్ష వరకు 90%, రాయితీ 10%, యూనిట్ ధర లక్షకు పైబడి రెండు లక్షల వరకు వరకు 80% రాయితీ 20%, యూనిట్ ధర రెండు లక్షలకు పైబడి నాలుగు లక్షల వరకు 70% రాయితీ 30%, దుర్భల (బలహీన) సమూహం, (రూ.1,00,000/- వరకు), 100% (90% తో 10% నుండి ఈఎంఎఫ్)6) చిన్న నీటిపారుదల100%, మిగతా వివరాలకు జిల్లా బీసీ, ఎస్సీ,ఎస్టీ, మైనార్టీ సంక్షేమకార్యాలయంలో సంప్రదించాలని కలెక్టర్ సూచించారు.

# రాజీవ్ యువ వికాసం పథకం పై.. డిప్యూటీ సీఎం.. కలెక్టర్లతో దృశ్య సమావేశం

**సమయజ్యోతి న్యూస్ ముస్తాబాద్**

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేయనున్న రాజీవ్ యువ వికాసం పథకం పై రాష్ట్ర డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి, ఇతర ఉన్నతాధికారులతో కలిసి హైదరాబాద్ నుంచి అన్ని జిల్లాల కలెక్టర్లు, ఆయా శాఖల అధికారులతో సోమవారం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. ఈ దృశ్య సమావేశంలో జిల్లా నుంచి కలెక్టర్ సందీప్ కుమార్ ఝా హాజరయ్యారు. అర్హులందరికీ ఎస్సీ, ఎస్టీ బీసీ మైనార్టీ ఈడబ్ల్యూఎస్ వర్గాల్లోని అర్హులందరికీ పథకాన్ని అందజేయాలని డిప్యూటీ సీఎం ఆదేశించారు. అన్ని ఎంపీడీవో, మున్సిపల్ కార్యాలయాల్లో రాజీవ్ యువ వికాసం దరఖాస్తులను అందుబాటులో ఉంచాలని అప్లికేషన్లు స్వీకరించాలని సూచించారు. కార్యక్రమంలో ఎల్డీఎం మల్లికార్జున్, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ స్వప్న పాల్గొన్నారు.



# రంజాన్ వేడుకల్లో పాల్గొన్న బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్

**సమయజ్యోతి న్యూస్ మార్చి 31 బజార్ హత్నూర్**

ఇచ్చోడ మండలం కేంద్రంలో పలువురు కార్యకర్తలు ఇండ్ల లో నిర్వహించిన ఈద్ వేడుకల్లో పాల్గొని శుభాకాంక్షలు తెలిపిన బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ వీరితో వివిధ మండలాల నాయకులు కార్యకర్తలు అభిమానులు పాల్గొన్నారు



# ఘనంగా రంజాన్ వేడుకలు

## ఈద్గాల వద్ద ప్రత్యేక ప్రార్థనలు

**సమయజ్యోతి న్యూస్ ప్రతినిధి బాల్కొండ**

బాల్కొండ మండలంలో సోమవారం రంజాన్ వేడుకలను ముస్లింలు భక్తిశ్రద్ధలతో ఘనంగా జరుపుకున్నారు.ఉదయం నుంచి ఆయా గ్రామాలలోని ఈద్గా వద్దకు చేరుకొని ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు.మండల కేంద్రమైన బాల్కొండలో నూతన వస్త్రాలు ధరించి ఈద్గా వద్ద చేరుకొని ముస్లింలు ప్రత్యేక ప్రార్థనలు చేశారు.ఈ సందర్భంగా పలువురు మత పెద్దలు సందేశాలను ఇచ్చారు.ఒకరికొకరు అలింగనం చేసుకొని పండుగ శుభాకాంక్షలు తెలుపుకోన్నారు. పండగ పూట ఎలాంటి ఆవాంఛనీయ సంఘటన జరగకుండా సీఐ శ్రీధర్, ఎస్సై బి నరేష్, గట్టి బందోబస్తును ఏర్పాటు చేశారు.ఈ కార్యక్రమంలో మర్కస్ కమిటీ సభ్యులు మైనార్టీ నాయకులు అధిక సంఖ్యలో మైనార్టీ సోదరులకు పాల్గొన్నారు.



# మహమ్మద్ షబ్బీర్ అలీకి కాంగ్రెస్ శ్రేణుల ఈద్ ముబారక్

**సమయజ్యోతి న్యూస్ కామారెడ్డి బ్యూరో**

కామారెడ్డి జిల్లా కేంద్రంలో రంజాన్ పర్వదినాన్ని పురస్కరించుకొని ప్రభుత్వ సలహాదారులు మొహమ్మద్ షబ్బీర్ అలీని డిసిసి అధ్యక్షులు కైలాస్ శ్రీనివాసరావు, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులు పండ్ల రాజు, డీసీసీ అధికార ప్రతినిధి కరాంగుల అశోక్ రెడ్డి, యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు గుడుగుల శ్రీనివాస్ లు కలిసి ఈద్ ముబారక్ తెలిపారు. మాజీ కౌన్సిలర్ కన్నయ్య గంప కృష్ణ, వలిపి శెట్టి భాస్కర్ పాల్గొన్నారు.



# జై బాపు జై భీమ్ జై సంవిదాన్ కార్యక్రమాలు..

## కోఆర్డినేటర్లుగా కాంగ్రెస్ శ్రేణుల నియామకం

**సమయజ్యోతి న్యూస్ నిజామాబాద్ బ్యూరో**



ఏఐసీసీ ఆదేశాలు పిసిసి పిలుపు మేరకు జై బాపు జై భీమ్ జై సంవిదాన్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా 02 నుండి 11 వరకు నిర్వహిస్తున్న రాజ్యాంగ పాదయాత్రలకు నిజామాబాద్ జిల్లాలో రాష్ట్ర ఉర్దూ అకాడమీ చైర్మన్ తాహెర్ బిన్ హందాన్, పిసిసి ప్రధాన కార్యదర్శి నగేష్ రెడ్డి, పిసిసి డెలిగేట్ శేఖర్ గౌడ్ లను కో-ఆర్డినేటర్లుగా నియామకం జరిగింది. తాహెర్ బిన్ హందాన్ ు నిజామాబాద్ రూరల్, బోధన్ నియోజకవర్గలకు కో ఆర్డినేటర్ గా,నగేశ్ రెడ్డి - బాల్కొండ, ఆర్మూర్ నియోజకవర్గాల కో ఆర్డినేటర్ గా, శేఖర్ గౌడ్ - నిజామాబాద్ అర్బన్, బాన్సువాడ నియోజకవర్గాల కో ఆర్డినేటర్ గా నియామకం చేసినట్లుగా డిసిసి అధ్యక్షులు మానాల మోహన్ రెడ్డి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు.

# మాజీమంత్రి గిరిజా వ్యాస్‌కు ప్రమాదం

## ఇంట్లో హారతి ఇస్తుండగా అంటుకున్న మంటలు

**జైపూర్,మార్చి31(సమయజ్యోతి):**

కేంద్ర మాజీ మంత్రి, కాంగ్రెస్ సీనియర్ నేత గిరిజా వ్యాస్ సోమవారంనాడు ప్రమాదానికి గురయ్యారు. రాజస్థాన్‌లోని ఉదయపూర్‌లో సోమవారంనాడు తన నివాసంలో పూజ చేస్తుండగా హారతి అంటుకోవడంతో ఆమె గాయపడ్డారు. కుటుంబ సభ్యులు వెంటనే ఆమెను ఒక ప్రైవేటు- ఆసుపత్రిలో చేర్చి ప్రాథమిక చికిత్స అనంతరం అహ్మదాబాద్ ఆసుపత్రికి తరలించారు. ఇంట్లో ఆమె హారతి ఇస్తుండగా.. కింద వెలుగుతున్న దీపం నుంచి మంటలు ఆమె దుపట్టాకు అంటుకోవడంతో ఈ ప్రమాదం జరిగిటనట్లు తెలుస్తోంది. కుటుంబ సభ్యులు హుటాహుటిన ఆస్పత్రికి తరలించారన్నారు. కాంగ్రెస్ నాయకురాలైన గిరిజా వ్యాస్ గతంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల్లో మంత్రిగా సేవలందించారు. రాజస్థాన్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షురాలిగా, జాతీయ మహిళా కమిషన్ ఛైర్‌పర్సన్‌గానూ పనిచేశారు.

# 2న ఢిల్లీలో బిసి సంఘాల ధర్నా

## 42శాతం రిజర్వేషన్ల ఆమోదానికి డిమాండ్

## ధర్నాలో పాల్గొననున్న రాహుల్ గాంధీ

## ధర్నా కోసం ఢిల్లీ వెళ్లనున్న రేవంత్ రెడ్డి, భట్టి

**హైదరాబాద్,మార్చి31(సమయజ్యోతి):**

తెలంగాణలో బీసీల రిజర్వేషన్లు 42 శాతం పెంచుతూ శాసన సభ ఆమోదించిన బిల్లును పార్లమెంట్‌లో ఆమోదించాలని ఏప్రిల్ 2న ఢిల్లీలో బీసీ సంక్షేమ సంఘాలు మహాధర్నాకు పిలుపునిచ్చాయి. ఈ మహాధర్నాలో ఏఐసీసీ అగ్రనేత, ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీ, ఏఐసీసీ నేతలు, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, పీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్, మంత్రులు పొన్నం ప్రభాకర్, కొండా సురేఖ, ఇతర మంత్రులు, బీసీ ఎమ్మెల్యేలు ఆది శ్రీనివాస్, బీర్ల ఐలయ్య, మక్కన్ సింగ్ రాజ్ ఠాకూర్, వాకిటి శ్రీహరి, ఈర్లపల్లి శంకరయ్యలు పాల్గొని సంఘీభావం తెలియజేయనున్నారు. అన్ని రాజకీయ పార్టీల నేతలు, ప్రతిపక్ష పార్టీల ఎంపీలు కూడా ఇందులో పాల్గొననున్నారు. తెలంగాణ శాసనసభలో ఇటీవల బీసీలకు రాజకీయ, విద్యా, ఉద్యోగాల్లో 42 శాతం రిజర్వేషన్లు కల్పించాలనే చట్టాన్ని 9వ షెడ్యూల్‌లో చేర్చాలని ఏప్రిల్ 2,3 తేదీల్లో కేంద్ర ప్రభుత్వ పెద్దలను, వివిధ పార్టీల నాయకులను కలిసి తెలంగాణ చేసిన కుల సర్వే వివరాలను వివరిస్తారు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు పెంచుతూ చేసిన చట్టానికి మద్దతు ఇవ్వాలని కోరనున్నారు. ఏప్రిల్ 2,3 తేదీల్లో ఏఐసీసీ అగ్రనేత రాహుల్ గాంధీ సహకారంతో వివిధ పార్టీ నేతలను కలిసి బీసీ రిజర్వేషన్ల బిల్లుకు మద్దతు కోరనున్నట్లు- తెలంగాణ కాంగ్రెస్ బృందం ప్రకటించింది. బీసీ సంక్షేమ సంఘాలతో కలిసి మహాధర్నా చేపట్టి, పార్లమెంట్‌లో బీసీ రిజర్వేషన్ల కోసం కాంగ్రెస్ పార్టీ కృషి చేస్తుందని స్పష్టం చేసింది.

# రంజాన్ రోజు విషాదం

## ఊరచెరువులో పడి తండ్రీ తనయుల మృతి

**ఖమ్మం,మార్చి31(సమయజ్యోతి):**

బోనకల్ మండల పరిధిలోని ఆళ్ళపాడు గ్రామంలో రంజాన్ పండుగ రోజు ఓ ముస్లిం కుటుంబంలో తండ్రి, తనయుల మృతితో విషాదం నెలకొంది. తమ ఇంటిపక్కనే ఉన్న ఊర చెరువు వారి పాలిట మృత్యుకౌగిలిగా మారి వారిద్దరిని బలితీసుకొంది. గ్రామస్థులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన ఊర చెరువు పక్కనే పఠాన్ ఇసూబ్ ఖాన్ (75) ఇల్లు నిర్మించుకొని కాపురం ఉంటు-న్నాడు. ఆయనకు ముగ్గురు కుమారులు. వీరిలో పెద్ద కుమారుడు, చిన్న కుమారుడు ఖమ్మంలో ఉంటు-ండగా రెండో కుమారుడు కరీముల్లాఖాన్ తండ్రితో ఉంటు-న్నాడు. రంజాన్ పండుగ సందర్భంగా జరిగిన నమాజ్‌కు తండ్రీతనయులు వెళ్ళివచ్చారు. ఆ తరువాత సాయంత్రం 4 గంటల సమయంలో మానసికస్థితి సరిగ్గాలేని తండ్రి గేటు తీసుకొని చెరువులోకి దిగాడు. ఈత రాని తన తండ్రి చెరువులోని పెద్ద గుంతలో దిగటంతో గమనించిన తనయుడు కరీముల్లా ఖాన్ (45) తండ్రిని కాపాడే ప్రయత్నంలో కాలు జారి తండ్రి పడిన గుంతలోనే పడి మృతి చెందాడు. నిత్యం జనం రద్దీగా ఉండే ఆ ప్రాంతంలో ఈ ఇద్దరు చెరువు గుంతలో పడిన విషయాన్ని బోనకల్ నుండి రాయన్నపేట వెళ్లే ఓ మహిళ చూసి కేకలు వేసింది. అదే గ్రామానికి చెందిన కాలసాని అయితం, మరీదు వీరబాబు అనే యువకులు చెరువులోకి దిగి తండ్రీ కొడుకులను బయటకు తీసుకువచ్చారు. ప్రాణంతో ఉన్నారేమోనని ప్రయత్నించిన గ్రామస్థులకు నిరాశే ఎదురైంది. అప్పటికే వారిద్దరూ మృతి చెందటంతో వారి కుటుంబంతోపాటు- గ్రామంలో విషాదం నెలకొంది.

# త్వరలోనే మోడీ రిటైర్‌మెంట్

## నాయకత్వ మార్పు తప్పదు

## ఆర్ఎస్ఎస్ ఆలోచన కూడా ఇదే

## మోడీ ఆర్ఎస్ఎస్ కార్యాలయ సందర్శనపై సంజయ్ రౌత్

**ముంబై,మార్చి31(సమయజ్యోతి):**

జాతీయ స్థాయిలో నాయకత్వ మార్పు కోసం ఆర్ఎస్ఎస్ ఒత్తిడి తెస్తోందని శివసేన నేత సంజయ్ రౌత్ సంచలన వ్యాఖ్యలు చేశారు. అయితే ఆర్ఎస్ఎస్ ఇప్పుడు తదుపరి బీజేపీ జాతీయ అధ్యక్షుడిని ఎన్నుకోవడంలో బీజీగా ఉంది.. ప్రధాని మోడీ పర్యటన సంఘ్ పరివార్‌లోని విస్తృత రాజకీయ ఎత్తుగడలో భాగమని సంజయ్ రౌత్ ఆరోపించారు. ఈ మేరకు ప్రధాని నరేంద్ర మోదీపై నేత సంజయ్ రౌత్ సంచలన వ్యాఖ్యలు చేశారు. ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ ఇటీవల నాగ్‌పూర్‌లోని రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ ఆర్ఎస్ఎస్ కార్యాలయాన్ని సందర్శించడంపై శివసేన యూబీటీ- నాయకుడు సంజయ్ రౌత్ సంచలన వ్యాఖ్యలు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తన పదవీ విరమణ ప్రణాళికలను ఆర్ఎస్ఎస్ చీఫ్ మోహన్ భగవత్‌కు మోడీ తెలియజేశారని పేర్కొన్నారు. ఇక, ప్రధాని మోడీ వారసుడిని ఆర్ఎస్ఎస్ నిర్ణయిస్తుందని ఆయన తెలిపారు. నాకు తెలిసినంత వరకు గత 10-11 సంవత్సరాలలో మోడీ జీ ఎప్పుడూ కూడా ఆర్ఎస్ఎస్ ప్రధాన కార్యాలయాన్ని సందర్శించలేదు. ఇప్పుడు సందర్శించడం చూస్తుంటే కేవలం వారిసుడి ఎంపిక సందర్భంగానే ఇది జరిగిందన్న అనుమానం కలుగుతోందని అన్నారు. ఇక భవిష్యత్ నాయకుడిని రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ నిర్ణయిస్తుందని సంజయ్ రౌత్ పేర్కొన్నారు. ఆర్ఎస్ఎస్ గురించి నేను అర్థం చేసుకున్న రెండు విషయాలు మీకు తెలియజేస్తున్నాను.. మొదటిది, ఆ సంస్థ దేశ నాయకత్వంలో మార్పును కోరుకుంటుంది.. రెండోది, మోడీ జీ కాలం ముగిసింది.. ఆయనను కూడా మార్పును కోరుకుంటున్నారని చెప్పారు. మోదీ ఆర్ఎస్ఎస్ ప్రధాన కార్యాలయాన్ని సందర్శించడంలో వేరు పనులేమి ఉంటాయని అన్నారు. గత పదేళ్లలో ఎన్నడూ ఆర్ఎస్ఎస్ కార్యాలయానికి వెళ్లని ప్రధాని ఇప్పుడు వెళ్లడం వెనక ముఖ్యమైన కారణం ఇదే అయి ఉండొచ్చని అన్నారు. ఆయన పదవీవిరమణ చేయాలని యోచిస్తున్నారని.. తన రిటైర్మెంట్ ప్రణాళికల గురించి ఆర్ఎస్ఎస్ చీఫ్ మోహన్ భాగవత్‌తో చర్చలు జరపడానికే అక్కడికి వెళ్లి ఉంటారని అభిప్రాయం వ్యక్తంచేశారు. ఆర్ఎస్ఎస్ దేశ నాయకత్వంలో మార్పును కోరుకుంటున్నట్లు నేను నమ్ముతున్నాను. వారు ముందుగా తదుపరి భాజపా చీఫ్‌ను ఎన్నుకోవాలనుకుంటున్నారు. ఆ సంస్థ నియమాల ప్రకారం మోదీ కూడా రాజకీయాలకు రిటైర్మెంట్ ప్రకటించాలని అనుకుంటున్నారని.. అందుకే ఆయన మోహన్ భాగవత్‌ను కలిసి రిటైర్మెంట్ పత్రాన్ని సమర్పించడానికి వెళ్లి ఉంటారని సంజయ్ రౌత్ అనుమానాలు వ్యక్తం చేశారు. అయితే మోదీ రాజకీయ వారసుడు మహారాష్ట్ర నుంచే వస్తాడని బలంగా నమ్ముతున్నానని కూడా సంజయ్ రౌత్ అన్నారు. ప్రధాని నరేంద్ర మోదీ రిటైర్మెంట్‌పై సంజయ్‌రౌత్ చేసిన వ్యాఖ్యలను మహారాష్ట్ర ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడణవీస్ కొట్టిపడేశారు. మోదీ నాయకత్వంలో తాము ఇంకా చాలా ఏళ్లు పని చేస్తామని అన్నారు. 2029లోనూ ఆయన ప్రధానిగా సేవలందిస్తారని పేర్కొన్నారు. సమర్థవంతమైన నాయకుడు తమను నడిపిస్తున్నప్పుడు వారసుడి కోసం వెతకాల్సిన అవసరం ఏముంటుందని ప్రశ్నించారు. 11 ఏళ్ల క్రితం ప్రధానిగా బాధ్యతలు చేపట్టిన అనంతరం ప్రధాని మోదీ తొలిసారిగా ఆదివారం నాగ్‌పుర్‌లోని సంఘ్ ప్రధాన కార్యాలయాన్ని సందర్శించారు. తొలుత డా.హెడ్గేవార్ స్మృతి మందిరానికి వెళ్లిన ప్రధాని.. సంస్థ వ్యవస్థాపకుడు డా.కేశవ్ బలిరామ్ హెడ్గేవార్, రెండో సర్‌సంఘ్‌చాలక్ ఎంఎస్ గోళ్వాల్కర్‌లకు నివాళులు అర్పించారు. అనంతరం స్మృతిభవన్‌లో ఆరెస్సెస్ పదాధికారులతో భేటీ అయి వారితో గ్రూప్‌ఫొటో దిగారు. రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్‌ను దేశ అజరామర సంస్కృతి, ఆధునికీకరణ వటవృక్షంగా అభివర్ణించారు. కాగా దేశ ప్రధానులు ఆర్ఎస్ఎస్ కార్యాలయాన్ని అధికారికంగా సందర్శించడం ఇది రెండోసారి. 2000 సంవత్సరంలో వాజ్‌పేయి మూడోసారి ప్రధానమంత్రిగా ఉన్నప్పుడు దీనిని సందర్శించారు. అయితే అప్పట్లో ఎలాంటి విమర్శలు రాలేదు. కేవలం మోడీ సందర్శించడంతోనే సంజయ్ రౌత్ ఈ వ్యాఖ్యలు చేయడం గమనార్హం. బిజెపితో సంజయ్ రౌత్‌కు ముందునుంచి పొసగడం లేదు. ఇదికూఆ గమనించాల్సి ఉంది.

# పూసాలలో ఘనంగా ఉగాది పంచాంగ శ్రవణ వేడుకలు

**సుల్తానాబాద్ పెద్దపల్లి జిల్లా మార్చి-31సమయజ్యోతి**

మున్సిపల్ పరిధి పూసాల లక్ష్మీనారాయణ స్వామి దేవాలయంలో ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకొని, పంచాంగ శ్రవణం వేడుకలను ఘనంగా నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా పలువురు ప్రజాప్రతినిధులు మాట్లాడుతూ ఉగాది పండుగ సాంస్కృతి సాంప్రదాయాలను నిలబెట్టుకునే గొప్ప సందర్భమని, కొత్త ఆలోచనలు, ఆశయాలతో ముందుకు సాగాలని, అద్భుత విజయాలు ఆరోగ్య సంపద ఆనంద సమృద్ధి చెందాలని, ప్రజలందరూ సుఖసంతోషాలు ఆయురారోగ్యాలతో వర్ధిల్లాలని ఆకాంక్షించారు. అలాగే పంచాంగ శ్రవణంలో విశ్వ వాసు నామ సంవత్సరంలో వర్షాలు సమృద్ధిగా కురిసి పంటలు బాగా పండుతాయని, పండితులు పంచాంగాన్ని చదివి వినిపించారన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షులు వేగోళం అబ్బయ్య గౌడ్, పధ్నాలుగవ వార్డ్ మాజీ కౌన్సిలర్ గుర్రాల శ్రీనివాస్, మత్స్య పారిశ్రామిక సహకార సంఘం మాజీ ప్రెసిడెంట్ ఉస్థేం రవి, పురం హరికిషన్, మాజీ ఎంపీటీసీ కంకణాల ఆశాలు, చొప్పరి సుమన్,బొజ్జ రమేష్,మ్యాకల రాజయ్య,గడ్డం శంకర్, పురం దిలీప్ కుమార్, జూలూరి నాగరాజు, వడాల శేఖర్, చొప్పరి లక్ష్మి రాజం, చొప్పరి రాజు, వేగోళం మధుకర్,లక్ష్మీనారాయణ, సత్తయ్య పెగడ రాజమౌళి,వార్డు ప్రజలు మహిళలు తదితరులు పాల్గొన్నారు..



# మండలంలో ఘనంగా తెలుగు దేశం పార్టీ ఆవిర్భావ దినోత్సవం

**గంపలగూడెం,సమయజ్యోతి ప్రతినిధి ప్రతినిధి:**

గంపలగూడెం మండలంలో తెలుగుదేశం పార్టీ ఆవిర్భావ దినోత్సవం శనివారం నాడు ప్రజలు ఘనంగా నిర్వహించారు. గంపలగూడెం, పెనుగలను, , తదితర పలు గ్రామాలలో తెలుగుదేశం పార్టీ నాయకులు ఎన్టీఆర్ విగ్రహాలకు పూలదండలు వేసి నివాళులర్పించారు. నెమలి గ్రామంలో టిడిపి నాయకులు బెల్లం మధుసూదన్ రావు, , పామర్తి కొండలరావు, వనమా చిన్న బాబు తదితరులు ఎన్టీఆర్ విగ్రహానికి పూల మాలలు వేసి నివాళులర్పించి, టిడిపి పతాకాన్ని ఎగరవేశారు. ఈ కార్యక్రమంలో అధిక సంఖ్యలో టిడిపి కార్యకర్తలు పాల్గొన్నారు.



# లింగాల మండలం లో ఘనంగా రంజాన్ వేడుకలు

**నాగర్ కర్నూల్ మార్చ్ 31,సమయజ్యోతి**

లింగాల మండల పరిధిలోని అంబటి పల్లి. లింగాల. అప్పాయిపల్లి. మాడా పూర్. తదితర గ్రామాలలో రంజాన్ పండుగ సందర్భంగా గ్రామ శివారులోని ఈద్గాల దగ్గర ముస్లిం సోదరులు అందరూ ర్యాలీగా వెళ్లి ప్రత్యేక ప్రార్థనలు చేశారు అనంతరం ఒకరికొకరు శుభాకాంక్షలు తెలుపుకున్నారు. యొక్క రంజాన్ పండుగ మత సామరస్యానికి ప్రతీక గా హిందూ ముస్లింలు అందరూ ముస్లిం సోదరులకు శుభాకాంక్షలు తెలియజేశారు.



# గ్రామ స్థాయి క్రీకెట్ టోర్నమెంట్ ప్రారంభము

## మాజీ ఎంపీపీ వెంకటేశ్వరరావు

**పెద్దకొత్తపల్లి,మార్చ్ 31,సమయజ్యోతి**

మండల పరిధిలోని చంద్రకల్ గ్రామంలో గ్రామ స్థాయి క్రికెట్ టోర్నమెంట్ ప్రారంభించిన మాజీ ఎంపిపి వి వేంకటేశ్వర రావు..ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ యువత క్రీడల్లో రాణించి గ్రామం కు మంచి పేరు తేవాలని కోరారు.ఈ కార్య క్రమం లో సాయిబాబు . సీత శేఖర్ .మహేందర్,నరేష్ స్వామి .తదితరులు పాల్గొన్నారు.



# జీవన గమనాన్ని నేర్పేదే రమజాన్

**దేశాన్ని మతతత్వ శక్తులతో కాపాడుకోవాలి**

**ధర్మం.. రాజకీయం వేరు కాదు..**

**ఇస్లాం నాయకత్వ లక్షణాలను నేర్పింది**

**సాలెహ్ నగర్ ఈద్గాలో పెద్ద ముఫ్తి మహమ్మద్ ఫియాస్ మొహియుద్దీన్ ఈదుల్ ఫితర్ సందేశం**

**ఈద్-ఉల్-ఫితర్ పండుగ నమాజ్ కు వేలాదిగా హాజరైన ముస్లింలు**





**కరీంనగర్, సమయజ్యోతి మార్చి 31:**

జీవన గమనాన్ని నేర్పేదే రమజాన్ మాసం అని, మానవీయ విలువలకు తిలోదాకాలిచ్చిన వారికి, రమజాన్ మాసంలో గడిపే జీవన విధానం చక్కటి ఉదాహరణ అని కరీంనగర్ ఈద్గా పెద్ద గురువు, ప్రముఖ ఇస్లామీయ ధార్మిక పండితుడు ముఫ్తి మహమ్మద్ ఫియాస్ మొహియుద్దీన్ అన్నారు. సోమవారం నగరంలోని రేకుర్తి సాలెహ్ నగర్ ఈద్గాలో ముస్లిం సమాజాన్ని ఉద్దేశించి ముఫ్తి ఫియాస్ మొహియోద్దీన్ ఈద్-ఉల్-ఫితర్ సందేశాన్ని ప్రసంగించారు. ఈ సందర్భంగా ఆయన పలు కీలక వ్యాఖ్యలు చేశారు ప్రస్తుత పరిస్థితుల్లో ప్రజాస్వామ్యం ప్రమాదంలో ఉందని దేశాన్ని రక్షించుకునేందుకు ప్రతి ఒక్కరూ కంకర బద్ధులై కృషి చేయాలని కోరారు. మతతత్వ శక్తులతో దేశాన్ని కాపాడుకోవాల్సిన అవసరం ఉందని వివరించారు ధర్మం రాజకీయం వేరు కాదని ప్రతి ఒక్కటి ధర్మంతో ముడిపడి ఉందని గుర్తు చేశారు ఈ దేశం భిన్నత్వంలో ఏకత్వం ఈ దేశ ఔన్నత్యం అని కానీ ఇక్కడ ఒక వర్గం వారికి పెద్దపీట వేస్తూ మైనారిటీలను అణగదొక్కే కుట్రలు చేస్తున్నారని న్యాయస్థానాలను సైతం లెక్కచేయకుండా పాలకుల వ్యవహార శైలి ఉందని, ఇది ప్రజాస్వామ్యం వ్యవస్థకు మాయని మచ్చగా మిగిలిపోతుందని అభివర్ణించారు. భారతదేశం సకల కులాల మతాల ఆచార వ్యవహార సంస్కృతి సాంప్రదాయాలకు నిలయమని ప్రపంచంలో ఆదర్శవంతమైనటువంటి ఈ దేశాన్ని ఇక్కడి ప్రజాస్వామ్య వ్యవస్థను అనగదొక్కేందుకు కేవలం ఒక వర్గం యొక్క ఓట్లు పొందడం కోసం కులాల వారిగా మతాలవారీగా ప్రాంతాలవారీగా విభజించి పాలించు అనే సిద్ధాంతం ద్వారా కుట్రలు చేస్తున్నారని ఆరోపించారు ఎటువంటి కుహనా వాదులకు ఓటు అనే ఆయుధం ద్వారా బుద్ధి చెప్పాలని సెక్యులర్ వాదులను ఎన్నుకోవాలని పిలుపునిచ్చారు. ముస్లింలు జరుపుకునే 'ఈద్'కి రంజాన్ మాసంతో సంబంధం ఉండటం వల్ల ఈ పండుగ అదే పేరుతో ప్రసిద్ధికెక్కింది. నిజానికి రమజాన్ అన్నది సంవత్సరంలోని పన్నెండు నెలల్లో తొమ్మిదవ నెల పేరు. దీనికింతటి ప్రత్యేకత రావడానికి కొన్ని కారణాలున్నాయి. సర్వ మానవాళికి మార్గదర్శక గ్రంథమైన పవిత్ర ఖురాన్ రమజాన్ మాసంలోనే అవతరించింది. మానవజాతికి జ్ఞానకాంతిని ప్రసాదించే దివ్యజ్యోతి రమజాన్ మాసంలో అవతరించిన కారణంగానే ఈ మాసానికి ఇంతటి గౌరవం, ఘనత, పవిత్రత ప్రాప్తమయ్యాయి. మానవుల శారీరక, మానసిక, ఆధ్యాత్మిక వికాసానికి అద్భుతంగా ఉపకరించే 'రోజా' అనే ఉపవాస వ్రతాన్ని కూడా దైవం ఈ నెలలోనే విధిగా చేశాడు.

ఇది జనహృదయాల్లో భయభక్తులు జనింపజేసి, మానవీయ విలువలను, సుగుణాలను పెంపొందిస్తుంది. పాపకార్యాలు, దుర్మార్గాల వైపుకు మనసు పోకుండా కాపాడుతుంది. ఉపవాసం వల్ల సహనశక్తి పెరుగుతుంది. జాలి, దయ, కరుణ, త్యాగం, పరోపకారం లాంటి సద్గుణాలు అలవడతాయి. స్థితిపరులు ఉపవాసం పాటిస్తే, పేదసాదల ఆకలి బాధను వారు అనుభవపూర్వకంగా తెలుసుకోగలుగుతారు. ఇలా మరెన్నో మానవీయ, నైతిక సుగుణాలను మానవుల్లో పెంపొందింపజేసే ఏర్పాటును చేసిన విశ్వప్రభువుకు కృతజ్ఞతగా నెల రోజుల ఉపవాసాలను ముగించి షవ్వాల్ మొదటి తేదీన ఈద్ జరుపుకుంటారన్నారు.

దేవుని మన్నింపు లభించే మహత్తర శుభదినం ఈద్. తప్పులు, పొరపాట్లకు క్షమాపణ కోరుకునే రోజు ఈద్. జరిగిన తప్పుల పట్ల సిగ్గుపడుతూ, ఇకముందు తప్పులు చేయం అని, దైవమార్గంపై స్థిరంగా ఉంటామని సంకల్పం చెప్పుకునే రోజు ఈద్. కనుక దేహంలో ప్రాణం ఉండగానే దైవం ఇచ్చిన సదవకాశాన్ని వినియోగించుకొని సన్మార్గం వైపు మరలాలి. ఒక విషయం సత్యమని తెలిసినా దానికనుగుణంగా తమ జీవితాలను మలచుకోడానికి చాలామంది ముందుకు రారన్నారు. ఇదే మానవుల బలహీనత. దీన్ని అధిగమించడంలోనే విజ్ఞత, వివేకం దాగి ఉన్నాయి. పుట్టిన ప్రతి మనిషీ గిట్టక తప్పదన్న విషయం ఎంత సత్యమో, ఈ అశాశ్విత దేహం నుండి ఆత్మ ఎప్పుడు వీడిపోతుందో ఎవరికీ తెలియదన్నదికూడా అంతే సత్యం. అందుకే ఈ ఆత్మజ్యోతి ఆరిపోకముందే జాగృతమై దైవం వైపు మరలాలి. జరిగిపోయిన తప్పుల్ని సవరించుకొని రుజుమార్గం పైకిరావాలి. మనం తెలిసీ తెలియక చేసిన పాపాలను క్షమించడానికి దేవుడు సిద్ధంగా ఉన్నాడన్నారు.

పవిత్ర రమజాన్ దీనికి చక్కని అవకాశం కల్పించింది. ఈ నెల్లాళ్ళూ ఎంతటి నియమ నిష్టలతో గడిపారో ఇకముందు కూడా ఇదే స్ఫూర్తి కొనసాగిస్తామని ప్రతిన బూనాలి. ఈద్ పర్వదినం సందర్భంగా ఇలాంటి దృఢ సంకల్పం చెప్పుకుంటే అది నిజమైన పండుగ రోజు అవుతుంది. జీవితాల్లో ఆనందోత్సాహాలు వెల్లివిరిసే శుభదినం అవుతుంది. ఒకవేళ ఈవిషయాలపట్ల శ్రద్ధ వహించక పోతే ఈద్ సౌభాగ్యానికి దూరమయ్యే ప్రమాదం కూడా ఉంది. కనుక ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని దైవానికి కృతజ్ఞతలు చెల్లిస్తూ పవిత్ర జీవితం గడిపే ప్రయత్నం చెయ్యాలని సూచించారు.

వ్యాధుల బారినుండి, అప్పుల బారినుండి, శత్రువుల బారినుండి,కరువుకాటకాల నుండి, దారిద్ర్యం నుండి తమను, దేశాన్ని, యావత్ భూప్రపంచాన్ని రక్షించమని, ముఖ్యంగా కరోనా మహమ్మారి నుండి మానవాళినంతటినీ కాపాడమని విశ్వప్రభువును వేడుకోవాలి. స్నేహితులు, బంధువులు, ఇరుగు పొరుగు, పరిచితులు, అపరిచితులందరితో సంతోషాన్ని పంచుకోవాలి. 'ఈద్ ముబారక్' అంటూ శుభాకాంక్షలు తెలుపుకోవాలన్నారు. పండుగ పరమార్థాన్ని అవగాహన చేసుకుంటే రమజాన్ ఆరాధనల ఆశయం నెరవేరుతుంది. భావి జీవితాలు సుఖసంతోషాలతో గడిచిపోతాయి. సమాజంలో శాంతి, సామరస్యాలు వెల్లివిరుస్తాయి. ఒక చక్కని సుందర సమాజం ఆవిష్కృతమవుతుంది. పండుగ పంచిన మంచి మానవ జీవితాల్లో చివరి శ్వాస వరకూ గుబాళించాలని మనసారా కోరుకుందామని సందేశం ఇచ్చారు.

# అల్లా బోధనలు సమాజానికి ఆదర్శం: మంత్రి జూపల్లి వెల్లడి

## - రంజాన్ వేడుకల ప్రత్యేక ప్రార్థనల్లో పాల్గొన్న మంత్రి

**పెద్దకొత్తపల్లి,మార్చ్ 31,సమయజ్యోతి**

అల్లా బోధనలు సమాజానికి ఆదర్శమని,అల్లా దయతో ప్రజలంతా సుఖ సంతోషాలతో ఉండాలని రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు ఆకాంక్షించారు.ఈ సందర్భంగా ముస్లిం సోదరులకు ఆయన రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు. కొల్లాపూర్ పట్టణం వెలుపల ఖాదర్ పాషా ఈద్గాలో సోమవారం రంజాన్ సామూహిక ప్రార్థనల్లో మంత్రి పాల్గొన్నారు.

అనంతరం మంత్రి ముస్లిం సోదరులను ఆలింగనం చేసుకుని ఆత్మీయ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా మంత్రి జూపల్లి మాట్లాడుతూ.. రంజాన్ మాసం ఎంతో పవిత్రమైనది, అల్లా దయతో ప్రజాలంతా సుఖసంతోషాలతో ఉండాలని అకాంక్షించారు.

మత సామరస్యానికి ప్రతీక రంజాన్ అని, అల్లా బోధనలు సమాజానికి ఆదర్శమన్నారు. సమాజానికి ఉపయోగడే అల్లా బోధనలను ప్రతీ ఒక్కరూ పాటించాల్సిన అవసరం ఉందన్నారు. ప్రభుత్వం అన్ని వర్గాల పండుగలను ప్రభుత్వం అధికారికంగా నిర్వహిస్తున్నదని, తెలంగాణ రాష్ట్రంలో సర్వమత సామరస్యంతో ఉందన్నారు. ఈద్గా వద్ద మత గురువును శాలువా కప్పి మంత్రి సన్మానించారు.అలాగే ఈద్గా నిర్వాహకులు మర్యాదపూర్వకంగా మంత్రి జూపల్లి కృష్ణారావు ను సైతం సన్మానించారు.అలాగే బీ ఆర్ ఎస్ తరుపున మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ నరేందర్ రెడ్డి,మాజీ జెడ్పీటీసీ కాటం జాంబులయ్య,మాజీ కౌన్సిలర్ కృష్ణమూర్తి ఈద్గా వద్ద ముస్లింలకు రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు. మండలంలో సోమశిల, కుడి కిళ్ళ,చుక్కాయి పల్లి, సింగోటం,ఎన్మన్ బెట్ల,మొలచింత పల్లి,ఎల్లూర్,గ్రామాల్లోనూ ఈద్గాల వద్ద ముస్లిం సోదరులు ప్రత్యేక ప్రార్థనలు చేశారు.కార్యక్రమంలో సీపీఐ నాయకులు ఫయాజ్, ఇసూప్, మంత్రి జూపల్లి వెంట మాజీ జెడ్పీటీసీ హన్మంతు నాయక్,మార్కెట్ కమిటీ మాజీ వైస్ చైర్మన్ ఏక్బాల్,మాజీ కౌన్సిలర్లు రహీం పాష, సిబ్బేది నరసింహారావు,నహీం,కాంగ్రెస్ నాయకులు రంగినేని జగదేశ్వరుడు, మేకల నాగరాజు,వంగ రాజశేఖర్ గౌడ్ తదితరులున్నారు.



# మతసామరస్యానికి ప్రతీక రంజాన్ ముస్లిం సోదరీ సోదరులకు ఇఫ్తార్ విందును ఇచ్చిన బిజెపి నాయకురాలు సుజాత

**కరీంనగర్సమయజ్యోతి**

కరీంనగర్ పట్టణ కేంద్రంలో గణేష్ నగర్ వినాయక అపార్ట్మెంట్లో తమ సొంత నివాసంలో డాక్టర్ పి సుజాత రెడ్డి ముస్లిం సోదరులకు సోదరీమణులకు ఇఫ్తార్ విందు ఏర్పాటు చేశారు డాక్టర్ పి సుజాత రెడ్డి మాట్లాడుతూఇఫ్తార్ విందు స్నేహ బంధాన్ని పెంపొందిస్తూ మత సామరస్యానికి పత్రికగా నిలుస్తూ కరీంనగర్ పట్టణ కేంద్రంలో గణేష్ నగర్ లో తమ సొంత నివాసంలో ఉపవాస దీక్షలో ఉన్న ముస్లిం సోదరులకు ఇఫ్తార్ విందును ఏర్పాటు చేశారు మత సామరస్యానికి పత్రికగా నిలుస్తాయంది గంగా జమున తహసీబ్ కు ప్రతిరూపంగా మారుతాయని కుల మతాలకు అతీతంగా హిందూ ముస్లిం సోదరి సోదర భావంతో ప్రజలందరూ కలిసిమెలిసి ఉండాలని ఒకరి పండగలకు ఒకరు గౌరవించుకోవాలని డాక్టర్ పి సుజాత రెడ్డి ఈ సందర్భంగా తెలియజేశారు రంజాన్ మాసంలో ఉపవాస దీక్షలు పాటించే ముస్లిం సోదరులకు ఖర్జూర పండ్లు డ్రై ఫ్రూట్స్ చాలా రకాల ఫుడ్స్ ను ఏర్పాటు చేశారు ఇఫ్తార్ తర్వాత భోజనాలను ఏర్పాటు చేశారు డాక్టర్ పి సుజాత రెడ్డి మీడియా సోదరులకు సన్మానం చేశారు హిందూ ముస్లిం ఐక్యతకు మారుపేరుగా నిలుస్తాయన్నారు పవిత్ర రంజాన్ మాసంలో అల్లా మెప్పుకోసం నెల రోజులపాటు కఠోరమైన ఉపవాస దీక్షలు పాటించే ముస్లిం సోదర సోదరీమణులకు కృతజ్ఞతలు తెలియజేశారు రంజాన్ ముందస్తు శుభాకాంక్షలు తెలియజేశారు ఏడాదిలో 11 నెలలు తమకోసం ఒక నెల రంజాన్ మాసం మొత్తం అల్లా కోసం కేటాయిస్తారు చిన్న తప్పు చేయకుండా చెడుకు దూరంగా ఉండి పవిత్రమైన ఉపవాస దీక్షలు పాటిస్తారు. ఏకేశ్వరుడైన అల్లా కరుణకటాక్షములు పొందడమే వారి లక్ష్యం అని అన్నారు ఇఫ్తార్ విందుకు వచ్చిన ముస్లిం మీడియా జర్నలిస్టులకు సోదరి సోదరులకు. నాకు చదువు చెప్పిన నా గురువుకు మరియు నా మిత్రులకు పేరుపేరునా అందరికీ కృతజ్ఞతలు కరీంనగర్ జిల్లా ముస్లిం సోదర సోదరీమణులకు ముందస్తుగా అందరికీ రంజాన్ శుభాకాంక్షలు మీ డాక్టర్ పి సుజాత రెడ్డి అమ్ములు స్వచ్ఛంద సంస్థ కరీంనగర్



# యాపట్ల గ్రామం లో రంజాన్ వేడుకలు..

**పెద్దకొత్తపల్లి మార్చ్ 31,సమయజ్యోతి**

మండల కేంద్రము తో పాటు పెద్దకారుపాముల. యాపట్ల,వెన్నాచర్ల. చంద్రకల్. సతపూర్. చెన్నపు రావుపల్లి. కల్వకొల్. మార్రికల్. తదితర గ్రామలలో ముస్లీం సోదరులు నూతన వస్త్రాలు ధరించి గ్రామ శివారులో ఉన్న ఇద్గా దగ్గరకు ర్యాలీగా వెళ్లి ప్రత్యేక ప్రార్థనలు చేశారు.అనంతరం శుభా కాంక్షలు తెలుపుకున్నారు. ఈ కార్యక్రమము లో ముస్లిం పెద్దలు. తది తరులు పాల్గొన్నారు.



# ఖచ్చితంగా మద్దతు ధరల అమలు

## మార్కెటింగ్ వ్యవస్థ బలోపేతం-రైతులను ఆదుకునేలా సహకార వ్యవస్థ

హైదరాబాద్,మార్చి31(సమయజ్యోతి): సహకార వ్యవస్థ రానురాను పూర్తిగా నిర్వీర్యం అయ్యింది. ఎపిలో సహకార బ్యాంకులను గత ప్రభుత్వం దివాళా తీయించింది. అక్రమంగా డబ్బులను కొల్లగొట్టారు. ఇందులో దగుల్బాజీలు చేరడం వల్ల అది నిర్వీర్యం అవుతోంది. రైతులను ఆదుకుని వారికి అండగా నిలవాల్సిన సహకారరంగం పూర్తిగా కట్టుతప్పింది. సహకార బ్యాంకులు తమ విధానాలను పూర్తిగా తుంగలో తొక్కాయి. నిజానికి గ్రామస్థాయిలో సహకార రంగం బలంగా ఉంటే.. రైతులు బలపడతారు. సహకారరంగంతో పాటు మార్కెట్ వ్యవస్థ కూడా బలంగా ఉండాలి. తెలంగాణలో రైతు సమన్వయ సమితులు ఏర్పాటు చేసినా అవి కేవలం ఓ రాజకీయ కమిటీలుగా పనిచేసాయి. పదవుల కోసం సృష్టించిన కమిటీలుగా దిష్టిబొమ్మలుగా నిలిచాయి. సహకారరంగంపై నేతలు ఎన్నో ఆదర్శాలు ప్రకటించారు.తెలంగాణలో బిఆర్ఎస్ అధికారంలో ఉండగా రైతు సమన్వయ సమితులు ఎక్కడా ఒక్క రైతు సమస్యను పరిష్కరించిన దాఖలాలు లేవు. మార్కెట్లో రైతులు పడిగాపలు కాసినా, ధరలు రాక అవస్థలు పడ్డా,,ధాన్యం తడిసి నెత్తీనోరు మొత్తుకున్నా సహకారపదవులు అనుభవించిన నేతలు ఎక్కడా కానరాలేదు. నిజానికి రైతులకు అండగా ఉండాల్సిన సహకార సంఘాలు ఉత్సవ విగ్రహాల్లా మారాయి. రైతువిధానాలు రూపొందించడంలో ఇది పూర్తిగా విఫలం అయ్యింది. రైతులు తమ బాధలు పడలేక అందరి లాగే తానూ ఏదో పట్నం వెళ్లి పనిచేసుకుంటూ పొట్ట పోసుకుంటానని నిర్ణయించు కుంటే..ప్రజల గతేం కానుందో ఊహించుకోవాలి. వ్యవసాయం పడావు పడితే ప్రజలకు అన్నపానీయాలు దొరకవు...ఆధునిక యువతకు వ్యవసాయంపై బొత్తిగా అవగాహన లేకపోవడం కూడా మనకు ప్రమాదమే... అందుకే వ్యవసాయాన్ని ప్రాథమిక స్థాయి నుంచి విద్యలో పాఠ్యాంశంగా చేర్చాలి. అప్పుడే ప్రజలకు అవగాహన పెరుగుతుంది. రైతులకు కావాల్సింది సకాలంలో నీరు రావడం.. నిరంతరాయంగా విద్యుత్ అందుబాటులో ఉండడం.. పెట్టుబడి కోసం బ్యాంకులు విరివిగా రుణాలు ఇవ్వడం..ఇవన్నీ సక్రమంగా జరిగిన తరవాత పంటలను ఎలాంటి పేచీలు లేకుండా కొనుగోలు చేయడం.. ఇలా చేస్తే మన పొలాల్లో వారు బంగారాన్నే పండిస్తారు. అందుకు అవసరమైన వాతావరణం సృష్టించాలి. రైతులకు అలక రాకుండా.. వారు నైరాశ్యం చెందకుండా వెన్నుతట్టి ప్రోత్సహించాలి. రైతుబంధు పేరుతో దుబారాగ చేయడం కూడా సరికాదు. వ్యవసాయాన్ని పండగ చేయాలన్న ఆలోచనతో కార్యాచరణకు దిగాలి. వ్యవసాయం దండుగ అన్న నానుడి నుంచి వ్యవసాయం పండుగ అనేలా చేయాలి. రైతులు నిశ్చింతంగా వ్యవసాయం చేయొచ్చు అన్న భరోసా కలిగించాలి. పంటల కొనుగోళ్ల సమయంలో రైతులకు ఆందోళన లేకుండా పంటలను అమ్ముకోవడం లేదు. నిశ్చింతంగా మార్కెట్‌కు వచ్చి పంటలను చక్కగా అమ్ముకోగలిగేలా మార్కెట్ విధానాలు అవలంబించాలి. అప్పుడే సంపూర్ణ ప్రోత్సాహం దక్క గలదు. అయితే మార్కెటింగ్ వ్యవస్థ ఒక్కటే సక్రమంగా లేకపోవడంతో ఏటా రైతులు పండించిన పంటలను మద్దతు ధరలకు అమ్ము కోలేక పోతున్నారు. ఆర్థికంగా అండగా నిలవాలన్న విధంగా కార్యక్రమాలు చేయాలి. అప్పుడే దేశం కూడా ఆర్థికంగా పుంజుకుంటుంది. ప్రజలకు తక్కువ ధరలో ఆహారధాన్యాలు అందుతాయి. ఎగుమతుల ద్వారా విదేశీమారకం సంపాదించుకోగలుగుతాం. ఆలా చేయనంత కాలం భారత అన్నదాతల తలరాత మారదు. కేవలం రైతుభరోసా, ఉచిత విద్యుత్ సరఫరాతో సత్ఫలితాలు రావని గుర్తించడం లేదు. రైతుబంధులోనూ వ్యవసాయం చేయని వారి ఖాతాల్లో నగదు పడిపోతోంది. దీనిని సమీక్షించాల్సిన అవసరం ఉంది. ఏ భూముల్లో ఏ పంటలు పండుతున్నాయో గుర్తించాలి. ఇలాంటి భూములకు ఉచిత విద్యుత్ ఇస్తూ గృహవినియోగదారులపై ఛార్జీల భారం మోపడం సరికాదు. నీటిసౌకర్యం పెరగడంతో తెలంగాణలో ధాన్యం దిగుబడులు కూడా పెరిగాయి. అయితే ఈ మేరకు కొనుగోళ్లు మాత్రం సాగడం లేదు. రైతును రాజు చేసేందుకు, వ్యవసాయాన్ని పండగ చేసేందుకు తీసుకొచ్చిన పథకాలు సత్ఫలితాలు ఇవ్వాలి.

# సీసీకెమెరాలతో నేరాల గుట్టురట్టు

## కాలనీల్లో ఏర్పాటుకు ప్రోత్సాహం

హైదరాబాద్,మార్చి31(సమయజ్యోతి): శాంతి భద్రతల పరిరక్షణలో సీసీకెమెరాల పాత్ర కీలకంగా మారింది. దీంతో పోలీసులు వీటిని ఏర్పాటు చేసేందుకు ఎక్కడిక్కడ ప్రోత్సహిస్తున్నారు. సిసి కెమెరాల ఏర్పాటుకు సంఘాలను పిలిచి మాట్లాడుతున్నారు. ఓ మోస్తరు పట్టణంలో ఇప్పుడు వీటి ఏర్పాటు సాగుతోంది. ఇటీవల అనేక నేరాల చిట్టాలను గుర్తించడంలో సిసి కెమెరాలు బాగు ఉపయోగ పడ్డాయి. అనేక క్రిమినల్ కేసులు సిసి కెమరాల దృశ్యాల ఆధారంగా ఛేదించారు. అందుకే జిల్లాల కేంద్రాలతో పాటు చోటమోటా పట్టణాల్లో కూడా వీటి ఏర్పాటుకు ప్రోత్సహిస్తున్నారు. స్థానికంగా ఉన్న వ్యాపారులను ఇతరలను పిలిచి మాట్లాడుతున్నారు. ఇటీవల అనేక కేసుల్లో సిసి కెమెరాల ఫుటేజీ బాగా పనికి వస్తోంది. నేరస్తులను గుర్తించి పట్టుకోవడంలో అవి కీలకంగా మారాయి. అందుకే కాలనీలు మొదలు,రోడ్లకు ఇరువైపులా వీటిని ఏర్పాటు చేసేందుకు ప్రోత్సహిస్తున్నారు. దాతల నుంచి సహకారం తీసుకుని సిసి కెమెరాల ఏర్పాటును చేయిస్తున్నారు. సిసి కెమెరాలు ఉన్నచోట జరిగే నేరాల్లో త్వరాగా ఫలితాలు వస్తున్నాయని పోలీస్ అధికారులు కూడా ప్రకటించారు. ఇకపోతే నగరంలో పది లక్షల సీసీ కెమెరాల ఏర్పాటే లక్ష్యంగా ముందుకు వెళ్తున్నట్లు గతంలోనే డిజిపి తెలిపారు. ప్రజా భద్రత కోసం సీసీ కెమెరాల ఏర్పాటు అనివార్యమన్నారు. సీసీ కెమెరాల ఏర్పాటుతోనే గొలుసు చోరీలను నివారించ గలిగారు. సీసీ కెమెరాలు అలసిపోయేవి కావని, 24గంటలు పనిచేస్తూనే ఉంటాయని, దీని ద్వారా నేరగాళ్ల ఆచూకిని త్వరగా గుర్తించే వీలుంటుందన్నారు. పోలీస్ సిబ్బంది ఉన్న ఎనిమిదిగంటల మాత్రమే నిఘా ఉండగలరని, అంతకుమించి ఉండే పరిస్థితి ఉండదు. ఒకవేళ నేరగాళ్లను గుర్తించిన కేసుల సమయంలో సాక్ష్యులుగా వీరు ఉండలేరని, అదే సీసీ కెమేరాలైతే నిజనిర్ధారణ వేగంగా అవుతుందన్నారు. కోర్టుల్లో కూడా సీసీ కెమెరాల ద్వారా ఎటువంటి సంశయం లేకుండా శిక్షలు విధించే అవకాశాలు ఉంటాయి. అందుకే నగరంలో అన్ని ప్రాంతాల్లో ఈ సీసీ కెమేరాలను ఏర్పాటు చేస్తున్నామని అధికారులు తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా పలు ప్రధాన ప్రాంతాల్లో ఈ సీసీ కెమేరాలు ఏర్పాటు చేస్తున్నారు. రాష్ట్రాన్ని నేరరహిత రాష్ట్రంగా తయారు చేసేందుకు పోలీస్‌శాఖ విశేషంగా కృషి చేస్తున్నది. దానికి ప్రభుత్వం పూర్తి మద్దతు ఇస్తున్నది. దేశంలోనే తెలంగాణ పోలీసింగ్‌కు మంచి గుర్తింపు కూడా వచ్చింది. దానిని కాపాడుకుంటూ మరింత పేరుపొందేలా, ప్రజల్లో భరోసా కల్పించేలా ముందుకు సాగుతున్నారు. ఇటీవల అనేక కేసుల పరిష్కారంలో సిసి కెమెరాల ఫుటేజీ కీలకంగా మారింది.

# హెచ్‌సీయూ వర్సిటీ వద్ద భారీ బందోబస్తు

హైదరాబాద్, మార్చి31(సమయజ్యోతి): విద్యార్థుల ఆందోళన నేపథ్యంలో యూనివర్సిటీ మెయిన్ గేట్ వద్ద సెక్యూరిటీ పెంచారు. యూనివర్శిటీ లోపల బయట భారీగా పోలీసుల మోహరించారు. వర్సిటీ భూములను చదును చేయడాన్ని ఆపాలంటూ విద్యార్థులు ఆందోళన చేస్తున్న నేపథ్యంలో పోలీసులు భద్రతను పెంచారు. యూనివర్సిటీలోని 400 ఎకరాలను బుల్డోజర్ లతో చదును చేసేందుకు యత్నించడంతో విద్యార్థి సంఘాలు, యూనివర్సిటీ సిబ్బంది భగ్గుమన్నాయి. యూనివర్సిటీ భూములను చదును చేయడాన్ని ఆపాలంటూ స్టూడెంట్స్ గళమెత్తారు. దీంతో నిన్న రాత్రి యూనివర్శిటీ పరిసరాలు రణ రంగంగా మారాయి. రాత్రి యూనివర్శిటీ వద్ద ఉద్రిక్తత నేపథ్యంలో పలువురు విద్యార్థులను పోలీసులు అరెస్ట్ చేశారు. అరెస్ట్ చేసిన విద్యార్థులను, విద్యార్థి నేతలను రాత్రి 10 తర్వాత విడుదల చేశారు. సోమవారం కూడా ఆందోళనలు కొనసాగే అవకాశం ఉన్న నేపథ్యంలో పోలీసులు అలెర్ట్ అయ్యారు. హెచ్‌సీయూ వద్ద పోలీసులు భద్రతను కొనసాగిస్తున్నారు. యూనివర్సిటీకి సంబంధించిన ప్రధాన ద్వారంతో పాటు సెంట్రల్ యూనివర్సిటీ లోపల కూడా పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు. ఇప్పటికే యూనివర్సిటీకి సంబంధించిన భూములను ప్రభుత్వం వేలం వేసే ప్రయత్నం చేస్తోందంటూ వర్సిటీకి చెందిన విద్యార్థులు, సిబ్బంది పెద్ద ఎత్తున ఆందోళనకు దిగారు.




గత రాత్రి విద్యార్థుల ఆందోళనతో ఉద్రిక్త పరిస్థితి నెలకొనడంతో పోలీసులు వారిని అరెస్ట్ చేసి పోలీస్‌స్టేషన్‌కు తరలించి.. సొంత పూచీకత్తుపై విడుదల చేశారు. నిన్నంతా వర్సిటీ లోపల, బయట రణరంగంగా మారింది. ఈ క్రమంలో సోమవారం కూడా ఉద్రిక్తతలు కొనసాగుతాయని భావించిన పోలీసులు.. ముందస్తు చర్యల్లో భాగంగా భారీ భద్రతను ఏర్పాటు చేశారు. వర్సిటీ లోపలకు వెళ్లే వారి వివరాలను అడిగి తెలుసుకుని.. యూనివర్సిటీకి సంబంధించిన విద్యార్థులు, సిబ్బందిని మాత్రమే లోపలకు పంపిస్తున్నారు.

# పెరుగుతున్న ఉష్ణోగ్రతలు

## జాగ్రత్తలు తీసుకోవాలంటున్న వైద్యులు

నిజామాబాద్,మార్చి31(సమయజ్యోతి): రాష్ట్రంలో ఎండలు దంచికొడుతున్నాయి.అన్ని జిల్లాల్లో 40 డిగ్రీలకుపైగా ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి, 4 డిగ్రీలు అదనంగా ఉష్ణోగ్రతలు నమోదవుతాయని హైదరాబాద్ వాతావరణ కేంద్రం తెలిపింది. ఈ ఏడాది పగటి ఉష్ణోగ్రతలు 46 డిగ్రీలకు చేరుకొనే అవకాశం ఉంటుందని తెలిపింది. ఎండవేడిమికి మధ్యాహ్నం ఇండ్ల నుంచి బయటకు వెళ్లేందుకు జనాలు జంకుతున్నారు. ఉదయం 7గంటల నుంచే ఎండ చురుకుమంటోంది. 11 గంటలు దాటితే ఇంట్లో నుంచి బయటకు వెళ్లే పరిస్థితిలేదు. మధ్యాహ్నం మూడు గంటలవరకు రహదారులు నిర్మానుష్యంగా మారుతున్నాయి. ఇంట్లో ఉన్నా తీవ్ర ఉక్కపోతతో జనం ఉక్కిరి బిక్కిరవుతున్నారు. పగటి ఉష్ణోగ్రత పదిరోజులు గా 39నుంచి 40డిగ్రీలమధ్య నమోదుకావడంతో నిప్పుల కొలిమిగా మారింది. రోజురోజుకూ ఉష్ణోగ్రతలు పెరుగుతుండడంతో ఎండ వేడిమి నుంచి ఉపశమనం పొందేందుకు ప్రజలు శీతలపానియాల వైపు మొగ్గు చూపుతున్నారు. దీంతో శీతలపానియాల విక్రయాలు ఊపందుకుంటున్నాయి. ఆదిలాబాద్‌తో పాటు ఇతర ప్రాంతాల నుంచి తీసుకు వచ్చిన రంజన్లను విక్రయిస్తుండడంతో ప్రజలు కొనుగోలుకు ఆసక్తి కనబరుస్తున్నారు. కూలర్లకు గిరాకీ పెరిగింది. వడదెబ్బకు గురికాకుండా జాగ్రత్తలు పాటించాలని వైద్యులు హెచ్చరిస్తున్నారు. పగటిపూట అవసరమైతే తప్ప బయట తిరగొద్దు. శారీరక శ్రమతో కూడిన పనులు చేయవద్దు. డీహైడ్రేషన్‌కు గురవకుండా మంచినీటిని అధికంగా తీసుకోవాలన్నారు. కాటన్ దుస్తులనే ధరించాలి. ఎండలో ప్రయాణించాల్సి వస్తే ముఖానికి రుమాలు కట్టుకోవాలి, టోపీలు, చలువ అద్దాలు, గొడుగు, హెల్మెట్ ధరించాలి. పంచదార, మజ్జిగ, నిమ్మరసం, ఉప్పుకలిపిన నీటిని తరుచూ తాగాలి. ఆరోగ్య సమస్యలు తలెత్తినప్పుడు వెంటనే వైద్యులను సంప్రదించాలన్నారు.

# మళ్లీ పెరిగిన టోల్‌చార్జీలు

## నేటి నుంచి అమల్లోకి

## రానున్న నిబంధనలు

హైదరాబాద్, మార్చి31(సమయజ్యోతి): హైదరాబాద్ ఔటర్ రింగ్‌రోడ్డుపై టోల్ చార్జీలు మరోసారి పెరిగాయి. పెరిగిన చార్జీలు ఏప్రిల్ 1 నుంచి అమలులోకి వస్తాయని ఐఆర్‌బీ ఇన్‌ఫ్రా లిమిటెడ్ సంస్థ వెల్లడించింది. హెచ్?ఎండీఏ పరిధిలోని హైదరాబాద్ గ్రోత్ కారిడార్ లిమిటెడ్ నిర్వహణలో ఉండే ఓఆర్‌ఆర్‌ను ఐఆర్?బీ సంస్థ రెండేండ్ల క్రితం 30 ఏండ్ల కాలానికి లీజు తీసుకుంది. నిబంధనల ప్రకారం ఏటా 5 శాతం వరకు టోల్‌ఛార్జీలను పెంచుకునే వెసులుబాటు సంస్థకు కల్పించింది. ఇందులో భాగంగా టోల్? ధరలను పెంచింది. దీని ప్రకారం కారు, జీపు, వ్యాన్, లైట్ వాహనాలకు కిలోమీటర్‌కు 10 పైసలు పెంచింది. దీంతో ప్రస్తుతం కిలోమీటర్‌కు రూ.2.34గా ఉన్న చార్జీలు రూ.2.44కు పెరిగాయి. అదేవిధంగా మినీబస్, ఎల్‌సీవీలకు కిలోమీటర్‌కు 20 పైసలు వడ్డించింది. దీంతో ప్రస్తుతం ఉన్న రూ.3.77 నుంచి రూ.3.94కు చేరింది. 2 యాక్సిల్ బస్సులకు కిలోమీటర్‌కు రూ.6.69 నుంచి రూ.7కు పెంచింది. భారీ వాహనాలకు కిలోమీటర్‌కు రూ.15.09 నుంచి రూ.15.78కు పెంచింది. ప్రతి ఏడాది ఏప్రిల్ 1న టోల్‌చార్జీలను సంస్థ పెంచుతూ వస్తున్నది. ఇందులో భాగంగా గతేడాది లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో జూన్ నుంచి పెరిగిన చార్జీలు అమల్లోకి వచ్చాయి. తాజాగా మరోసారి చార్జీలను పెంచింది.




# ముస్లింలకు కేసీఆర్ రంజాన్ శుభాకాంక్షలు

హైదరాబాద్, మార్చి31(సమయజ్యోతి): బీఆర్ఎస్ అధినేత కేసీఆం ముస్లింలకు రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు. గంగాజమున తెహజీబ్‌కు తెలంగాణ నిలయమన్నారు. బీఆర్ఎస్ హయాంలో మైనారిటీల అభివృద్ధికి విశేష కృషి చేశామని తెలిపారు. మత సామరస్యం, లౌకికవాద పాలనతోనే శాంతిభద్రతలు నెలకొంటాయని చెప్పారు. అభివృద్ధికి సామాజిక ప్రశాంతత కీలకమని వెల్లడించారు. బీఆర్ఎస్ విధానాలను కొనసాగిస్తే మరింత ప్రగతి సాధ్యమని తెలిపారు.

# బెట్టింగ్ యాప్స్‌పై ప్రత్యేక బృందం ఏర్పాటు

## ఆదేశాలు జారీ చేసిన డీజీపీ జితేందర్

హైదరాబాద్, మార్చి31(సమయజ్యోతి): కొంతకాలంగా బెట్టింగ్‌యాప్స్ వల్ల ఎంతోమంది అప్పులపాలై ఆత్మహత్యలకు పాల్పడ్డారు. ఈ క్రమంలో బెట్టింగ్ యాప్స్‌ను ప్రమోట్‌చేస్తున్న పలువురు సినీ యాక్టర్లకు నోటీసులు పంపి కేసు నమోదు చేశారు. ఈ నేపథ్యంలోనే బెట్టింగ్ యాప్స్ వ్యవహారంపై ప్రభుత్వం ప్రత్యేక దర్యాప్తు బృందాన్ని ఏర్పాటు చేసింది. ఈమేరకు డీజీపీ జితేందర్ ఆదేశాలు జారీచేశారు. సీఐడీ అదనపు డీజీ పర్యవేక్షణలో సిట్ దర్యాప్తు చేపట్టనుంది. ఇందులో ఐజీ ఎం.రమేష్‌తోపాటు ఎస్పీలు సింధు శర్మ, వెంకటలక్ష్మి, అదనపు ఎస్పీ చంద్రకాంత్, శంకర్‌లను సభ్యులుగా నియమించారు. 90 రోజుల్లో పూర్తిస్థాయి నివేదిక అందజేయాలని ఆదేశించారు. బెట్టింగ్ యాప్స్ ప్రమోషన్స్‌పై ఇప్పటికే రెండు కేసులు నమోదయ్యాయి. హైదరాబాద్ పంజాగుట్టతోపాటు సైబరాబాద్ మియాపూర్‌లో కేసులు నమోదైన విషయం తెలిసిందే. టాలీవుడ్, బాలీవుడ్ నటులతోపాటు యూట్యూబర్స్, టీవీ యాంకర్లు 25 మందిపై పోలీసులు కేసులు నమోదు చేశారు. ఈ రెండు కేసులను కూడా సిట్‌కు బదిలీ చేశారు.



# జీవకోటిని కాపాడుకోవాలి !

## ( ఆధ్యాత్మికం )

తిరుమల,మార్చి30(సమయజ్యోతి): మనిషజతో పాటు కోటానుకోట్ల జీవరాశి ఈభూమ్మీద నివసిస్తోంది. ఇది ప్రకృతి ధర్మం. మనతో పాటు ఇవ మనుగడ సాగిస్తేనే మనకు కూడా జీవిక సాధ్యం. ఈ ప్రపంచంలో అనంత ప్రాణకోటి ఉంది. మనిషి తను బతుకుతూ.. తనపరిసరాలను బతికించుకోవాలి. తోటి జీవకోటిని కాపాడుకోవాలి. లేకుంటే మనమనుగడ కూడా ప్రశ్నార్థకం కాగలదు. జీవకోటిలో తెలివితేటలున్న మనిషి మాత్రం అనుకున్నదే తడవుగా ఫలితం వెంటనే కనబడాలని చూస్తాడు.పశు పక్ష్యాదులు, ఎడారుల్లో సంచరించే జీవులు, ఉభయచరాలు ఎంతో ఓర్పు, సహనంతో కాలం వెళ్ళ బుచ్చుతాయి. ముమ్ముందు కాలం అనుకూలంగా ఉంటుందన్న ఆశతో ప్రతికూల పరిస్థితుల్ని తట్టుకొని జీవిస్తాయి. ఒక పేదవాడు తన ఇంటిముందు ఓ మొక్క నాటాడు. కొన్ని రోజులకు అది పెరిగి పెద్దదయింది. అది పండ్లు ఇచ్చి ఆకలి తీర్చుతుందని ఆశపడ్డాడు. చాలా రోజులు ఎదురు చూశాడు. కాని, అలా జరగలేదు. తగినంత ఆహారం అందక శరీరంతోపాటు మనసూ బలహీనపడింది. ఫలితంగా, అతడి నిరీక్షణ- కాలాన్ని మరింత పొడిగించిన భావన కలగజేసింది. విసుగు తెప్పించింది. కోరిక నెరవేరలేదని అతడిలో కోపాగ్ని రగిలింది. విచక్షణా జ్ఞానం కోల్పోయాడు. పూత, కాత రెండూ లేని చెట్టు ఎందుకని దాన్ని నరికివేశాడు. మరుసటి రోజు తెల్లవారి లేచి చూస్తే పడిపోయిన చెట్టుకు ఒక పువ్వు పూసి ఉంది. ఆ సన్నివేశం చూశాక అతడిలో దుఃఖం పొంగు కొచ్చింది. ఆ చెట్టును పట్టుకుని విలపించాడు. తొందరపడ్డానని బాధపడ్డాడు. జీవితం ఇలాగే అనూహ్య తీర్పునిస్తుంది. కారణం, అది నిత్యనూతనం. అందువల్లే 'ఫలితం పని చేసేవాడి చేతిలో లేదు. అది కాలపురుషుడి నిర్ణయం' అని గీత చెబుతుంది. కాలనికి అనుగుణంగా మనం కూడా ముందుకు సాగాలి. అప్పుడే ఫలితం వస్తుంది.

# భక్తిప్రపత్తులతో రంజాన్ వేడుకలు

వరంగల్, మార్చి31(సమయజ్యోతి): రంజాన్ పర్వదినాన్ని పురస్కరించుకొని వివిధ ప్రాంతాల్లోని ఈద్గాలు, మసీదులను ప్రార్థనల కోసం సిద్ధం చేశారు. వివిధ ప్రాంతాల్లో గల ఈద్గాల వద్ద ప్రార్థనల కోసం చేసిన ఏర్పాట్లను పోలీసులు, ఇతర శాఖల అధికారులు పర్యవేక్షించారు. ప్రజలంతా సోదరభావంతో పండుగను నిర్వహించుకోవాలని నాయకులు, అధికారులు కోరారు. అలాగే ప్రజలకు రంజాన్ శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ క్రమంలో వరంగల్ ఈద్గాలు మసీదులో రంజాన్ సందడి నెలకొంది. ముస్లిం సోదరులు ప్రత్యేక ప్రార్థనలు చేస్తున్నారు. మంత్రి కొండా సురేఖ ఈద్గా ప్రార్థనల్లో పాల్గొన్నారు. అలాగే హనుమకొండ బొక్కలగడ్డ ఈద్గా ప్రార్థనల్లో ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి పాల్గొన్నారు. మహబూబాబాద్, ములుగు, జనగామ, భూపాలపల్లి జిల్లా కేంద్రాల్లోనూ మసీదులు, ఈద్గాలు ముస్లింలతో కిక్కిరిసిపోయాయి.

# రెండురోజులు తేలికపాటి వర్షాలు

హైదరాబాద్, మార్చి31(సమయజ్యోతి): రాష్ట్ర వ్యాప్తంగా ఎండలు దంచికొడుతున్నాయి. రోజురోజుకు ఉష్ణోగ్రతలు పెరుగుతున్నాయి. దీంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మధ్యాహ్నం బయటకు వెళ్లాలంటేనే భయపడిపోతున్నారు. ఈ నేపథ్యంలో ప్రజలకు హైదరాబాద్ వాతావరణ కేంద్రం చల్లని ముచ్చట చెప్పింది. రెండు రోజులపాటు వర్షాలు కురుస్తాయని తెలిపింది. మంగళవారం రాత్రి నుంచి ఏప్రిల్ 3 వరకు తేలికపాటి నుంచి మోస్తరు వాన పడే అవకాశం ఉందని వెల్లడించింది. భూ ఉపరితలం వేడెక్కడంతో వర్షాలు కురిసే అవకాశం ఉందని పేర్కొంది. ఏప్రిల్ 4న వర్ష ప్రభావం తక్కువగా ఉండే అవకాశం ఉందని తెలిపింది. ఏప్రిల్ 2, 3 తేదీల్లో పగటి ఉష్ణోగ్రతలు 3 నుంచి 4 డిగ్రీలు తక్కువగా నమోదయ్యే అవకాశం ఉందని వెల్లడించింది.

# ఈనెల 14న పబ్లిక్‌హాలిడే

హైదరాబాద్, మార్చి31(సమయజ్యోతి):

డాక్టర్ భీమ్‌రావ్ రామ్‌జీ అంబేద్కర్ జయంతి రోజు ఏప్రిల్ 14న ఎట్టకేలకు కేంద్ర ప్రభుత్వం పబ్లిక్ హాలిడేగా ప్రకటించింది. సమాజానికి, రాజ్యాంగానికి ఆయన చేసిన కృషికి గుర్తింపుగా కేంద్ర ప్రభుత్వం ఈ మేరకు ప్రభుత్వ సెలవుదినంగా ప్రకటించింది. ఈ విషయాన్ని వెల్లడిస్తూ కేంద్ర సాంస్కృతిక మంత్రి గజేంద్ర సింగ్ షెకావత్ తన సోషల్ మీడియా ఖాతాలో పోస్టు పెట్టారు. రాజ్యాంగ నిర్మాత, సమాజంలో సమానత్వం కోసం కొత్త శకాన్ని స్థాపించిన బాబా సాహెబ్ డాక్టర్ భీమ్‌రావ్ అంబేద్కర్ జయంతిని ప్రభుత్వ సెలవుదినంగా ప్రకటినట్లు తన ఖాతాలో పోస్ట్ చేశారు. బీఆర్ అంబేద్కర్ జయంతిని జాతీయ సెలవుదినంగా ప్రకటించడం పట్ల ప్రధాని మోదీ అంకిత భావం గుర్తించాలని ఆయన అన్నారు. దేశ ప్రజల మనోభావాలను గౌరవించి ప్రదాని మోదీ ఈ నిర్ణయం తీసుకున్నారని గజేంద్ర సింగ్ షెకావత్ పేర్కొన్నారు. కాగా అంబేద్కర్‌పై బీజేపీ, కాంగ్రెస్ మధ్య ఇటీవల తీవ్ర ఘర్షణ నెలకొన్న సంగతి తెలిసిందే. ఈ క్రమంలో బీఆర్ అంబేద్కర్ జయంతిని జాతీయ సెలవు దినంగా పాటించాలని కేంద్రం నిర్ణయం తీసుకుంది. కాగా డాక్టర్ భీమ్‌రావ్ రామ్‌జీ అంబేద్కర్ 1891 ఏప్రిల్ 14న మధ్యప్రదేశ్‌లోని మోవ్‌లో జన్మించారు. నవ భారతాన్ని రూపొందించడంలో ఆయన కీలక పాత్ర పోషించారు. దళిత ప్రజల మనుగడ కోసం ఆయన ఏకంగా భారత రాజ్యాంగాన్ని రచించి దేశ చరిత్రలో నూతన శకం రూపొందించారు.

# బీఆర్‌ఎస్ హయాంలో అన్ని మతాలకు ప్రాధాన్యం

## ముస్లింలకు హరీశ్‌రావు రంజాన్ శుభాకాంక్షలు

హైదరాబాద్, మార్చి31(సమయజ్యోతి):

గత బీఆర్‌ఎస్ ప్రభుత్వంలో అన్ని మతాలకు ప్రాధాన్యం లభించిందని బీఆర్‌ఎస్ నేత హరీశ్‌రావు అన్నారు. కేసీఆర్ గత పదేండ్లలో హిందువుల అభ్యున్నతి కోసం ఏవిధంగా పాటుపడ్డారో.. అలాగే మైనారిటీల అభ్యున్నతి కోసం కూడా అంతే పాటుపడ్డారని తెలిపారు. సిద్దిపేటలో నిర్వహించిన రంజాన్ వేడుకల్లో హరీశ్‌రావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా రాష్ట్రవ్యాప్తంగా ఉన్న ముస్లిం సోదరులకు శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం హరీశ్‌రావు మాట్లాడుతూ.. రంజాన్ పండుగను హిందూ, ముస్లిం అనే భేదాభిప్రాయాలు లేకుండా చేసుకోవాలని సూచించారు. నిన్న ఉగాది పండుగ రోజు ముస్లింలు హిందువుల ఇండ్లలోకి వచ్చి బక్షాలు తిని.. ఉగాది శుభాకాంక్షలు తెలిపారని అన్నారు. సోమవారం రంజాన్ పండుగ సందర్భంగా హిందువులు ముస్లిం సోదరులను అలయ్ బలయ్ చేసుకొని రంజాన్ శుభాకాంక్షలు తెలుపుతున్నారని పేర్కొన్నారు. ఎన్నో ఏండ్ల నుంచి మన దేశం, రాష్ట్రం మతాలకతీతంగా సోదర భావంతో ఒకరి పండుగల్ని ఒకరు.. ఒకరి సంప్రదాయాన్ని మరొకరు గౌరవిస్తూ ఎంతో సఖ్యతతో జీవిస్తున్నారని తెలిపారు. కొన్ని శక్తులు రెచ్చగొట్టే ప్రయత్నం చేస్తున్నప్పటికీ అందరూ ఓపికతో, శాంతితో, సౌభాగ్యంతో కలిసి మెలసి ఈ దేశ, రాష్ట్ర అభివృద్ధి కోసం సోదర భావంతో అందరం కలిసి కృషి చేయాలని కోరారు.



# దైవదర్శనానికి వచ్చిన మహిళపై దారుణం

## బంధువుపై దాడి..మహిళపై సామూహిక అత్యాచారం

నాగర్‌కర్నూల్,మార్చి 31(సమయజ్యోతి):

నాగర్‌కర్నూల్ జిల్లా ఊరుకొండ పేట ఆంజనేయ స్వామి దేవలయ సమీపంలో దారుణం జరిగింది. దైవదర్శనానికి వచ్చిన ఓ మహిళపై అదే గ్రామానికి చెందిన ఎనిమిది మంది యువకులు సామూహిక అత్యాచారానికి పాల్పడ్డారు. గత శనివారం ఓ కుటుంబం ఊరుకొండ ఆంజనేయ స్వామి దేవాలయానికి వచ్చింది. కుటుంబసభ్యులంతా స్వామివారికి మొక్కులు తీర్చుకున్నారు. ఇంతలోనే ఆ కుటుంబంలోని ఓ మహిళ బహిర్భూమికి వెళ్లాల్సి వచ్చింది. దీంతో బంధువును వెంట పెట్టుకుని మహిళ బహిర్భూమికి వెళ్లింది. కానీ ఆ కుటుంబం వచ్చినప్పటి నుంచి ఆ ఊరలోని కొందరు వ్యక్తులు మహిళపై కన్నేశారు. అవకాశం కోసం ఎదురు చూశారు. మహిళ బహిర్భూమికి వెళ్తున్న విషయాన్ని గమనించిన సదరు వ్యక్తులు... ఆమె వెంటే వెళ్లారు. ఆపై మహిళతో పాటు వచ్చిన బంధువుపై దాడి చేసి.. మహిళను పక్కనే ఉన్న చెట్ల పొదల్లోకి తీసుకెళ్లారు. ఆమెపై ఎనిమిది మంది యువకులు అత్యాచారానికి పాల్పడ్డారు. మహిళ ఎంత ప్రతిఘటించినప్పటికీ ఫలితం లేకుండా పోయింది. అత్యాచారం అనంతరం ఆ కామాంధులు అక్కడి నుంచి పరారయ్యారు. జరిగిన ఘటనపై బాధితురాలు పోలీసులను ఆశ్రయించింది. మహిళ ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి నిందితుల కోసం గాలింపు చర్యలు చేపట్టారు. ఎట్టకేలకు ఆరుగురు నిందితులను గుర్తించి అదుపులోకి తీసుకున్నారు. మరో ఇద్దరు యువకులు పరారీలో ఉన్నారు. వారి కోసం పోలీసులు విస్తృతంగా గాలింపు చర్యలు చేపట్టారు. దీనిపై పోలీసులు స్పందిస్తూ విచారణ కొనసాగుతోందని.. వివరాలను త్వరలోనే ప్రకటిస్తామని తెలిపారు. అలాగే బాధితురాలిని చికిత్స నిమిత్తం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. మహిళపై అత్యాచార ఘటన గ్రామంలో సంచలనంగా మారింది.

# ఛత్తీస్‌గాడ్‌లోమరోమారు కాల్పులు

## ఎన్‌కౌంటర్‌లో మహిళా మావో రేణుక హతం

రాయ్‌పూర్,మార్చి 31(సమయజ్యోతి):

సోమవారం ఉదయం ఛత్తీస్‌గఢ్‌లోని దంతెవాడ జిల్లాలో మరో ఎన్‌కౌంటర్ జరిగింది. రిజర్వ్ గార్డ్ ఆధ్వర్యంలోని భద్రతా దళాల బృందం దంతెవాడ జిల్లాలో బీజాపూర్ సరిహద్దు గ్రామాలైన నెల్గోడ, అకేలి, బెల్నార్‌లోని భైరామ్‌గఢ్ పోలీస్ స్టేషన్ ప్రాంతాలలో మావోయిస్టు వ్యతిరేక ఆపరేషన్ చేపట్టారు. మావోయిస్టులకు, భద్రతా బలగాల మధ్య జరిగిన ఎదురు కాల్పుల్లో రేణుక అలియాస్ బాను అనే మహిళా మావోయిస్టు మృతి చెందారు. ఆమె రూ.25 లక్షల రివార్డు ఉన్న దండకారణ్య స్పెషల్ కమిటీకి చెందిన వారిగా భద్రతా దళాలు గుర్తించాయి. ఘటనాస్థలి నుంచి మహిళా మావోయిస్టు మృతదేహంతోపాటు ఇన్సాస్ రైఫిల్, మందు గుండు సామాగ్రిని స్వాధీనం చేసుకున్నారు. ప్రస్తుతం అక్కడ ఆపరేషన్ కొనసాగుతోంది. దంతేవాడ, బీజాపూర్ జిల్లాల సరిహద్దులోని అటవీ ప్రాంతంలో మావోయిస్టులు ఉన్నట్లు సమాచారం అందుకున్న భద్రతా సిబ్బంది యాంటీ-నక్సలైట్ ఆపరేషన్ చేపట్టారు. ఈ ఎన్‌కౌంటర్‌లో మహిళా మావోయిస్టు మృతి చెందింది. మృతి చెందిన మావోయిస్టు వరంగల్‌కు చెందిన రేణుక అలియాస్ చైతి అలియాస్ సరస్వతిగా గుర్తించారు. ఈమె మావోయిస్టు స్పెషల్ జోనల్ కమిటీ సభ్యురాలని.. దండకారణ్య స్పెషల్ జోన్‌లో కమిటీ సభ్యురాలిగా ఉన్నట్లు అధికారులు తెలిపారు. ఆమె తలపై రూ.25లక్షలు ఉన్నట్లు- వెల్లడించారు. ఎన్‌కౌంటర్ జరిగిన ప్రాంతంలో భారీగా

# ముస్లింలకు వేముల రంజాన్ శుభాకాంక్షలు

## బిఆర్‌ఎస్ అన్ని మతాలను గౌరవిస్తుందని వెల్లడి

## హైదరాబాద్ సెంట్రల్ వర్సిటీ భూముల అమ్మకంపై ఆగ్రహం

నిజామాబాద్,మార్చి31(సమయజ్యోతి):

ముస్లింలకు మాజీమంత్రి వేముల ప్రశాంతరెడ్డి శుభాకాంక్షలు తెలిపారు. రంజాన్ సందర్భంగా బాబాపేటలో మాజీ కో ఆప్షన్ సభ్యుడు మోయిజ్ ఇంట్లో విందుకు హాజరయ్యారు. ఈ సందర్భంగా ముస్లింలకు ఆయన శు భాకాంక్షలు తెలిపారు. బిఆర్ఎస్ ప్రభు÷-వంలో అన్ని మతాల పండగలను ప్రభుత్వం ఆదరించిందని అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ అస్తవ్యస్త విధానాలతో తెలంగాణ ఆగం అవుతోందన్నారు. వరిపంటలకు నీరు అందడం లేదన్నారు. గతంలో ఎప్పుడూ ఇలాంటి దుస్థితి లేదన్నారు. గ్రామాల్లో తాగునీటి కొరత తీవ్రంగా ఉందన్నారు. భూములుల అమ్మి ప్రభుత్వాన్ని నడిపే ప్రభుత్వంగా మారిందన్నారు. హైదరాబాద్ నడిబొడ్డున సెంట్రల్ యూనివర్సిటీ విద్యార్థులపై జరిగిన పోలీసు లాఠీచ్ఛార్జినిప్రశాంత్ రెడ్డితీవ్రంగా ఖండించారు. యూనివర్సిటీలో పోలీసులను మోహరించి నిరసన తెలియజేసిన విద్యార్థినుల్ని లాఠీలతో కొట్టడం, పోలీసులు స్టేషన్‌కి ఈడ్చుకెళ్లడం.. ఇదేనా ఇందిరమ్మ రాజ్యం అని నిలదీశారు. కేంద్ర విద్యాసంస్థలకు చెందిన భూములను రాష్ట్ర ప్రభుత్వం తమ వ్యాపార ప్రయోజనాలకు వాడుకోవడమేంటని ఆయన ప్రశ్నించారు. విద్యార్థుల భవిష్యత్తును, రాజ్యాంగం కల్పించిన హక్కులను తెలంగాణ కాంగ్రెస్ ప్రభుత్వం కాలరాస్తోందని మండిపడ్డారు. విద్యాసంస్థల భూముల అమ్మకాల కోసం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి విద్యాశాఖను తన వద్దే ఉంచుకున్నారా అని ప్రశ్నించారు. ప్రశ్నిస్తే, నిలదీస్తే హింసించడమేనా మీ ప్రజాస్వామ్యం అని అడిగారు.



జీవవైవిధ్యాన్ని రక్షించడం ప్రభుత్వ బాధ్యత అని, కానీ భూములను అమ్మి కాంక్రీట్ జంగల్ సష్టిస్తారా చెప్పాలని స్పష్టం చేశారు. 400 ఎకరాల భూమిలో ఉన్న వన్యప్రాణులను నాశనం చేసి, రియల్ ఎస్టేట్ వ్యాపారులకు భూమిని అప్పగించాలనుకోవడం ఎంతవరకు న్యాయమేని ప్రశ్నించారు. భూముల వేలాన్ని నిలిపివేయడానికి పర్యావరణ, అటవీ శాఖలు తక్షణమే జోక్యం చేసుకోవాలని కోరారు. యూనివర్సిటీ భూములను రక్షించేందుకు భవిష్యత్ తరాలను దృష్టిలో పెట్టుకుని పార్టీలకతీతంగా అందరూ ఏకం కావాలని ఆయన కోరారు. ప్రభుత్వం సెంట్రల్ యూనివర్సిటీ భూములపై పునరాలోచించి, నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు.

# అంతకంతకూ పెరుగుతున్న పసిడి ధరలు

## తులం ధర లక్షకు చేరుకుంటుందని అంచనా

న్యూఢిల్లీ,మార్చి31(సమయజ్యోతి):



బంగారం ధరలు అంతకంతకే పెరిగిపోతున్నాయి. దాంతో సామన్యులకు బంగారం కొనుగోలు తలకు మించిన భారంగా మారిపోతున్నది. అంతర్జాతీయ మార్కెట్‌లో రానున్న ఏడాదిన్నర కాలంలో ఔన్స్ బంగారం ధర 3500 డాలర్లకు చేరుకునే అవకాశం ఉన్నదని ఓ సంస్థ తన నివేదికలో పేర్కొన్నది. అంటే భారత కరెన్సీలో తులం బంగారం ధర రూ.1 లక్ష దాటుతుందని ఆ రిసెర్చ్ స్పష్టం చేసింది. అయితే 2025-26 ఆర్థిక సంవత్సరంలో నాన్ కమర్షియల్ కొనుగోళ్లు 10 శాతం పెరిగినప్పుడు మాత్రమే బంగారం ధర ఆ స్థాయికి చేరుతుందని తెలిపింది. 2025లో నాన్ కమర్షియల్ కొనుగోళ్లు 1 శాతం పెరిగితే అంతర్జాతయ మార్కెట్‌లో ఔన్స్ బంగారం సగటు ధర 3000 డాలర్లకు చేరిందని బోఫా గ్లోబల్ రిసెర్చ్ తెలిపింది. బంగారం ధరలు పెరగడానికి వివిధ కారణాలను సదరు సంస్థ వెల్లడించింది. చైనాకు చెందిన ఓ ఇన్సూరెన్స్ కంపెనీ తన ఆస్తుల్లో ఒక శాతాన్ని బంగారంపై పెట్టు-బడిగా పెట్టనుండటం కూడా బంగారం ధర పెంపునకు కారణమని తెలిపింది. ఆ కంపెనీ ఆస్తుల్లో ఒక శాతం అంటే ఒక ఏడాది గోల్డ్ మార్కెట్ విలువలో 6 శాతానికి సమానమని తెలిపింది. అదేవిధంగా ప్రపంచవ్యాప్తంగా ఉన్న సెంట్రల్ బ్యాంకులు తమ పోర్ట్‌ఫోలియోలను మరింత సమర్థంగా మార్చుకోవడం కోసం ప్రస్తుతం తమ దగ్గరున్న 10 శాతం బంగారం నిల్వలను 30 శాతానికి పెంచుకోబోతున్నాయి. అదేగనుక జరిగితే బంగారం ధరలకు అమాంతం రెక్కలు రానున్నాయని బోఫా గ్లోబల్ రిసెర్చ్ పేర్కొంది. స్టాక్ మార్కెట్ల ఒడిదొడుకుల నేపథ్యంలో రి-టైల్ ఇన్వెస్టర్లు బంగారంపై పెట్టు-బడులు పెట్టేందుకు ఎక్కువగా మొగ్గ చూపుతుండటం కూడా ధరలు పెరగడానికి కారణమని తెలిపింది.

# అత్యారాం కేసులో దర్శకుడు సనోజ్ మిశ్రా అరెస్ట్

## యువతిపై పలుమార్లు అత్యాం..

## వీడియోలతో బెదరింపులు

న్యూఢిల్లీ,మార్చి31(సమయజ్యోతి):

అత్యాచారం కేసులో దర్శకుడు సనోజ్ మిశ్రాను ఢిల్లీ పోలీసులు అరెస్ట్ చేశారు. దర్శకుడు సనోజ్ మిశ్రను ఢిల్లీ పోలీసులు సోమవారం అరెస్ట్ చేశారు. పెళ్లి చేసుకుంటాను, హీరోయిన్‌గా అవకాశం కల్పిస్తానని నమ్మబలికి ఓ యువతిపై పలుమార్లు అత్యాచారానికి ఒడిగట్టాడు. మాట వినకపోతే.. వారి అసభ్య వీడియోలను సోషల్ మీడియాలో పోస్ట్ చేస్తానని బెదిరిస్తున్నాడంటూ బాధితురాలు పోలీసులను ఆశ్రయించడంతో దారుణం వెలుగులోకి వచ్చింది. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు.. డైరెక్టర్‌ను అరెస్ట్ చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం బాధితురాలు.. ఝాన్సీ ప్రాంతంలో నివాసం ఉండేది. 2020లో ఆమెకు డైరెక్టర్ మిశ్రతో పరిచయం ఏర్పడింది. ఈ క్రమంలో 2021, జూన్ 17న మిశ్రా బాధితురాలికి కాల్ చేశాడు. తాను ఝాన్సీ రైల్వే స్టేషన్‌లో ఉన్నానని.. తనను కలవాల్సిందిగా కోరాడు. బాధితురాలు రానని చెప్పడంతో.. చనిపోతానంటూ మిశ్ర ఆమెను బెదిరించాడు. అతడి బెదిరింపులకు భయపడిన బాధితురాలు తర్వాత రోజు అనగా జూన్ 18, 2021 నాడు మిశ్రాని కలిసింది. తర్వాత ఇద్దరు ఓ రిసార్ట్‌కు వెళ్లార. అక్కడ మిశ్రా బాధితురాలికి మత్తుమందు ఇచ్చి ఆమెపై అత్యాచారానికి పాల్పడ్డాడు. అంతేకాక వీడియోలు తీసి.. ఆమెని బెదిరించి.. అనేక మార్లు కోరిక తీర్చుకున్నాడు. అంతేకాక బాధితురాలిని పెళ్లి చేసుకుంటానని, తన సినిమాల్లో ఆమెకు అవకాశాలు ఇస్తానని నమ్మబలికాడని చెప్పుకొచ్చింది. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు అతడిని అరెస్ట్ చేశారు. మిశ్రా విషయానికి వస్తే.. ఆయన గాంధీగిరి, రామ్ కి జన్మభూమి, లఫంగే నవాబ్, కాశీ టూ కశ్మీర్ వంటి సినిమాలను తెరకెక్కించాడు. కుఉంభమేళాలో మోనాలిసాకు హీరోయిన్ అవకాశం ఇస్తానని ప్రామిస్ చేసిన మిశ్ర.. ప్రస్తుతం ఆమెని యాక్టింగ్ కోర్స్‌లో జాయిన్ చేశాడని సమాచారం.

# ఆ భూములతో హెచ్‌సిఎకు సంబంధం లేదు

## అవి పక్కాగా ప్రభుత్వ భూములేనని వెల్లడి

## తేల్చి చెప్పిన తెలంగాణ ప్రభుత్వం

హైదరాబాద్,మార్చి31(సమయజ్యోతి):

హెచ్‌సీయూ భూములపై బీజేపీ నేతల విమర్శలతో తెలంగాణ ప్రభుత్వం వివరణ ఇచ్చింది. అక్కడ ఉన్న 4 వందల ఎకరాల భూమి ప్రభుత్వానిదేనని ప్రాజెక్టులో హెచ్‌సీయూ భూమి లేదని ప్రభుత్వం తెలిపింది. మేమే భూ యజమానులమని కోర్టు ద్వారా నిరూపించుకున్నామని, ప్రైవేట్ సంస్థకు 21 ఏళ్ల కిత్రం కేటాయించిన భూమిని.. న్యాయ పోరాటంతో దక్కించుకున్నామని తెలంగాణ ప్రభుత్వం తెలిపింది. వేలం, అభివృద్ధి పనులు అక్కడ ఉన్న రాళ్లను దెబ్బతీయవని, అభివృద్ధికి ఇచ్చిన భూమిలో చెరువు లేదని ప్రభుత్వం స్పష్టం చేసింది. 2004లో నాటి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లోని రాష్ట్ర ప్రభుత్వం ఒక ప్రైవేటు- సంస్థకు ఈ భూమిని కేటాయించిందని, దేశ అత్యున్నత న్యాయస్థానం సుప్రీంకోర్టులోని కేసుల్లో చట్టపరంగా గెలవడం ద్వారా తెలంగాణలోని కాంగ్రెస్ ప్రభుత్వం ఆ భూమిపై యాజమాన్యాన్ని దక్కించుకుందని, ఆ భూమికి సంబంధించి సృష్టించే ఎటువంటి వివాదమైనా కోర్టు ధిక్కరణ కిందకు వస్తుందని తెలంగాణ ప్రభుత్వం తేల్చి చెప్పింది. సర్వేలో ఒక్క అంగుళం భూమి కూడా యూనివర్సిటీ ఆఫ్ హైదరాబాద్‌ది కాదని తేల్చింది. ఈ భూమిలో ప్రభుత్వం చేపట్టే అభివృద్ధి ప్రణాళికలో ఏ చెరువు లేదని.. కొత్తగా చేపడుతున్న అభివృద్ధి ప్రణాళిక అక్కడ ఉన్న రాళ్ల రూపాలను దెబ్బతీయదని తెలిపింది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలోని ప్రభుత్వం చేపడుతున్న ప్రతి ప్రణాళికలో స్థానిక సుస్థిరాభివృద్ధి... పర్యావరణ అవసరాలకు అత్యధిక ప్రాధాన్యం ఇస్తోందని, ప్రస్తుత ప్రాజెక్ట్‌ను వ్యతిరేకించే వారంతా కొందరు రాజకీయ నాయకులు, స్థిరాస్తి వ్యాపారుల ప్రయోజనాలకు అనుగుణంగా విద్యార్థులను తప్పుదోవ పట్టిస్తున్నారని ప్రభుత్వం పేర్కొంది.

# జిహెచ్‌ఎంసిలో నిధుల కొరత

## మరోమారు ఎర్లీబర్డ్ స్కీమ్

హైదరాబాద్,మార్చి31(సమయజ్యోతి):

ఎర్టీబర్డ్ స్కీమ్‌తో మరోమారు గ్రేటర్ హైదరాబాద్ ముందుకు వచ్చింది. సోమవారంతో 90శాతం వడ్డీ రాయితీ పథకం ముగిసింది. దీంతో ఇప్పుడు నిధుల వేటలో ఉన్న జిహెచ్‌ఎంసి ఈ ప్రయత్నంలో ఉంది. 2025-26 ఆర్థిక సంవత్సర ఆస్తి పన్ను చెల్లింపుపై జీహెచ్‌ఎంసీ ఎర్టీబర్డ్ స్కీం ప్రవేశపెట్టింది. ఆస్తిపన్ను చెల్లింపు దారుల ప్రయోజనం కోసం ఎర్లీ బర్డ్ స్కీంను బల్దియా తీససుకుని వచ్చింది. గతంలోనూ ఇలాంటి ప్రయోగం చేసి మంచి ఫలితం రాబట్టింది. ఈ మేరకు జీహెచ్‌ఎంసీ అధికారులు సోమవారం నాడు ఓ ప్రకటన విడుదల చేశారు. ఎర్లీ బర్డ్ స్కీం ద్వారా ఆస్తి పన్ను ఏప్రిల్ 30వ తేదీ లోగా చెల్లిస్తే 5 శాతం రాయితీ పొందే అవకాశం ఉంది. ఏప్రిల్ 1వ తేదీ నుంచి 30వ తేదీ వరకు ఎర్లీ బర్డ్ స్కీం÷-ర అందుబాటులో ఉండనుంది. కేవలం 2025-26 ఆర్థిక సంవత్సర ఆస్తి పన్నుకు మాత్రమే ఎర్లీ బర్డ్ స్కీం వర్తింస్తుందని తెలిపింది. గత ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన బకాయిలపై ఎర్లీ బర్డ్ స్కీం వర్తించని విషయం తెలిసిందే. 2024-25 ఆర్థిక సంవత్సర ఆస్తి పన్ను ఓటీఎస్ స్కీం ముగిసింది. ఆస్తి పన్ను వసూలుకు మరో ముందడుగుగా ఎర్లీ బర్డ్ స్కీంను జీహెచ్‌ఎంసీ ప్రవేశపెట్టింది. దీనిపై అధికారులు లక్ష్యాలను నిర్దేశించారు.

# హెచ్‌సియూ భూములు అన్యాక్రాంతం చేయొద్దు

## రిజిస్ట్రార్ కీలక ప్రకటన

హైదరాబాద్,మార్చి31(సమయజ్యోతి):

గచ్చిబౌలి భూములపై హెచ్‌సీయూ రిజిస్ట్రార్ సోమవారం కీలక ప్రకటన చేశారు. యూనివర్సిటీ- భూమిని అన్యాక్రాంతం చేయొద్దని రాష్ట్ర ప్రభుత్వాన్ని అభ్యర్థించారు. పర్యావరణం, జీవవైవిధ్యాన్ని పరిరక్షించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. యూనివర్సిటీకి కేటాయించిన భూమిని బదిలీ చేయాలి అంటే విశ్వవిద్యాలయం కార్యనిర్వాహక మండలి అధికారిక సమ్మతితోనే జరుగుతుందని హెచ్‌సీయూ రిజిస్ట్రార్ స్పష్టం చేశారు. 2024 జూలైలో అక్కడ ఎలాంటి సర్వే నిర్వహించలేదని స్పష్టం చేశారు. ఇప్పటి వరకూ భూమి ఎలా ఉందని ప్రాథమిక పరిశీలన మాత్రమే చేశారని తేల్చిచెప్పారు. హద్దులు అంగీకరించినట్లు టీ-జీఐఐసీ చేసిన ప్రకటనను ఖండించారు. ఇప్పటి వరకూ భూమి సరిహద్దులు గుర్తించలేదని అన్నారు. ఈ విషయంపై హెచ్‌సీయూకు సమాచారం ఇవ్వలేదని రిజిస్ట్రార్ తెలిపారు. భూమిని కేటాయించడంతో పాటు- పర్యావరణం, జీవ వైవిధ్యాన్ని కాపాడాలని మరోసారి కూడా ప్రభుత్వాన్నికోరతామని హెచ్‌సీయూ రిజిస్ట్రార్ తెలిపారు. ఇటీ-వల పత్రికల్లో వచ్చిన టీ-జీఐఐసీ ప్రకటనను కూడా ఖండించారు.

# ప్రధాని ప్రైవేట్ సెక్రటరీగా నిధి తివారీ

## విదేశాంగ విధానంలో పట్టున్న అధికారి

న్యూఢిల్లీ,మార్చి31(సమయజ్యోతి):

విదేశాంగ విధానంలో మంచి పట్టు ఉన్న ఇండియన్ ఫారెన్ సర్వీస్ అధికారినిధి తివారీ ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ప్రైవేట్ సెక్రటరీగా నియమితులయ్యారు. వివిధ హోదాల్లో పనిచేసిన ఆమె అనుభవాన్ని దృష్టిలో పెట్టుకుని ఆమెను ప్రధాని ప్రైవేట్ సెకక్రటరీగా ఎంపిక చేశారు. పీఎంవోలో చేరడానికి ముందు నిధి తివారీ విదేశాంగ మంత్రిత్వశాఖలో పని చేశారు. ఆమె నిరాయుధీకరణ, అంతర్జాతీయ భద్రతా వ్యవహారాల విభాగంలో బాధ్యతలు నిర్వర్తించారు. అంతర్జాతీయ సంబంధాల మెరుగుదలలో ఆమెకు ఉన్న నైపుణ్యమే పీఎంవోలో కీలకపాత్ర పోషించే స్థాయికి తీసుకొచ్చింది. జాతీయ భద్రతా సలహాదారు అజిత్ డోభాల్‌కు ఫారెన్ అండ్ సెక్యూరిటీ-కి చెందిన అంశాలను నేరుగా ఆయనకు నివేదించడంలో కీలకపాత్ర వహించారు.

# కరీంనగర్ నగర ప్రజలకు త్రాగునీటి సమస్యను తీర్చండి ఎమ్మెల్యే గంగుల

- గత పదేళ్ల కాలంలో కరీంనగర్లో ఎలాంటి త్రాగునీటికి ఇబ్బందులు పడలేదు.

- వచ్చే వారం రోజుల్లో గా ఎల్ఎండిలో నీరు నింపకపోతే ప్రభుత్వానికి వ్యతిరేకంగా ప్రజలను సమాయత్తం చేసి ధర్నా నిర్వహిస్తాము.

**కరీంనగర్ బ్యూరోసమయజ్యోతి**

రాబోవు మూడు నెలల్లో కరీంనగర్ నగర పాలక సంస్థ పరిధిలోని ప్రజలకు త్రాగునీటికి ఇబ్బందులు ఎదురయ్యే పరిస్థితి ఉన్నందున పరిష్కారం చూపాలని నేడు బిఆర్ఎస్ పార్టీ శ్రేణులతో కలసి లోయర్ మానేరు డ్యామ్ ను సందర్శించిన మాజీ మంత్రి కరీంనగర్ శాసనసభ్యులు గంగుల కమలాకర్.

ఈ సందర్భంగా డ్యామ్ కు చేరుకున్న ఎమ్మెల్యే మొదటగా డ్యామ్ లోని నీటిమట్టాన్ని పరిశీలించి, అధికారుల నుండి వివరాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం మీడియా సమావేశంలో వారు మాట్లాడుతూ.. బిఆర్ఎస్ పార్టీ పక్షాన కరీంనగర్ నగరానికి త్రాగునీటిని సరఫరా చేసే ఎల్ ఎం డి ని సందర్శించడం జరిగిందని, ఈ ఎల్ ఎం డి ద్వారా కరీంనగర్ నగరానికి త్రాగునీటి సరఫరాతో పాటు, దిగువ ప్రాంతమైన సూర్యాపేట వరకు త్రాగునీరు సాగునీరు అందిస్తుందన్నారు. అంతేకాకుండా కరీంనగర్ చుట్టుపక్కల గల 12 లక్షల మందికి మిషన్ భగీరథ ద్వారా మంచినీటినందిస్తుందని తెలిపారు. అయితే గత సమైక్య పాలనలో 2012 వ సంవత్సరంలో తెలంగాణ రాష్ట్రం రాకముందు. నీటి సమస్యలపై యుద్ధాలు జరిగేవని, అందులో భాగంగా ఎల్ ఎం డి నుండి దిగువ ప్రాంతానికి నీరు విడుదల చేయడాన్ని తానే స్వయంగా అడ్డుకొని ఇసుక బస్తాలు వేసిన సంఘటనను గుర్తు చేశారు. ఇలాంటి పరిస్థితి మళ్లీ రాకుండా చూసుకోవాలని ప్రభుత్వానికి హెచ్చరించారు.

తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ 10 సంవత్సరాల పాలన కాలంలో ఏనాడు నీటి కోసం ఏ నాయకులు కూడ నిరసన వ్యక్తం చేసిన దాఖలాలు లేవన్నారు. 10 సంవత్సరాల పాటు ఎల్ ఎం డి. నిండుకుండగా ఉంచేందుకు కెసిఆర్ ప్రభుత్వం జీవో నెంబర్ 885 ను అక్టోబర్ 30 వ తారీఖు 2017వ సంవత్సరంలో విడుదల చేసిందని తెలిపారు. ఈ జీవో ద్వారా ఎల్ఎండిలో ఎప్పుడు 13 టీఎంసీల నీరు నిలువ ఉండేవిధంగా చర్యలు తీసుకోవడం జరిగిందని తెలిపారు. దీని ద్వారా కరీంనగర్ నగరపాలక సంస్థ పరిధిలో ప్రతిరోజు నీటి సరఫరా చేసామని, అదేవిధంగా 24 గంటల నీటిని సరఫరా చేసేందుకు చర్యలు తీసుకున్నట్టు తెలిపారు. కానీ ప్రస్తుతం లోయర్ మానేరు డ్యామ్ లో సుమారు 5.7 టీఎంసీల నీరు నిల్వ ఉందని గత పది సంవత్సరాల కాలంలో ఏనాడు ఈనెల 31 వ తారీకున ఇంత తక్కువగా నీటిమట్టాన్ని చూడలేదన్నారు.

ఎల్ ఎం డి లో ఉన్న నీటిని కిందికి తరలించడం తప్ప ఎగువ ప్రాంతంలో గల మిడ్ మానేరు, ఎల్లంపల్లి, ఎస్ ఆర్ ఎస్ పి నుండి ఎల్ ఎం డి కినీటిని తీసుకురావడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. 5.7 టిఎంసి నీళ్లలో 2.5 నీళ్లు డెడ్ స్టోరేజ్ గా ఉంటుందని... మిగతా 3.2 టీఎంసీ నీళ్లు మాత్రమే ఉంటాయని ఈ నీటి ద్వారా ఏప్రిల్ మే జూన్ మాసాలలో కరీంనగర్ ప్రజలకు త్రా గునీటిని అందించడం సాధ్యం కాదన్నారు. సూర్యాపేటకు ఈరోజు వరకే నీళ్లు పంపేది ఉండే కానీ అక్కడున్న పంట పొలాలకు చివరి తడి అందించడం కొరకు మూడు రోజులపాటు నీళ్లను వదులుతున్నారని, అయితే దిగువ ప్రాంతానికి నీటిని పంపించడంలో మేము వ్యతిరేకించడం లేదు కానీ, ఎగువ ప్రాంతం నుండి నీటిని తీసుకువచ్చి ఎల్ ఎం డి నింపి దిగువ ప్రాంతానికి నీటిని పంపించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలన్నారు.





గతంలోనే 3.3 టీఎంసీ నీరు ఉంటుందని ఇరిగేషన్ ఎస్. ఈ. కమిషనర్ కు లేఖ రాసారని కానీ ప్రభుత్వం ఎలాంటి చర్యలు తీసుకుపోవడం బాధాకరమన్నారు. ప్రస్తుతం నగరపాలక సంస్థ త్రాగునీరుపై ఎలాంటి చర్యలు తీసుకుంటుందో చెప్పాలని డిమాండ్ చేశారు. అదేవిధంగా తాను సాగునీటి పై త్రాగునీటిపై అసెంబ్లీలో మాట్లాడినట్టు తెలిపారు. గత నెల రోజులుగా ప్రతిరోజు నీటిని సరఫరా చేయడం లేదని, రోజు విడిచి రోజు నీటి సరఫరా చేస్తున్నారన్నారు. కరీంనగర్ నియోజకవర్గ ప్రాంతంలో సాగునీటిని వదలక పంటలు ఎండిపోయాయని ఆవేదన వ్యక్తం చేశారు. కనీసం త్రాగునీరు అయిన అందించి ప్రజల ప్రాణాలు కాపాడాలని వారు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే గంగుల వెంట నగర బి ఆర్ ఎస్ అధ్యక్షులు చల్ల హరిశంకర్, మాజీ కార్పొరేటర్లు వంగపల్లి రాజేందర్ రావు, వాల రమణారావు, మేచినేని అశోక్ రావు, బోనాల శ్రీకాంత్, ఐలేందర్ యాదవ్, కొత్తపల్లి మాజీ వైస్ ఎంపీపీ తిరుపతి నాయక్, దుర్శేడు మాజీ ఉపసర్పంచ్ సుంకిసాల సంపత్ రావు, మాజీ అర్బన్ బ్యాంకు డైరెక్టర్ కర్ర సూర్య శేఖర్, సుడా మాజీ డైరెక్టర్ నేతి రవివర్మ, నాయకులు నారదాసు వసంతరావు, వొద్నాల రాజు, గడ్డం ప్రశాంత్ రెడ్డి, చల్లోజు శ్రీనివాస్, పలువురు బి ఆర్ఎస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# కాంగ్రెస్ ప్రభుత్వంతోనే బీసీలకు న్యాయం

- అటవీ, పర్యావరణ, దేవాదాయ, ధర్మాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ

- పార్లమెంటులో బీసీ బిల్లు ప్రవేశపెట్టాలనే డిమాండ్ తో హలోబీసీ..చలో ఢిల్లీ

- ఢిల్లీ బయలుదేరే ముందు మంత్రి కొండా సురేఖను మర్యాదపూర్వకంగా కలిసిన వేముల మహేందర్ గౌడ్

**సమయజ్యోతిమొగుళ్ళ పల్లి:**

కాంగ్రెస్ ప్రభుత్వంతోనే బీసీలకు అన్ని రకాలుగా న్యాయం జరుగుతుందని అటవీ, పర్యావరణ, దేవాదాయ, ధర్మాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ అన్నారు. బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనన్న పిలుపు మేరకు.. బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు బైరి రవికృష్ణ గౌడ్, ఉమ్మడి వరంగల్ జిల్లా అధ్యక్షుడు వడ్లకొండ వేణుగోపాల్ గౌడ్ ల నేతృత్వంలో చేపట్టిన హలో బీసీ..చలో ఢిల్లీ కార్యక్రమం సందర్భంగా ఢిల్లీ బయలుదేరే ముందు సోమవారం హన్మకొండలోని రాంనగర్ లో గల మంత్రి కొండా సురేఖ నివాసంలో బీసీ సంక్షేమ సంఘం జయశంకర్ భూపాలపల్లి జిల్లా అధ్యక్షుడు వేముల మహేందర్ గౌడ్ మర్యాదపూర్వకంగా కలిసి..పుష్పగుచ్చం అందించారు. ఈ సందర్భంగా మంత్రి కొండా సురేఖ మాట్లాడారు. కాంగ్రెస్ అగ్ర నేత రాహుల్ గాంధీ, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిలు ఎన్నికల ముందు బీసీలకు ఇచ్చిన హామీ మేరకు రాష్ట్రంలో విద్యా, ఉద్యోగ, స్థానిక సంస్థల కోటాలో 42 శాతం రిజర్వేషన్లను కల్పించేందుకు జనగణన చేపట్టి..శాసనసభలో బీసీ రిజర్వేషన్ల బిల్లును ప్రవేశపెట్టి ఆమోదింప చేశారన్నారు. ఆ బిల్లును కేంద్రానికి పంపించడం జరిగిందన్నారు. కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం వెంటనే ప్రస్తుతం జరుగుతున్న పార్లమెంట్ సమావేశాల్లో బీసీ రిజర్వేషన్ల బిల్లును ప్రవేశపెట్టి ఆమోదింపజేసి..బీసీ రిజర్వేషన్ల బిల్లుకు చట్టబద్ధత కల్పించాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వాన్ని ఆదర్శంగా తీసుకుని జనగణనలో కులగణన చేపట్టాలని కేంద్ర ప్రభుత్వాన్ని మంత్రి డిమాండ్ చేశారు.



# కొల్లూరులో ఎన్ఎస్ఎస్ ప్రత్యేక శిబిరం

**సమయజ్యోతి ఆలేరు మార్చి 31**

యాదాద్రి భువనగిరి జిల్లా ఆలేరు ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులు జాతీయ సేవా పథకం ఎన్ఎస్ఎస్ స్పెషల్ క్యాంపు మండలంలోని కొల్లూరు గ్రామంలో మార్చి 31 నుండి ఏప్రిల్ 6 వరకు ప్రత్యేక శిబిరం కళాశాల ప్రిన్సిపల్ రాజారం ఏర్పాటు చేశారు. ఎన్ఎస్-ఎస్ ప్రోగ్రాం అధికారి డాక్టర్ ముత్యాలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు




# శ్రీ బాపూజీ రజక సహకార సంఘం నూతన అధ్యక్షుడిగా బాలమల్లేష్

**సమయజ్యోతి ఆలేరు మార్చి 31**

యాదాద్రి భువనగిరి జిల్లా ఆలేరు మండలం కొలనుపాక గ్రామానికి చెందిన శ్రీ బాబూజీ రజక సహకార సంఘం నూతన అధ్యక్షులుగా మామిడాల బాల మల్లేష్, ఉప అధ్యక్షులు గా మామిడాల బాబు, మామిడాల గణేష్ ప్రధాన కార్యదర్శి గా మామిడాల శంకర్ కోశాధికారిగా మామిడాల భానుచందర్ సహాయ కార్యదర్శి గా జీడిగారి నాగరాజు కులం పేద్ద మనుషులు గా మామిడాల మైసయ్య బండి బాలరాజు గౌరవ సలహాదారూలు మామిడాల సోమయ్య,మామిడాల నర్సింహులు, మామిడాల కిష్టయ్య,అంజయ్య డైరెక్టర్లు గా నిమ్మల రాజయ్య మామిడాల భిక్షపతి, దర్బాయి మైసయ్య,మామిడాల సాగర్, సంధుల యాదగిరి లచ్చు గారి భాస్కర్ ,అబ్బుగారి శంకర్ ,అమ్మగారి నర్సయ్య, బండి శంకర్ కలకోటి నర్సింలు ఏదునూరి భాస్కర్ ఎర్ర గణేష్ ,గజం సాయిలు రేణికుంటా అంజయ్య,జీడిగారి నాగరాజు లను ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగింది. ఈ కార్యక్రమంలో సంగం నాయకులు తదితరులు పాల్గొన్నారు



# ఈద్గా ప్రత్యేక ప్రార్థనలో పాల్గొన్న ప్రభుత్వ విప్ ఐలయ్య

**సమయజ్యోతి ఆలేరు మార్చి 31**

యాదాద్రి భువనగిరి జిల్లా ఆలేరు పట్టణ కేంద్రంలో రంజాన్ పండుగను పురస్కరించుకొని ఆలేరు శాసనసభ్యులు ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య ఈద్గా వద్ద ప్రత్యేక ప్రార్థనలు సోమవారం చేపట్టారు ఈ సందర్భంగా ముస్లిం సోదరులకు రంజాన్ పండుగ శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో టిపిసిసి రాష్ట్ర కార్యదర్శి జనగం ఉపేందర్ రెడ్డి, పార్టీ టౌన్ అధ్యక్షుడు ఎంఎ ఎజాస్, మాజీ ఎంపీటీసీ జైనుద్దీన్, రఫి, గౌస్, పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు



# లక్ష్మాపూర్ గ్రామం లో బండలాగుడు పోటీలు మాజీ ఎంపీపీ సూర్య ప్రతాప్ గౌడ్

**పెద్దకొత్తపల్లి,మార్చ్ 31,సమయజ్యోతి**

కీర్తిశేషులు అరిగెల లక్ష్మణ్ జ్ఞాపకార్థంగా ఉగాది పండుగ సందర్భంగా లక్ష్మాపూర్ గ్రామం పెద్దకొత్తపల్లి మండలంలో బండలాగుడు పోటీలు నిర్వహించడం జరిగింది కార్యక్రమానికి పెద్దకొత్తపల్లి మండలం మాజీ ఎంపీపీ సూర్య ప్రతాప్ గౌడ్ 20వేల ఆర్థిక బండలాగుడు పోటీలు నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమానికి తమరు ముఖ్యఅతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ లక్ష్మాపూర్ గ్రామంలో క్రీస్తు శేషులు లక్ష్మణ్ జ్ఞాపకార్థం వారి యొక్క బ్రదర్ రాము అధ్వర్యంలో పోటీలు నిర్వహించడం జరిగింది. రాము ఆహ్వానం మేరకు మాజీ ఎంపీపీ సూర్య ప్రతాప్ గౌడ్ ఆర్థిక సహాయంతో పోటీలు నిర్వహించడం ఈటీ పోటీల్లో ముఖ్య అతిథిగా పెద్దకొత్తపల్లి మండలం నాయకులు మాజీ గ్రంథాలయ చైర్మన్ నాగపురి విష్ణు .పెద్ద కార్పాముల మాజీ సర్పంచ్ పరుమాల శ్రీనివాస్ రెడ్డి . బీరం సుదర్శన్ రెడ్డి. మాజీ ఎంపిటిసి ముచ్చు గోవిందు. విండో చైర్మన్ . మరియు మైసమ్మ చైర్మన్ శ్రీనివాస్ యాదవ్ దేవుని తిరుమలాపూర్ మాజీ సర్పంచ్ సత్యం గంటరావుపల్లి మాజీ సర్పంచ్ పగడాల చిన్నయ్య వచ్చి ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేసినందున లక్ష్మాపూర్ గ్రామ ప్రజలు యువకుల తరఫున ధన్యవాదాలు తెలియజేయడం జరిగింది మొదటి బహుమతి 12 వేల రూపాయలు రెండవ బహుమతి పదివేల రూపాయలు మూడవ బహుమతి 8000 రూపాయలు నాలుగవ బహుమతి 6000 ఐదవ బహుమతి 4000 రూపాయలు ఇవ్వడం జరిగింది.



# అమ్మ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో వృద్ధాశ్రమంలో ఘనంగా ఉగాది వేడుకలు

**కరీంనగర్ సమయజ్యోతి**

కరీంనగర్ పట్టణంలోని అమ్మ స్వచ్ఛంద సంస్థ అధ్యక్షురాలు , బీజేపి మహిళ మోర్చ రాష్ట్ర నాయకురాలు శ్రీమతి డాక్టర్ పి సుజాత రెడ్డి ఆధ్వర్యంలో వీరబ్రాహంద్ర స్వామి అనాథ వృద్ధుల ఆశ్రమం లో శ్రీ విశ్వ వసునమ నూతన సంవత్సరం ఉగాది పండుగ సందర్భంగా వృద్ధులతో పండుగ ను ఘనంగా నిర్వహించారు. ఉగాది పచ్చడి మరియు భక్షాలను వారికీ అందించి వారితో పండుగను జరుపుకున్నారు. ఈ సందర్భంగా బీజేపీ సీనియర్ నాయకులు తాళ్ల పెల్లి హరీకుమార్ గౌడ్ మాట్లాడుతు ఎన్నో సంవత్సరాల నుండి శ్రీమతి సుజాత రెడ్డి ప్రతి తెలుగు పండుగ ను ఇక్కడ జరుపుకోవడం నిజంగా వారి మంచి మనస్సుకు కృతజ్ఞతలు తెలుపుతున్నాను. ఈ కార్యక్రమం లో పాల్గొన్న కరీంనగర్ ఏసీపీ గంగాధర్ వృద్ధులకు అన్న ప్రసాద వితరణ చేశారు. ఈ కార్యక్రమ నిర్వాహకురాలు శ్రీమతి సుజాత రెడ్డి ఈ మాట్లాడుతూ అందరికి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియపరిచారు.ప్రతి పండుగను వీరి మధ్యలో జరుపుకోవడం ఆనందాన్ని ఇస్తుందని అన్నారు. ఈ కార్యక్రమం లో విష్ణు వర్ధన్ మార్కండేయు లు మహేష్ కొండూరి అనిల్ బీజేపీ జిల్లా కార్యవర్గ సభ్యులు శ్రీమతి విజయ శ్రీమతి వొగెటి సుహాసిని తులసి మరియు ఆశ్రమ నిర్వాహకులు వేణు మాధవ్ పాల్గొన్నారు ఈ సందర్భంగా వేణుమాధవ్ ని సుజాత రెడ్డి మరియు %బాజ్రూ% గంగాధర్ పిపిటిసి ఘనంగా సన్మానించారు



# నాగర్ కర్నూలు జిల్లాలో దారుణం

- దైవదర్శనానికి వచ్చిన వివాహితపై గ్యాంగ్ రేప్

-ఊరుకొండ పేట అంజన్న ఆలయం వద్ద ఘటన

- ఆలస్యంగా వెలుగులోకి

**నాగర్ కర్నూల్ మార్చ్ 31,సమయజ్యోతి**

నాగర్ కర్నూల్ జిల్లా దారుణం లో దారుణం చోటుచేసుకుంది దైవ దర్శనానికి వచ్చిన ఓ వివాహితపై గ్యాంగ్ రేప్ చేసిన ఘటన ఆదివారం తెల్లవారుజామున చోటు చేసుకోగా సోమవారం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. వివరాల్లోకి వెళ్తే.. ఉమ్మడి పాలమూరు జిల్లా భూత్పూర్ మండలం పరిధిలోని ఓ గ్రామానికి చెందిన వివాహిత(30) మహిళ శనివారం రాత్రి అంజన్న దర్శనం కోసం ఊరుకొండ పేట ఆంజనేయస్వామి ఆలయానికి కుటుంబ సభ్యులతో కలిసి వచ్చింది. దర్శనం అనంతరం నిద్రకు ఉపక్రమించారు. అనంతరం బహిర్భూమికి వెళ్లినట్లు మాటు వేసి గుర్తించిన యువకులు పక్కనే ఉన్న గుట్ట పైకి ఈడ్చుకెళ్ళి సామూహిక అత్యాచారానికి ఒడిగట్టారు. ఎంతకీ తిరిగి రాకపోవడంతో కుటుంబ సభ్యులు అనుమానించి వెతుకుతుండడంతో వారిని గ్రహించిన యువకులు చేతులు కాళ్లను తాళ్లతో కట్టేసి పరారయ్యారు. అఘాయిత్యానికి పాల్పడ్డ వారిలో ఆలయ ఉద్యోగితో పాటు బంగారు ఆంజనేయులు, మట్ట ఆంజనేయులు, బాబా, కౌకుంట్ల అరిష్, మహేష్, వాగుల్దార్ మణికంఠలు ఉన్నట్లు పోలీసులు గుర్తించారు. బాధితురాలికి వైద్య పరీక్షల నిమిత్తం తరలించినట్లు సమాచారం.



# ఆంధ్రప్రదేశ్ ఐకానిక్ క్యాపిటల్‌గా విశాఖ

## పెట్టుబడులతో మారనున్న రూపురేఖలు - ప్రజాదర్బార్‌లో అర్జీలు స్వీకరించిన లోకేశ్

**విశాఖపట్టణం,మార్చి31(సమయజ్యోతి):**

విశాఖను ఆంధ్రప్రదేశ్ ఐకానిక్ క్యాపిటల్ గా మార్చుతామని, విశాఖ రీజియన్ పెట్టుబడులకు కేంద్రంగా మారుతోందని మంత్రి నారా లోకేష్ అన్నారు.. ఆర్థికవృద్ధిలో విశాఖను దేశంలోనే ఐదవ స్థానంలో నిలపాలనేది లక్ష్యంగా పెట్టుకున్నామన్న ఆయన.. విశాఖను ఒక బ్రాండ్ గా మార్చుతాం.. విశాఖలో 2029లోపు 5 లక్షల ఐటీ- ఉద్యోగాలను కల్పిస్తామని స్పష్టం చేశారు.. అనకాపల్లి జిల్లా పర్యటన కోసం.. విశాఖకు వచ్చిన ఆయన.. పార్టీ కార్యాలయంలో ప్రజల నుంచి విజ్ఞప్తులు స్వీకరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. రాజకీయంగా విశాఖ ఎప్పుడూ మమ్మల్ని ఆదరిస్తూనే వుంది... 2019లో రాష్ట్రం అంతా ఒక విధమైన ఫలితం వస్తే.. ఇక్కడ టీడీపీ గెలిచింది.. 2024 ఎన్నికల మెజారిటీలో నాదే రికార్డు అనుకున్నా.. గాజువాక, భీమిలిలో నాకంటే ఎక్కువ మెజారిటీలు రావడం ఇక్కడ ప్రజల ఆదరణకు నిదర్శనంగా అభివర్ణించారు.. విశాఖలో అర్సెలర్ మిట్టల్ స్టీల్ ప్లాంట్ ప్రారంభం కానుంది.. హైడ్రో పవర్ గేమ్ చేంజర్ కానుంది అన్నారు మంత్రి లోకేష్.. గతంలో వెళ్ళిపోయిన లులూ గ్రూప్ మళ్ళీ ల్యాండ్ మార్క్ కన్వెన్షన్ హాల్ నిర్మాణానికి సిద్ధం అవుతోందని వెల్లడించారు.. భోగాపురం ఎయిర్ పోర్ట్‌తో విశాఖ రూపు రేఖలు మారి పోను న్నాయి.. అంతర్జాతీయ సదుపాయాలతో మరిన్ని స్టేడియాలను నిర్మాణం చేస్తాం అన్నారు.. మూడేళ్లలో అమరావతి నిర్మాణం పూర్తయ్యేలోపు ప్రపంచ శ్రేణి మౌలిక సదుపాయాలతో విశాఖ కూడా అంతర్జాతీయ నగరంగా మారుతుందని మంత్రి నారా లోకేష్ వెల్లడించారు..లోకేశ్ తన రెండో రోజు పర్యటనలో సోమవారం ఉదయం విశాఖ తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో 60వ రోజు ప్రజాదర్బార్ నిర్వహించారు. వివిధ సమస్యలతో బాధపడుతున్న సామాన్య ప్రజానీకం నుంచి మంత్రి నారా లోకేష్ అర్జీలు స్వీకరించారు. కూటమి ప్రభుత్వం అందరికీ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. సుప్రీం కోర్టు ఆదేశాల ప్రకారం ఇతర రాష్ట్రాల మాదిరిగా రెగ్యులరైజేషన్ కాకుండా ప్రత్యేక ఉపాధ్యాయుల నియామకాలను కేవలం డైరెక్ట్ రిక్రూట్ మెంట్ (డీఎస్సీ నోటిఫికేషన్) పద్ధతిలో మాత్రమే భర్తీ చేయాలని ఆంధ్రప్రదేశ్ నిరుద్యోగ ప్రత్యేక ఉపాధ్యాయ సమాఖ్య ప్రతినిధులు మంత్రి నారా లోకేష్‌ను కలిసి విజ్ఞప్తి చేశారు. సమైక్యాంధ్ర ఉద్యమ సమయంలో ఏపీఎస్ఆర్టీసీ నర్సీపట్నం డిపోలో కాంట్రాక్ట్ కార్మికుడిగా పనిచేస్తూ తన భర్త మరణించాడని, కాంట్రాక్ట్ కార్మికుల కుటు-ంబాలకు బ్రెడ్ విన్నర్ స్కీమ్ వర్తింపజేస్తామని 2013లో యూనియన్‌తో జరిగిన అగ్రిమెంట్ అమలు చేయకపోవడంతో తమ కుటు-ంబం రోడ్డున పడిందని విశాఖకు చెందిన కె.రమాదేవి మంత్రి నారా లోకేష్‌ను కలిసి ఆవేదన వ్యక్తం చేశారు.



బ్రెడ్ విన్నర్ స్కీమ్‌ను అమలుచేసి తమకు న్యాయం జరిగేలా చూడాలని విన్నవించారు. విశాఖ పెందుర్తి నియోజకవర్గం వేపగుంట జెడ్ పీహెచ్ స్కూల్ వెనుక ఉన్న ప్రభుత్వ స్థలాన్ని గత వైసీపీ ప్రభుత్వ అండతో కబ్జా చేసి భవనాలు నిర్మించారని, సదరు స్థలాన్ని కబ్జాదారుల నుంచి కాపాడాలని విశాఖకు చెందిన రేపర్తి రాజు విజ్ఞప్తి చేశారు. అధికారులకు పలుమార్లు ఫిర్యాదు చేసినప్పటికీ ఫలితం లేదని వాపోయారు. ఇంజనీరింగ్ చదివిన తనకు ఉద్యోగ అవకాశం కల్పించాలని విశాఖపట్నానికి చెందిన కె.సౌజన్య విజ్ఞప్తి చేశారు. ఆయా అర్జీలను పరిశీలించి త్వరితగతిన పరిష్కారానికి కృషిచేస్తామని మంత్రి లోకేష్ హామీ ఇచ్చారు. నగరంలోని పార్టీ కార్యాలయంలో ఉదయం 9.30 గంటలకు బయలుదేరి బీచ్‌రోడ్డులోని హోటల్ నోవాటెల్ విస్తరణ పనులకు శంకు స్థాపన చేశారు.

# హైదరాబాద్ కంటే గొప్పగా విశాఖ : మంత్రి లోకేశ్‌కుమార్

**తిరుపతి,మార్చి31(సమయజ్యోతి):**

త్వరలోనే ఎవరూ ఊహించని విధంగా విశాఖను అన్ని రంగాల్లో హైదరాబాద్ కంటే ముందు ఉంచుతానని మంత్రి నారా లోకేష్ అన్నారు. విశాఖలో పర్యటినస్తున్న మంత్రి ఆర్కే బీచ్ వద్ద వరుణ్ గ్రూప్ నిర్వహిస్తున్న వరుణ్ బే సౌండ్స్ హోటల్‌కు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా లోకేష్ మాట్లాడుతూ... వరుణ్ బే సాండ్స్ హోటల్ విశాఖకు ఐకానిక్ గా మారనుందన్నారు. విశాఖ పరిశ్రమలు, ఐటీ హబ్‌గా మార్చుతున్నా మన్నారు. గడిచిన 10 నెలల్లో విశాఖకు చాలా ప్రాజెక్టులు తీసుకువచ్చామని.. రానున్న 5 సంవత్సరాల్లో విశాఖలో 5 లక్షల ఐటీ ఉద్యోగాలు కల్పిస్తామన్నారు. విశాఖను ఆంధప్రదేశ్ ఐకానిక్ క్యాపిటల్‌గా మార్చుతామని చెప్పారు. గడిచిన 10 నెలల్లోనే విశాఖకు టీసీఎస్, మెటల్ ప్లాంట్, హైడ్రోజన్ ప్లాంట్ వంటి సమస్యను తీసుకువచ్చి ఉపాధి అవకాశాలు కల్పించడమే ప్రభుత్వ లక్ష్యంగా తీసుకున్నామని చెప్పారు. 'మన ముఖ్యమంత్రి ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ కాదు.. స్పీడ్ అఫ్ డూయింగ్ బిజినెస్ చేయమంటున్నారు' అని అన్నారు. ఉత్తరాంధ్రలోనే ట్రిలియన్ డాలర్ ఎకానమీని తీసుకొస్తామని గర్వంగా చెప్తున్నామని తెలిపారు. జగన్ ప్రభుత్వానికి థాంక్స్ చెప్పాలని... 9 నెంబర్లలో లార్జెస్ట్ ఎకనామికల్ సిటీగా ఉన్న విశాఖను పదోవ స్థానానికి దించారని విమర్శలు గుప్పించారు. ఎంపీ భరత్, విశాఖ శాసనసభ్యులు దృష్టి సారించి విశాఖను 5వ లార్జెస్ట్ ఎకనామికల్ సిటీగా నిలబెడతారన్నారు. ఆంధ్రప్రదేశ్‌లో విశాఖ ఐటీ డెస్టినేషన్‌గా మారు తుందన్నారు. విశాఖను దేశంలోనే ఐదవ ఎకనామిక్ క్యాపిటల్‌గా మార్చే విధంగా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. విశాఖను అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తామని.. విశాఖను ఒక బ్రాండ్‌గా మార్చుతామని చెప్పుకొచ్చారు. ఎన్నికల ఫలితాల్లో తనకు రాష్ట్రంలో అత్యధిక మెజార్టీల స్థానాల్లో మూడవ స్థానం వచ్చినందుకు కొంచెం బాధనిపించిందని.. కానీ మొదటి రెండు అత్యధిక మెజారిటీ స్థానాలు విశాఖకు వచ్చాయన్నారు. దీన్ని బట్టి విశాఖ ప్రజలు తమపై ఎంతో నమ్మకాన్ని పెట్టుకున్నారని అర్థమైందన్నారు. విశాఖ అభివృద్ధి చేసి ఆ నమ్మకాన్ని నిలబెట్టుకుంటామని స్పష్టం చేశారు. వరుణ్ గ్రూప్ నిర్మాణం చేపడుతున్న వరుణ్ బే సాండ్స్ హోటల్ కేవలం ఆంధ్రప్రదేశ్‌కే కాదు... భారతదేశంలోనే ఒక ఐకానిక్ ప్లేస్‌గా మిగులు తుందన్నారు. చంద్రబాబు అధికారం లోకి వచ్చిన తర్వాత ఆంధ్రప్రదేశ్ అభివృద్ వైపు పరుగులు పెడుతోం దన్నారు. ఆంధ్రప్రదేశ్‌ను పారిశ్రామి కంగా, పర్యాటకంగా, ఐటీ పరంగా అభివృద్ధి చేసే బాధ్యతను ప్రభుత్వం తీసుకుంటుందన్నారు. గడిచిన ఐదేళ్లలో



ప్రజలం, పారిశ్రామికవేత్తలం, వ్యాపారస్తులు తీవ్రమైన ఇబ్బందులకు గురయ్యా రన్నారు. చంద్రబాబును విశాఖ పట్నం ఎయిర్‌పోర్టులోకి నగరంలోకి రాకుండా అడ్డగించా రన్నారు. విజయనగరం తీర్థాలు గుడికి వెళుతుంటే బుల్డోజర్లు, జేసీబీలు పెట్టి రాకుండా చేయాలని చేశారని మండిపడ్డారు. లులు గ్రూప్ కూడా త్వరలో విశాఖకు వస్తుందన్నారు. వచ్చే ఐదేళ్లలో ఐదు లక్షల ఐటీ ఉద్యోగాలు ఇవ్వడమే తమ ప్రభుత్వ లక్ష్యమని... ఇప్పటికే రోడ్ మ్యాప్ కూడా పూర్తయిందని వెల్లడించారు. విశాఖ అన్ని విధాల అభివృద్ధి చెందడానికి అనువైన ప్రాంతమన్నారు. హోటల్స్, కాన్సెర్ట్స్, క్రికెట్ మ్యాచ్లు జరిగే వైబ్రేంట్ సిటీ విశాఖపట్నం అని తెలిపారు.

# ఎపిలో 51 కరువు మండలాల ప్రకటన

## ఉత్తర్వులు జారీ చేసిన ప్రభుత్వం

**అమరావతి,మార్చి31(సమయజ్యోతి):**

వర్షాభావ పరిస్థితులను దృష్టిలో ఉంచుకున్న కూటమి ప్రభుత్వం కరువు మండలాలపై దృష్టి సారించింది. ఏపీలో కరువు మండలాలుగా 51 మండలాలను ప్రకటించారు. ఇందులో భాగంగానే కరువు మండలాలపై కీలక నిర్ణయం తీసుకుంది. ఈ మేరకు రెవెన్యూ శాఖ స్పెషల్ సీఎస్ ఆర్పీ సిసోడియా ఉత్తర్వులు జారీ చేశారు. 37 మండలాల్లో తీవ్రమైన కరువు ఉన్నట్లు ఉత్తర్వుల్లో వెల్లడించారు. 14 మండలాల్లో కరువు ప్రభావం ఉన్నట్లు పేర్కొన్నారు. ఈ మేరకు రబీ సీజన్ 2024-25 కరువు మండలాలను వెల్లడిస్తూ ఆర్పీ సిసోడియా ఉత్తర్వులు జారీ చేశారు. ఇటీవల రాష్ట్ర విపత్తుల నిర్వహణ కార్యాలయంలో నిర్వహించిన కరువు ప్రభావ కమిటీ సమావేశంలో జిల్లాల కలెక్టర్లు, సంబంధిత శాఖలు సమర్పించిన నివేదికలను కరువు ప్రభావ కమిటీ- నిశితంగా పరిశీలించింది. వివిధ జిల్లాల నుంచి వచ్చిన నివేదికలను తాము దృష్టిలో ఉంచుకుని, వర్షపాతం లోటు-, పంటల నష్టం, భూగర్భ జలాల స్థాయి, వ్యవసాయ స్థితిగతులను పరిగణనలోకి తీసుకుని ఈ నిర్ణయం తీసుకున్నామని సిసోడియా ప్రకటించారు.

# కొడాలి నానికి తీవ్ర గుండె సంబంధ వ్యాధి

## హుటాహుటిని ముంబై తరలింపు

**అమరావతి,మార్చి31(సమయజ్యోతి):**

మాజీ మంత్రి, వైసీపీ నేత కొడాలి నానిని మెరుగైన చికిత్స కోసం ముంబైకి తరలించారు. కొద్దిరోజుల క్రితం కొడాలి నాని తీవ్ర అనారోగ్యానికి గురైన విషయం తెలిసిందే. గత ఐదు రోజులుగా హైదరాబాద్‌లోని ఓ ప్రైవేటు- ఆస్పత్రిలో ఆయన చికిత్స పొందుతున్నారు. గుండెకు సంబంధించిన సమస్యతో మాజీ మంత్రి బాధపడుతున్నారు. ఈ క్రమంలో మెరుగైన వైద్యం కోసం కుటుంబసభ్యులు ఆయనను ప్రత్యేక విమానంలో ముంబైకు బయలుదేరి వెళ్లారు. మెరుగైన చికిత్స కోసం ముంబైకి తరలించినట్లు చెబుతున్నప్పటికీ గుండె సంబంధిత వ్యాధితో పాటు ఇతర ఆరోగ్య సమస్యలు కూడా ఉన్నట్లు సమాచారం. హైదరాబాద్‌లోని ఎఐజి ఆస్పత్రిలో జీర్ణకోస సంబంధిత వ్యాధితో నాని చేరారు. అయితే ఆయనకు గుండె సంబంధిత వ్యాధి ఉన్నట్లు వైద్యులు నిర్ధారించారు. గుండెకు సంబంధించి మూడు వాల్వ్ పూడుకుపోయినట్లు తెలుస్తోంది. మాజీ సీఎం జగన్.. హైదరాబాద్‌లోని ఆస్పత్రి వైద్యులతో మాట్లాడిన సమయంలో ఈ విషయాన్ని తెలియజేశారు. దీనిపై హైదరాబాద్‌లోని ఆస్పత్రిలో ప్రయత్నాలు చేసినప్పటికీ సఫలీకృతం కాకపోవడంతో ఆయనను వెంటనే ఎయిర్ అంబులెన్స్‌లో ముగ్గురు డాక్టర్ల పర్యవేక్షణలో హైదరాబాద్ నుంచి ముంబైకి తరలించారు. చాలా యాక్టివ్‌గా ఉన్న నాని.. ఆ తరువాత జీర్ణకోస సంబంధిత వ్యాధి ఉందంటూ హైదరాబాద్‌లోని ఆస్పత్రిలో చేరారు. అయితే కొడాలి నానిని పూర్తిగా పరీక్షించిన వైద్యులు.. ఆయన గుండె సంబంధిత వ్యాధితో బాధపడుతు న్నట్లు గుర్తించారు. వెంటనే సర్జరీ చేయాలని భావించారు వైద్యులు. అయితే సర్జరీ క్రిటికల్‌గా మారడంతో మెరుగైన చికిత్స నిమిత్తం ముంబైకు తరలించాలని వైద్యులు సూచించారు. దీంతో ఆయనను ప్రత్యేక ఎయిర్ అంబులెన్స్‌లో సోమవారం ముంబైకు తరలించారు.

# యువత కోసం పవన్ తపన

## ఉత్తరాంధ్రకు పెట్టుబడులే లక్ష్యం

## మంత్రి నాదెండ్ల మనోహర్ వెల్లడి

**విశాఖపట్టణం,మార్చి31(సమయజ్యోతి):**

యువత కోసం డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ తపన పడుతున్నారని, ఉత్తరాంధ్రకు భారీ పెట్టుబడులు వస్తాయని మంత్రి నాదెండ్ల మనోహర్ తెలిపారు.. విశాఖపట్నంలో ఆయన మాట్లాడుతూ.. ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్‌కు ఉత్తరాంధ్ర యువతకు ఉపాధి కల్పించాలని తపన పడుతున్నతారు.. ఉత్తరాంధ్రకు భారీ స్థాయిలో పెట్టుబడులు వస్తాయనే నమ్మకాన్ని వ్యక్తం చేశారు.. దీపం పథకం -2, లో భాగంగా 99 లక్షల మంది లబ్ధిదారులకు ఉచిత గ్యాస్ అందించాము. గతంలో ఎప్పుడు లేని విధంగా ధాన్యం కొనుగోలు చేసి 24 గంటలలో రైతులకు డబ్బులు అందించాం.. మారుమూల గ్రామాలకు రోడ్డు సౌకర్యం కల్పిస్తున్నాం.. పవన్ కల్యాణ్ గిరిజన గ్రామాలలో పర్యటించి రోడ్లకు శంకుస్థాపన చేసిన విషయాన్ని గుర్తు చేశారు. ఇక, జనసేన పార్టీ ఎమ్మెల్యేలు ఉన్న నియోజకవర్గాలలో అభివృద్ధి, సంక్షేమం అందించదనికి ప్రణాళిక తయారుచేసుకున్నాం అన్నారు నాదెండ్ల మనోహర్.. పిఠాపురంలో జనసేన ఆవిర్భావ సభ విజయవంతం అయ్యిందన్న ఆయన.. సభ విజయవంతం చేయడానికి కృషి చేసిన ప్రతి ఒక్కరికి పేరు పేరునా ధన్యవాదాలు తెలిపారు.. అన్ని స్థాయిలలో కమిటీలు ఏర్పాటు-కు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నాం.. టీడీపీ, బీజేపీతో కలసి ప్రజలు కోసం అంకితభావంతో జనసేన నాయకులు పనిచేయాలని సూచించారు.. గత ప్రభుత్వంలో విశాఖపట్నరంలో లాండ్ అడర్ సమస్య సృష్టించారు. ఋషికొండలో ప్రజాధనంతో ప్యాలస్ నిర్మించారు. విశాఖలో భూకబ్జాలకు పాల్పడ్డారు, పర్యావరణం విధ్వసం చేశారని మంత్రి నాదెండ్ల మనోహర్ మండిపడ్డారు.. కానీ లభివృద్ధి లక్ష్యంగా కూటమి ప్రభుత్వం పనిచేస్తోందన్నారు.

# తిరుపతిలో వైభవంగా బ్రహ్మోత్సవాలు

**తిరుపతి,మార్చి31(సమయజ్యోతి):**

తిరుపతి శ్రీ కోదండరామస్వామి వార్షిక బ్రహ్మోత్సవాలు భాగంగా ఐదో రోజు సోమవారం శ్రీరామచంద్రుడు మోహినీ అవతారంలో పల్లకీలో ఊరేగుతూ భక్తులకు దర్శనం ఇచ్చాడు. ఈ సందర్భంగా ఆలయ నాలుగు మాడ వీధుల్లో జరిగిన ఉత్సవంలో భక్తులు అడుగడుగునా కర్పూరహారతులు సమర్పించి స్వామివారిని దర్శించుకున్నారు ఈ సందర్భంగా అర్చకులు మాట్లాడుతూ సురాసురులు అమృతం కోసం క్షీరసాగరాన్ని మథిస్తారని, చివరికి వారు కోరుకున్న అమృతం లభిస్తుందని, దానిని పంచుకోవడంలో కలహంలో అసురులను వంచించి, సురులకు అమృతాన్ని పంచడానికి శ్రీహరి మోహినీ రూపంతో సాక్షాత్కరించాడని అన్నారు. తనకు భక్తులు కానివారు ఆ మాయాధీనులు కాక తప్పదనీ, తనకు ప్రసన్నులైనవారు మాయను సులభంగా దాటగలరనీ మోహినీ రూపం తెలియజేస్తుందన్నారు. అనంతరం ఆలయంలో స్నపన తిరుమంజనం వేడుకగా జరిగింది. రాత్రి 7 నుంచి 10 గంటల వరకు గరుడసేవ నిర్వహించనున్నారు. తిరుమలలో భక్తుల రద్దీ కొనసాగుతుంది. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు స్వామివారి దర్శనానికి 31 కంపార్టుమెంట్లలో వేచియున్నారు. టోకెన్లు లేని భక్తులకు 18 గంటల్లో సర్వదర్శనం అవుతుందని ఆలయ అధికారులు వివరించారు. నిన్న స్వామివారిని 62,263 మంది భక్తులు దర్శించుకోగా 25,733 మంది తలనీలాలు సమర్పించుకున్నారు. భక్తులు సమర్పించుకున్న కానుకల ద్వారా హుండీకి రూ. 3.65 కోట్లు ఆదాయం వచ్చిందని వెల్లడించారు.



# వడ్డీ వ్యాపారి వేధింపులు తాళలేక

## పట్టాలుమీద పడుకొని మహిళ ఆత్మహత్యాయత్నం

**తిరుపతి,మార్చి31(సమయజ్యోతి):**

ఓ వడ్డీ వ్యాపారి వేధింపులు తాళలేక ఓ మహిళ రైలు పట్టాలుమీద పడుకొని ఆత్మహత్య యత్నానికి పాల్పడిన సంఘటన సోమవారం చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. చిత్తూరు జిల్లా కేంద్రంలోని కన్నయ్యనాయుడు కాలనీకి చెందిన ప్రియకు ముగ్గురు పిల్లలు. భర్త కూలీ పనులు చేస్తుంటే.. ప్రియ నాలుగు ఇళ్లలో పనిచేస్తూ జీవనం సాగిస్తున్నారు. ఈ క్రమంలో పిల్లాడి స్కూల్ ఫీజు కట్టేందుకు రెండు నెలల కింద రాజా అనే వ్యక్తి నుంచి రూ.10వేలు అప్పుగా తీసుకున్నారు. ఇందుకు గానూ ప్రతివారం రూ.3వేల చొప్పున రెండు నెలలు చెల్లించారు. అయినప్పటికీ ఇంకా డబ్బులు కట్టాలని రాజా వేధించాడు. ఇప్పటివరకు కట్టిన మొత్తాన్ని వడ్డీ కింద జమ చేసుకున్నానని.. అసలు రూ10వేలు ఇచ్చి తీరాల్సిందేనని ప్రియను రాజా బెదిరించాడు. డబ్బులు చెల్లించాలని ప్రియకు ఫోన్ చేసి అసభ్యంగా తిడుతూ వేధించాడు. దీంతో అవమానం భరించలేక ఆదివారం మధ్యాహ్నం నాడు ఆత్మహత్య చేసుకోవాలని అనుకుంది. మెసానిక్ మైదానం సమీపంలోని రైల్వే పట్టాలపై పడుకుంది. అయితే మరో 15 నిమిషాల్లో రైలు వస్తుందనగా.. ప్రియను గుర్తించిన జ్ఞానరాజ్ అనే వ్యక్తి పోలీసులకు సమాచారం అందించాడు. హుటాహుటిన ఘటనాస్థలికి చేరుకున్న పోలీసులు ప్రియను బలవంతంగా పట్టాలపై నుంచి పక్కకు లాక్కెళ్లారు. అనంతరం ఆమె ఎందుకు ఆత్మహత్య చేసుకోవాలని అనుకుందో కారణాన్ని తెలుసుకున్నారు. ప్రియను వేధించిన రాజాపై కేసు నమోదు చేసుకున్న పోలీసులు అతని కోసం గాలింపు చేపట్టారు.



# మాజీ మంత్రి కాకాణికి మరోసారి నోటీసులు

**తిరుపతి,మార్చి31(సమయజ్యోతి):**

పొదలకూరు మండలంలో జరిగిన అక్రమ మైనింగ్ కేసులో సోమవారం విచారణకు మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్ రెడ్డి డుమ్మా కొట్టారు. గోవర్ధన్ రెడ్డికి పోలీసులు మరోసారి నోటీసులు ఇచ్చారు. దీంతో మరోసారి నోటీసులు ఇచ్చిన పోలీసులు.. మంగళవారం విచారణకు రావాలని ఆదేశించారు. నోటీసులు ఇచ్చేందుకు హైదరాబాద్‌లోని కాకాణి ఇంటికి వెళ్లారు పోలీసులు. అయితే మాజీ మంత్రి అందుబాటులో లేకపోవడంతో బంధువులకు నోటీసులు ఇచ్చారు. రేపు ఉదయం 11 గంటలకు విచారణకు హాజరుకావాలని.. లేకపోతే చట్టపరంగా చర్యలు ఉంటాయని పోలీసు అధికారులు హెచ్చరించారు.

# రియాన్ పరాగ్‌కు ఫైన్

## స్లో ఓవర్ రేట్ కారణంగా జరిమానా

రాజస్థాన్ రాయల్స్ కెప్టెన్ రియాన్ పరాగ్‌కు స్లో ఓవర్ రేట్ కారణంగా జరిమానా విధించారు. ఐపీఎల్ 2025లో స్లో ఓవర్ రేట్ కారణంగా శిక్షకు గురైన రెండో కెప్టెన్ రియాన్ పరాగ్. అతని కంటే ముందు ముంబై ఇండియన్స్ కెప్టెన్ హార్దిక్ పాండ్యా కూడా ఇదే కారణంతో జరిమానా ఎదుర్కొన్నాడు. చెన్నైతో జరిగిన మ్యాచ్‌లో రాజస్థాన్ 6 పరుగుల తేడాతో విజయం సాధించిన తర్వాత, ఆ జట్టు కెప్టెన్ రియాన్ పరాగ్‌కు రూ. 12 లక్షల జరిమానా విధించారు. స్లో ఓవర్ రేట్ కారణంగా ఐపీఎల్ జట్ల కెప్టెన్‌లు చెల్లించాల్సిన మొత్తం ఇది. ఐపీఎల్ విడుదల చేసిన పత్రికా ప్రకటనలో, స్లో ఓవర్ రేట్‌కు సంబంధించి రియాన్ పరాగ్ జట్టు చేసిన మొదటి తప్పు ఇది కాబట్టి, ఐపీఎల్ కోడ్ ఆఫ్ కండక్ట్ సెక్షన్ 2.22 ప్రకారం అతనికి రూ. 12 లక్షల జరిమానా విధించామని పేర్కొంది. రియాన్ పరాగ్ కంటే ముందు, ముంబై ఇండియన్స్ కెప్టెన్ హార్దిక్ పాండ్యా కూడా ఐపీఎల్ 2025లో గుజరాత్ టైటాన్స్‌తో జరిగిన మ్యాచ్‌లో స్లో ఓవర్ రేట్ కారణంగా జరిమానా ఎదుర్కొన్నాడు. ఆ మ్యాచ్‌లో అతను ఒక మ్యాచ్ నిషేధం తర్వాత తిరిగి వచ్చాడు. ఆ నిషేధం కూడా స్లో ఓవర్ రేట్ కారణంగానే విధించబడింది. వాస్తవానికి, ఒక సీజన్‌లో ఒక కెప్టెన్ మూడుసార్లు స్లో ఓవర్ రేట్‌కు పాల్పడితే, అతనికి ఒక మ్యాచ్ నిషేధం విధిస్తారు. రియాన్ పరాగ్ విషయానికొస్తే, చెన్నై సూపర్ కింగ్స్‌తో జరిగిన మ్యాచ్‌లో అతని కెప్టెన్సీ, బ్యాటింగ్ రెండూ అద్భుతంగా సాగాయి. ధోని కోసం అతను స్పిన్నర్ల ఓవర్లను ఆదా చేసిన విధానం, కెప్టెన్‌గా అతని ఆ నిర్ణయానికి మంచి ప్రశంసలు లభించాయి. అలాగే బ్యాటింగ్‌లో అతను 28 బంతుల్లో 37 పరుగుల అద్భుతమైన ఇన్నింగ్స్ ఆడాడు. మ్యాచ్‌లో తొలుత బ్యాటింగ్ చేసిన రాజస్థాన్ 20 ఓవర్లలో 9 వికెట్ల నష్టానికి 182 పరుగులు చేసింది. అనంతరం లక్ష్య ఛేదనకు దిగిన చెన్నై సూపర్ కింగ్స్ 6 పరుగుల దూరంలో ఆగిపోయింది. 20 ఓవర్లలో 6 వికెట్ల నష్టానికి 176 పరుగులు మాత్రమే చేయగలిగింది. చివరి ఓవర్‌లో చెన్నై విజయానికి 19 పరుగులు అవసరం కాగా, ఫాస్ట్ బౌలర్ సందీప్ శర్మ దానిని సమర్థవంతంగా అడ్డుకొని తన జట్టుకు విజయాన్ని అందించాడు.



## రియాన్ పరాగ్ నిర్ణయాలతో సత్ఫలితాలు

మాజీ చాంపియన్స్ రాజస్థాన్ రాయల్స్ ఈ సీజన్ లో బోణీ కొట్టిన సంగతి తెలిసిందే. చెన్నై సూపర్ కింగ్స్ తో ఆదివారం జరిగిన మ్యాచ్ లో ఆరు పరుగుల తేడాతో ఉత్కంఠభరిత విజయం సాధించింది. ఇక కీలక సమయాల్లో కెప్టెన్ రియాన్ పరాగ్ తీసుకున్న కొన్ని నిర్ణయాలు సత్ఫలితాలనిచ్చాయి. ముఖ్యంగా ఆఖరి ఓవర్ ను సందీప్ శర్మకు ఇవ్వడం కూడా సానుకూలంగా మారింది. అప్పటికే ఫైర్ మీదున్న జోఫ్రా ఆర్చర్ ను కాదని సందీప్ కు బంతినిచ్చి ఒక రకంగా గ్యాంబుల్ చేశాడు. అయితే ఆ ఓవర్లో విజయానికి 20 పరుగులు అవసరం కావల్సి ఉండగా, చెన్నై కేవలం 13 పరుగులు మాత్రమే సాధించడంతో పరాజయం పాలైంది. మ్యాచ్ ముగిసిన తర్వాత దీనిపై పరాగ్ స్పందించాడు. జట్టులోని ఆ అనుకూలత వల్లే తాను కీలక సమయాల్లో విభిన్న నిర్ణయాలు తీసుకునేందుకు ఉపకరించిందని పేర్కొన్నాడు. మాజీ చాంపియన్స్ రాజస్థాన్ రాయల్స్ ఈ సీజన్ లో బోణీ కొట్టిన సంగతి తెలిసిందే. చెన్నై సూపర్ కింగ్స్ తో ఆదివారం జరిగిన మ్యాచ్ లో ఆరు పరుగుల తేడాతో ఉత్కంఠభరిత విజయం సాధించింది. ఇక కీలక సమయాల్లో కెప్టెన్ రియాన్ పరాగ్ తీసుకున్న కొన్ని నిర్ణయాలు సత్ఫలితాలనిచ్చాయి. ముఖ్యంగా ఆఖరి ఓవర్ ను సందీప్ శర్మకు ఇవ్వడం కూడా సానుకూలంగా మారింది. అప్పటికే ఫైర్ మీదున్న జోఫ్రా ఆర్చర్ ను కాదని సందీప్ కు బంతినిచ్చి ఒక రకంగా గ్యాంబుల్ చేశాడు.

## ధోనీ నిలకడలా ఆడలేకపోతున్నాడు

### ధోనీపై పరోక్ష వ్యాఖ్యలు చేసిన భజ్జీ!

ఐపీఎల్ 2025 సీజన్ లో భాగంగా రాజస్థాన్ రాయల్స్ పై చెన్నై సూపర్ కింగ్స్ 9 పరుగుల తేడాతో ఓడిపోయింది. రాజస్థాన్ విధించిన 183 పరుగుల లక్ష్య ఛేదనకు దిగిన చెన్నై 176 రన్స్ కే పరిమితమైంది. సీఎస్కే స్టార్ బ్యాటర్ ఎంఎస్ ధోనీ ఏడో స్థానంలో బ్యాటింగ్ వచ్చి 11 బంతుల్లో 16 పరుగులు బాదాడు. అయినప్పటికీ జట్టును విజయపథంలో నడిపించలేకపోయాడు. ఈ క్రమంలో ధోనీ నిలకడ, స్థిరత్వంపై మాజీ క్రికెటర్ హర్భజన్ సింగ్ కీలక వ్యాఖ్యలు చేశాడు. "సీఎస్కే బ్యాటర్ ఎంఎస్ ధోనీని మనం నిందించలేము. చెన్నై బ్యాటర్లను కట్టడి చేసిన ఘనత రాజస్థాన్ రాయల్స్ బౌలర్లకే దక్కుతుంది. ధోని, జడేజా గతంలో ఇలాంటి పరిస్థితుల్లో మ్యాచ్ లను గెలిపించారు. కానీ ఈసారి అలా చేయలేకపోయారు. ఎంఎస్ ధోనీ గతంలోలాగా ఆడలేకపోతున్నాడు. అతడి స్థిరత్వం ప్రశ్నార్థకమవుతోంది. జడేజా లాంటి ప్లేయర్ ఆఖరి వరకు ఉండి జట్టుకు విజయాన్ని అందించలేకపోయాడు. ధోని, జడేజా క్రీజులో ఉన్నా రాజస్థాన్ బౌలర్లు ఏం ఇబ్బందిపడలేదు. వారి పనివారు చేశారు." అని భజ్జీ వ్యాఖ్యానించాడు. ఆదివారం రాజస్థాన్ తో చెన్నై తలపడింది. తొలుత బ్యాటింగ్ చేసిన రాజస్థాన్ చెన్నై 183 పరుగుల లక్ష్యాన్ని ఇచ్చింది. లక్ష్య ఛేదనలో చెన్నై మొదటి నుంచే తడబడింది. టార్గెట్ మరీ పెద్దదేమీ కాకపోయినా, రచిన్ రవీంద్ర తొలి ఓవర్లోనే ఔట్ కావడం వల్ల సీఎస్కే ఛేదన కష్టంగా మారింది. పరుగులు అంత ఈజీగా రాలేదు. రాహుల్ త్రిపాఠి (23) కొన్ని షాట్లతో మెరిపించాడు. శివమ్ దూబె (18) ఫర్వాలేదనిపించాడు. విజయ్ శంకర్ (9) నిరాశపర్చాడు. ఈ క్రమంలో కెప్టెన్ రుతురాజ్ (63) చెన్నైను ఆదుకున్నాడు. జడేజాతో కలిసి మంచి భాగస్వామ్యాన్ని నెలకొల్పాడు. కానీ సాధించాల్సిన రన్ రేట్ భారీగా పెరిగిపోయింది. హసరంగ బౌలింగ్ లో ఓ సిక్సర్ బాదిన తర్వాత బంతికే పెవిలియన్ కు చేరాడు. దీంతో సీఎస్కే పై ఒత్తిడి పెరిగిపోయింది. అనంతరం క్రీజులో ఉన్న ధోని, జడేజా వేగంగా ఆడలేకపోవడం వల్ల ఆఖరి రెండు ఓవర్లలో చెన్నై 39 పరుగులు చేయాల్సి వచ్చింది. తుషార్ వేసిన 19వ ఓవర్లో ధోని ఫోర్, సిక్స్-జడేజా ఓ సిక్సర్ కొట్టడం వల్ల మ్యాచ్ క్లోజ్ గా వచ్చింది. కానీ చివరి ఓవర్లో సందీప్ శర్మ అద్భుతంగా బౌలింగ్ వేశాడు. ధోనీని అవుట్ చేయడం వల్ల చెన్నై ఓటమి దాదాపు ఖరారైపోయింది. జడేజా ఆఖరి వరకు ఉన్నా జట్టుకు విజయాన్ని అందించలేకపోయాడు. 22 బంతుల్లో 32 పరుగులు చేసి నాటౌట్ గా నిలిచాడు.




## పాయింట్ల పట్టికలో అగ్రస్థానంలో ఆర్సీబీ



గౌహతిలోని బర్సపర క్రికెట్ స్టేడియంలో ఐపీఎల్ 2025లో జరిగిన 11వ మ్యాచ్‌లో ఐదుసార్లు ఐపీఎల్ ఛాంపియన్ చెన్నై సూపర్ కింగ్స్ ఓటమిపాలైంది. ఉత్కంఠ పోరులో రాజస్థాన్ రాయల్స్ 6 పరుగుల తేడాతో చెన్నైపై విజయం సాధించింది. ప్రస్తుత ఇండియన్ ప్రీమియర్ లీగ్ ఎడిషన్‌లో రాజస్థాన్ రాయల్స్ తొలి విజయం సాధించింది. రుతురాజ్ గైక్వాడ్ నేతృత్వంలోని చెన్నై జట్టు వరుసగా రెండో మ్యాచ్‌లో ఓటమి చెందడాన్ని ఫ్యాన్స్ జీర్ణించుకోలేకపోతున్నారు. విశాఖపట్నంలో మ్యాచ్‌లో ఢిల్లీ క్యాపిటల్స్ , సన్‌రైజర్స్ హైదరాబాద్ పై 7 వికెట్ల తేడాతో ఓడించింది. ఢిల్లీ క్యాపిటల్స్ వరుసగా రెండవ విజయాన్ని నమోదు చేసింది. ఈ సీజన్‌లో సన్‌రైజర్స్ తమ తొలి మ్యాచ్‌లో నెగ్గింది. ఆపై వరుస రెండు మ్యాచ్‌లలో సన్ రైజర్స్ హైదరాబాద్ వరుసగా రెండో మ్యాచ్ ఓడిపోయింది. ఆదివారం మ్యాచ్‌ల తరువాత చూస్తే రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు పాయింట్ల పట్టికలో అగ్ర స్థానంలో నిలిచింది. 4 పాయింట్లు 2.266 రన్‌రేటుతో ఆర్సీబీ టాప్‌లో ఉంది. ఢిల్లీ క్యాపిటల్స్ ఆడిన రెండు మ్యాచ్‌ల్లోనూ నెగ్గినా 1.32 రన్ రేటుతో రెండో స్థానంలో ఉంది. లక్నో సూపర్ జెయింట్స్, గుజరాత్ టైటాన్స్, పంజాబ్ వరుసగా 3, 4, 5 స్థానాల్లో ఉన్నాయి. టాప్ 5 జట్లలో ఐపీఎల్ నెగ్గిన జట్టు గుజరాత్ మాత్రమే ఉంది. మూడు ఐపీఎల్ ట్రోఫీలు నెగ్గిన కోల్ కతా జట్టు 2 మ్యాచ్ లలో ఒకటి నెగ్గి, ఒకటి ఓడింది. -0.308 రన్ రేటు ఉన్నా 6వ స్థానంలో నిలిచింది. 5 ఐపీఎల్ ట్రోఫీలు నెగ్గిన చెన్నై సూపర్ కింగ్స్ 3 మ్యాచ్ లలో ఒకటి నెగ్గి, రెండు మ్యాచ్ లలో ఓడిపోయింది. -0.771 రన్ రేటుతో 7వ స్థానంలో నిలిచింది. ఒక ఐపీఎల్ ట్రోఫీ సాధించిన సన్ రైజర్స్ హైదరాబాద్ 3 మ్యాచ్ లలో ఒకటి నెగ్గగా, రెండు మ్యాచ్ లలో ఓడింది. -0.871 రన్ రేటుతో 8వ స్థానంలో ఉంది. తొలి ఐపీఎల్ విన్నర్ రాజస్థాన్ రాయల్స్ మూడు మ్యాచ్ లాడి ఒకదాంట్లో నెగ్గి, రెండింట్లో ఓడిపోయింది. -1.112 రన్ రేటుతో 9వ స్థానానికి పడిపోయింది. 5 ఐపీఎల్ ట్రోఫీలు నెగ్గిన ముంబై ఇండియన్స్ పాయింట్ల పట్టికలో చివరి స్థానంలో ఉంది. ఆడిన రెండు మ్యాచ్ లలోనూ ఓడిపోయింది. -1.163 రన్ రేటుతో అట్టడుగున నిలిచింది.

## నెలలో జట్టులో చేరనున్న బుమ్రా



ఐపీఎల్-2025లో ముంబయి ఇండియన్స్ బోణీ కొట్టేందుకు ఇంకా శ్రమిస్తూనే ఉంది. ఈ సీజన్ లో తొలి విజయాన్ని అందుకునేందుకు ఇంకా కష్టపడుతూనే ఉంది. మార్చి 31 కేకేఆర్ తో జరగనున్న మ్యాచులోనూ విజయం సాధిస్తుందో కూడా తెలీదు. ఇలాంటి సమయంలో ముంబయి ఇండియన్స్ కు ఓ గుడ్ న్యూస్ అందింది. ఇప్పటికే వరుస ఓటములతో విమర్శలను మూటగట్టుకున్న ముంబై ఇండియన్స్ జట్టులోకి స్టార్ పేసర్ తిరిగి వచ్చేందుకు సిద్ధమవుతున్నాడు. అతడు మరెవరో కాదు, టీమిండియా పేస్ గుర్రం జస్ప్రీత్ బుమ్రా. అతడు తిరిగి మైదానంలోకి అడుగుపెట్టేందుకు సిద్ధమవుతున్నాడని తెలిసింది. వెన్ను గాయంతో ఇబ్బంది పడుతోన్న అతడు పూర్తి ఫిట్ నెస్ సాధించాడో లేదో తెలీదు కానీ, అభిమానుల్లో ఉత్సాహాన్ని కలిగించే పనిని చేశాడు. ప్రస్తుతం బెంగళూరులోని సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్‌లో పునరావసం పొందుతున్న అతడు.. నెట్స్‌లో బౌలింగ్ చేయడం ప్రారంభించాడు. తాజాగా బుమ్రా ప్రాక్టీస్ చేస్తున్న వీడియో ఒకటి బయటకు వచ్చింది. ఇది కాస్త సోషల్ మీడియాలో వైరల్ గా మారడంతో ముంబై ఇండియన్స్ ఫ్యాన్స్ చూసి ఫుల్ ఖుషీ అవుతున్నారు. బుమ్రా.. సిడ్నీ ఆస్ట్రేలియాతో జరిగిన ఐదో టెస్టులో గాయపడ్డాడు. దీంతో ఛాంపియన్స్ ట్రోఫీ-2025కు కూడా దూరమయ్యాడు. ఇక ఇప్పుడు ఐపీఎల్ 2025 ప్రారంభ మ్యాచులకు దూరమయ్యాడు. మార్చి 31 కేకేఆర్ తో జరగనున్న మ్యాచుకు అందుబాటులో ఉండట్లేదు. అయితే ఏప్రిల్ నెలలో జట్టుతో కలుస్తాడని సమాచారం అందుతోంది. ముంబయి తన తర్వాతి మ్యాచులను ఏప్రిల్ 4న లక్నో సూపర్ జెయింట్స్ తో, ఏప్రిల్ 7న రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరుతో ఆడనుంది. మరి ఈ మ్యాచులకు అతడు అందుబాటులోకి వస్తాడో లేదో తెలీదు. బుమ్రా ఫిట్‌నెస్‌పై ఇటీవలే ముంబై ఇండియన్స్ హెడ్ కోచ్ జయవర్ధనే కూడా స్పందించాడు. "బుమ్రా ఎప్పుడొస్తాడు అనేది ఇప్పుడే చెప్పలేం" అని పేర్కొన్నాడు.

## రోహిత్ ముంగిట అరుదైన రికార్డు..

ఐపీఎల్‌లో ముంబై ఇండియన్స్, కోల్‌కతా నైట్ రైడర్స్ జట్లు తలపడినప్పుడల్లా చాలా ఉత్కంఠభరితంగా ఉంటుంది. ఈ ఐపీఎల్ మ్యాచ్‌లలో చాలా మంది గొప్ప బ్యాటర్లు అద్భుతంగా రాణించారు. కానీ కొంతమంది ఆటగాళ్ల రికార్డు ప్రత్యేకమైనది. అలాంటి వారిలో ముంబై ఇండియన్స్ మాజీ కెప్టెన్ రోహిత్ శర్మ ఒకరు. రోహిత్ శర్మ కోల్‌కతా నైట్ రైడర్స్‌పై అద్భుతంగా రాణించాడు. ఐపీఎల్‌లో కోల్‌కతా నైట్ రైడర్స్‌పై రోహిత్ శర్మ 900 పరుగులు సాధించాడు. అయితే ఐపీఎల్ 2025లో మొదటి రెండు మ్యాచ్‌లలో రోహిత్ శర్మ ముంబై ఇండియన్స్ తరఫున బాగా రాణించలేకపోయాడు. కానీ ఇప్పుడు వాంఖడే స్టేడియంలో కోల్‌కతా నైట్ రైడర్స్‌తో ముంబై ఇండియన్స్ తన మూడో మ్యాచ్ ఆడనున్న నేపథ్యంలో రోహిత్ శర్మకు అరుదైన రికార్డును సాధించే సువర్ణావకాశం లభించనుంది. ఐపీఎల్‌లో ముంబై ఇండియన్స్, కోల్‌కతా నైట్ రైడర్స్ మధ్య జరిగిన మ్యాచ్‌లలో రోహిత్ శర్మ అత్యధిక పరుగులు చేసిన ఆటగాడిగా ఉన్నాడు. ఈడెన్ గార్డెన్స్ అయినా, వాంఖడే స్టేడియం అయినా రోహిత్ శర్మ ఎప్పుడూ కోల్‌కతాపై అద్భుతంగా బ్యాటింగ్ చేశాడు. ఇప్పటివరకు కేకేఆర్‌పై రోహిత్ శర్మ 954 పరుగులు చేశాడు. రోహిత్ స్ట్రైక్ రేట్ 128.05గా ఉంది. ఈ రోజు మ్యాచ్‌లో రోహిత్ శర్మ ఇంకా 46 పరుగులు చేస్తే 1000 పరుగులు పూర్తి చేసిన తొలి బ్యాటర్ గా రికార్డు సృష్టించనున్నాడు. ఇప్పుడు హిట్ మ్యాన్ ఈ చారిత్రాత్మక ఘనతను సాధించగలడా లేదా అనేది ఆసక్తికరంగా మారింది.






# క్యూట్ ఫొటోలు షేర్ చేసిన పూజా హెగ్డే

బ్యూటీ పూజా హెగ్డే గురించి ఎంత చెప్పినా తక్కువే. అందం, అభినయం ఈ ముద్దుగుమ్మ సొంతం. ఒక లైలా కోసం అంటూ టాలీవుడ్ సిల్వర్ స్క్రీన్ పైకి ఎంట్రీ ఇచ్చిన ఈ చిన్నది మొదటి సినిమాతోనే మంచి ఫేమ్ సంపాదించుకుంది. ఈ మూవీ తర్వాత ఈ అమ్మడు ముకుంద సినిమాలో ఛాన్స్ కొట్టేసి ఆ సినిమాలో గోపిక పాత్రలో నటించి, తన అందంతో టాలీవుడ్ లో తనకంటూ స్పెషల్ ఇమేజ్ ఏర్పరుచుకుంది. ఇక ముకుంద మూవీ తర్వాత ఈ ముద్దుగుమ్మకు వరగా ఆఫర్స్ రావడంతో స్టార్ హీరోల సినిమాలో ఛాన్స్ కొట్టేసింది. వరసగా సినిమాలు చేస్తూ టాలీవుడ్ నే షేక్ చేసింది ఈ చిన్నది. కానీ ఈ అమ్మడు చేసిన సినిమాలన్నీ డిజాస్టర్ అవ్వడంతో పూజా క్రేజ్ తగ్గింది తెలుగులో, దీంతో బాలీవుడ్ , కోలీవుడ్ చెక్కేసి అక్కడ వరస సినిమాలతో బీజీ అయ్యింది. కొన్ని రోజుల పాటు చాలా సైలెంట్ అయిపోయిన ఈ బ్యూటీ ఇప్పుడిప్పుడే ఆఫర్స్ అందుకుంటుంది. ఓవైపు సినిమాలు, మరోవైపు స్పెషల్ సాంగ్స్ అంటూ బిజీ అయిపోయింది. ఎప్పుడూ సోషల్ మీడియాలో యాక్టివ్ గా ఉంటూ తన గ్లామర్ ఫొటోస్ షేర్ చేసే ఈ చిన్నది తాజాగా, పొట్టి గౌన్ లో తన అందాలతో రెచ్చిపోయింది. షార్ట్ గౌన్ ధరించి, ముద్దులతో రెచ్చిపోయింది. ప్రస్తుతం దీనికి సంబంధించిన ఫొటోలు సోషల్ మీడియాలో తెగ వైరల్ అవుతున్నాయి.

# బ్లాక్ శ్యారీలో మెరిసిపోతున్న కీర్తిసురేష్



అందాల చిన్నది కీర్తి సురేష్ గురించి ఎంత చెప్పినా తక్కువే, అందం, అభినయం ఈ ముద్దుగుమ్మ సొంతం. నేను శైలజా సినిమాతో తెలుగు వెండితెరకు పరిచయం అయ్యింది ఈ అమ్మడు, మొదటి సినిమాతోనే మంచి ఫేమ్ తెచ్చుకుంది. తర్వాత నాని సరసన నేను లోకల్ మూవీలో నటించి మంచి క్రేజ్ సొంతం చేసుకుంది. ఈ సినిమా తర్వాత కీర్తికి వరసగా ఆఫర్స్ రావడంతో వచ్చిన అవకాశాన్ని అందిపుచ్చుకుంటూ వరస సినిమాలు, బ్లాక్ బస్టర్ హిట్స్ అందుకొని స్టార్ హీరోయిన్ గా ఓ వెలుగు వెలిగింది. దసరా మూవీతో పాన్ ఇండి క్రేజ్ సంపాదించుకున్న ఈ బ్యూటీ, మహానటితో ఓవర్ నైట్ స్టార్ అయిపోయింది. ఈ సినిమా తర్వాత ఈ అమ్మడు మంచి గుర్తింపు సంపాదించుకుంది. ఇక ఇటీవలే తన చిన్ననాటి స్నేహితుడిని వివాహం చేసుకున్న ఈ నటి, ఎప్పుడూ సోషల్ మీడియాలో యాక్టివ్ గా ఉంటూ తన గ్లామర్ ఫొటోలు షేర్ చేస్తుంది. తాజాగా ఈ చిన్నది బ్లాక్ చీరలో ఉన్న ఫొటోలను అభిమానులతో పంచుకుంది. ఇందులో కీర్తి తన ఘాటు, అందాలను చూపిస్తూ.. వయ్యారంగా, తన ఒంపు సొంపులతో యూత్ ను తెగ ఆకట్టుకుంది. ప్రస్తుతం ఈ ఫొటోస్ సోషల్ మీడియాలో తెగ వైరల్ అవుతున్నాయి.

# మోనాలిసా సినిమా డైరెక్టర్ అరెస్టు..?

మహా కుంభమేళాలో పూసలు, రుద్రక్ష మాలలు అమ్మి సోషల్ మీడియాలో వైరల్ అయిన నిరుపేద అమ్మాయి మోనాలిసాకు సినిమా ఆఫర్ ఇచ్చిన దర్శకుడు సనోజ్ మిశ్రా అరెస్ట్ అయినట్లు తెలుస్తోంది. అత్యాచారం కేసులో ఢిల్లీ పోలీసులు అతడిని అరెస్ట్ చేసినట్లు సమాచారం. ఇప్పటికే అతడి బెయిల్ పిటిషన్‌ను ఢిల్లీ హైకోర్టు తిరస్కరించిందని.. దీంతో పోలీసులు సనోజ్ మిశ్రాను అదుపులోకి తీసుకున్నట్లు తెలుస్తోంది. ఝాన్సీకి చెందిన ఒక యువతిని సినిమాలో పాత్ర ఇప్పిస్తానని ప్రలోభపెట్టాడని దర్శకుడు సనోజ్ పై ఆరోపణలు వచ్చాయి. ఆ తర్వాత సదరు అమ్మాయిని శారీరకంగా వేధించారని.. ఆమెను బెదిరింపులకు గురి చేస్తూ లైంగిక దాడికి పాల్పడినట్లు ఆరోపణలు వచ్చాయి. బాధితురాలు చెప్పిన వివరాల ప్రకారం 2020లో టిక్‌టాక్, ఇన్‌స్టాగ్రామ్ ద్వారా సనోజ్ మిశ్రాను కలిశానని..సినిమాలో అవకాశం ఇస్తానని చెప్పి ఎక్కువగా ఫోన్స్ చేసేవాడని.. ఆపై దర్శకుడు 17 జూన్ 2021న తనకు కాల్ చేసి ఝాన్సీ రైల్వే స్టేషన్‌లో ఉన్నట్లు చెప్పాడాని.. తనను కలవడానికి రావాలని.. లేదంటే ఆత్మహత్య చేసుకుంటానని బెదిరించాడని బాధితురాలు పోలీసుల ఫిర్యాదులో పేర్కొంది. మరుసటి రోజు జూన్ 18, 2021న దర్శకుడు మళ్లీ ఫోన్ చేసి రైల్వే స్టేషన్‌కు రాకపోతే ఆత్మహత్య చేసుకుంటానని బెదిరించారని.. చేసేది లేక రైల్వే స్టేషన్ కు వెళ్తే.. తనను రిసార్ట్‌కు తీసుకెళ్లాడని.. ఆ పై మత్తు మందు ఇచ్చి తనపై దాడికి పాల్పడ్డాడని.. ఆపై అసభ్యకరమైన ఫోటోస్, వీడియోస్ తీసి బెదిరించాడని బాధితురాలు ఫిర్యాదులో పేర్కొంది. ఆ తర్వాత పెళ్లి చేసుకుంటానని చెప్పి తనపై అనేకసార్లు దాడికి పాల్పడ్డారని.. సినిమాల్లో అవకాశాలు ఇప్పిస్తానని చెప్పడంతో ముంబై వచ్చి అతడితోనే జీవించడం ప్రారంభించానని చాలాసార్లు తనను కొట్టారని తెలిపింది. 2025 ఫిబ్రవరిలో తనను విడిచి పెట్టాడని.. ఫిర్యాదు చేస్తే తన అసభ్యకరమైన పోటోస్, వీడియోస్ సోషల్ మీడియాలో పోస్ట్ చేస్తానని బెదిరిస్తున్నాడని బాధితురాలు ఆరోపించింది. ఇదిలా ఉంటే సనోజ్ మిశ్రా కుంభమేళా మోనాలిసాకు ది డైరీ ఆఫ్ మణిపూర్ సినిమాలోని ఓ పాత్రకు ఆమెను ఎంపిక చేసుకున్నాడు.

# తెలుగుదనం ఉట్టిపడుతున్న అనన్యనాగళ్ల



అందాల ముద్దుగుమ్మ అనన్యనాగళ్ల గురించి ప్రత్యేకంగా చెప్పాల్సిన పని లేదు. అందం, అభినయం ఈ ముద్దుగుమ్మ సొంతం. పవర్ స్టార్ పవన్ కళ్యాణ్ వకీల్ సాబ్ మూవీతో మంచి ఫేమ్ సంపాదించుకుంది ఈ చిన్నది. ఈ మూవీ తర్వాత ఈ బ్యూటీకి చాలా సినిమాల్లో అవకాశాలు రావడంతో వరసగా వెబ్ సిరీస్ లు, సినిమాలు చేస్తూ ఫుల్ బిజీ అయిపోయింది. అంతే కాకుండా ఈ ముద్దుగుమ్మ సమయం దొరికినప్పుడల్లా సోషల్ మీడియాలో యాక్టివ్ గా ఉంటూ తన ఫ్యాన్స్ తో చిట్ చాట్ చేస్తుంటుంది. అంతే కాకుండా వరస ఫొటో షూట్స్ చేస్తూ.. కుర్రకారును తన వైపుకు లాక్కుంటుంది. ఇక తాజాగా ఈ చిన్నది తన ఇన్ స్టాలో ట్రెడిషనల్ లుక్ లో ఉన్న ఫొటోలు షేర్ చేసింది. ఉగాది పండుగ సందర్భంగా లంగావోణీలో అందంగా తయారైంది ఈ తెలుగు పిల్ల. ప్రస్తుతం దీనికి సంబంధించిన ఫొటోలు నెట్టింట తెగ వైరల్ అవుతున్నాయి. ఇక ఈ ఫొటోస్ చూసిన నెటిజన్స్, అనన్యను చూస్తే తెలుగు అందం ఉట్టిపడుతుంది. పరికిణిలో ఎంత ముద్దుగుందో అంటూ కామెంట్స్ చేస్తున్నారు ఈ అమ్మడు అభిమానులు.

# నిరాశపర్చిన రష్మిక సికిందర్

స్టార్ హీరోయిన్ రశ్మిక మందన్నా కెరీర్ అప్రతిహతంగా సాగిపోతోంది. వరుస విజయాలతో ముందుకు పోతున్న రశ్మిక కు ఆ మధ్య వచ్చిన ‘గుడ్ బై’, ‘మిషన్ మజ్ను’ వంటి సినిమాలు నిరాశకు గురి చేశాయి. అయితే.. 2023 చివరిలో వచ్చిన రణబీర్ కపూర్ ‘యానిమల్’తో మళ్ళీ ఒక్కసారిగా రశ్మిక మందణ్ణ కెరీర్ ఊపందుకుంది. ఆ తర్వాత యేడాది 2024 డిసెంబర్ లో వచ్చిన ‘పుష్ప –2’ ఆ యేడాది అత్యధిక కలెక్షన్స్ వసూలు చేసిన మూవీగా బ్లాక్ బస్టర్ విజయాన్ని అందుకుంది. ఇక ఈ యేడాది ఫిబ్రవరిలో వచ్చిన ‘ఛావా’ సినిమా జాతీయ స్థాయిలో రశ్మిక మందణ్ణకు ప్రేక్షకులు నీరాజనాలు పట్టేలా చేసింది. ఆ రకంగా రశ్మిక హ్యాట్రిక్ ను సాధించింది. బట్... ఈద్ కానుకగా ఆదివారం విడుదలైన సల్మాన్ ఖాన్ మూవీ ‘సికందర్’ (%వాఅఝఅఝతీ%) ఆమెను తీవ్ర నిరాశకు గురి చేసింది. తమిళ దర్శకుడు ఎ. ఆర్. మురుగదాస్ తెరకెక్కించిన ఈ సినిమా రెగ్యులర్ ఫిల్మ్ గోయర్స్ ను మాత్రమే కాదు సల్మాన్ ఖాన్ అభిమానులనూ మెప్పించలేకపోయింది. ఈద్ కానుకగా వచ్చిన సల్మాన్ ఖాన్ గత చిత్రాల స్థాయి ఓపెనింగ్ కూడా ‘సికందర్’ కు దక్కలేదని ట్రేడ్ వర్గాలు చెబుతున్నాయి. మొదటి నుండి ఎందుకో ‘సికందర్’కు పెద్దంత బజ్ క్రియేట్ కాలేదు. దానికి తగ్గట్టుగానే సినిమా ఓపెనింగ్స్ కూడా ఆశించిన స్థాయిలో రాలేదు. ఈ మధ్య కాలంలో సల్మాన్ ఖాన్ మూవీకి ఇంత తక్కువ ఓపెనింగ్స్ రావడం ఇదే అని ట్రేడ్ వర్గాలు చెబుతున్నారు. సల్లూభాయ్ గత చిత్రాలు “బజరంగీ భాయిజాన్, కిక్, దబాంగ్, టైగర్ జిందా హై, సుల్తాన్, భరత్, ప్రేమ్ రతన్ ధన్ పాయో, ఏక్ థా టైగర్, టైగర్ –3” చిత్రాలకు ఇంతకంటే మంచి ఓపెనింగ్స్ వచ్చాయంటున్నారు. సల్మాన్ తోటి హీరోలు చాలామంది ఇప్పటికే రూ. 500 కోట్ల క్లబ్ లో చేరితే సల్మాన్ మాత్రం ఆ విషయంలో వెనకబడి పోయారంటున్నారు. షారుఖ్ ఖాన్ ‘పఠాన్, జవాన్’ చిత్రాలతోనూ, రణబీర్ కపూర్ ‘యానిమల్’తోనూ, సన్నీ డియోల్ ‘గద్దర్ –2’తో, విక్కీ కౌశల్ ‘ఛావా’ చిత్రంతో రూ. 500 కోట్ల మైలురాయిని దాటేశారు.



# ఫకీర్‌బాబా అవతారమెత్తిన జొన్నలగడ్డ హైప్ పెంచిన రంజాన్ లుక్



డీజే టిల్లుతో సూపర్ క్రేజ్ సంపాదించుకున్నాడు సిద్ధు జొన్నలగడ్డ. ఈ క్రేజీ యాక్టర్ ప్రస్తుతం బ్యాక్ టు బ్యాక్ సినిమాలను లైన్‌లో పెట్టగా.. వీటిలో మోస్ట్ క్రేజీయెస్ట్ ప్రాజెక్ట్ జాక్37 ప్రాజెక్టుగా వస్తోన్న ఈ చిత్రానికి బొమ్మరిల్లు భాస్కర్ దర్శకత్వం వహిస్తున్నాడు. చాలా రోజుల తర్వాత రంజాన్ శుభాకాంక్షలు తెలియజేస్తూ స్పెషల్ పోస్టర్ విడుదల చేశారు మేకర్స్. సిద్ధు జొన్నలగడ్డ ఈ సారి ఫకీర్ బాబా అవతారమెత్తి.. తనదైన స్టైల్ గెటప్‌తో టాక్ ఆఫ్ ది ఇండస్ట్రీగా నిలుస్తున్నాడు. జాక్.. ఇది కేవలం ఒక పేరు కాదు.. ఇది ఒక వైబ్.. ఇంకా ఛేదించాల్సిన మిస్టరీ.. జాక్ టీం నుంచి అందరికీ ఈద్ ముబారక్ అంటూ షేర్ చేసిన లుక్ నెట్టింట టాక్ ఆఫ్ ది టౌన్‌గా మారింది. ఇప్పటికే షేర్ చేసిన జాక్ టైటిల్ లుక్ పోస్టర్‌లో సిద్ధు గన్స్ పట్టుకుని ఫుల్ యాక్షన్ మోడ్‌లో కనిపిస్తూ సినిమాపై క్యూరియాసిటీ పెంచేస్తున్నాడు. శ్రీ వెంకటేశ్వర సినీ చిత్ర బ్యానర్‌పై బీవీఎస్ఎన్ ప్రసాద్ తెరకెక్కిస్తున్న ఈ చిత్రానికి మ్యూజిక్ అందిస్తున్నారు. సిద్ధు జొన్నల గడ్డ మరోవైపు నీరజ కోన డైరెక్షన్‌లో తెలుసు కదా సినిమాలో కూడా నటిస్తున్నాడని తెలిసిందే. దీంతోపాటు టిల్లు 3 కూడా లైన్‌లో పెట్టగా.. దీనికి సంబంధించి నయా అప్‌డేట్ రావాల్సి ఉంది.

# ఉగాది పూజల్లో రాంచరణ్ దంపతుల కూతురు క్లింకార

రామ్ చరణ్, ఉపాసన ముద్దుల గారాల పట్టి క్లింకార గురించి ప్రత్యేక పరిచయాలు అక్కర్లేదు. 2023 జూన్ 20న క్లింకార జన్మించగా, ఆ సమయంలో అభిమానులు పెద్ద ఎత్తున పండగలే జరిపారు. క్లింకార పుట్టగానే మెగా ఇంట పట్టలేని సంతోషం కనబడింది. మెగా పవర్ స్టార్ రామ్ చరణ్ ఉపాసనల మొదటి బిడ్డగా, మెగా వారసురాలిగా క్లింకార జన్మించడంతో సంబరాలు అంబరాన్నంటాయి. అయితే క్లింకార పుట్టినప్పటి నుండి ఆ చిన్నారి ఫేస్ ఎలా ఉందో చూడాలని మెగా ఫ్యాన్స్ ఆరాటపడుతూనే ఉన్నారు. కాని క్లింకార ఏ ఫొటో షేర్ చేసిన కూడా అందులో క్లింకార ఫేస్ కనిపించకుండా జాగ్రత్త పడుతున్నారు. మెగా మనవరాలిగా, వారసురాలిగా క్లింకార ఇప్పటికే ఫుల్ క్రేజ్ సంపాదించుకుంది. చిన్నారికి క్లింకార అనే పేర పెట్టడం వెక కూడా ప్రత్యేకత ఉంది. ప్రపంచం మొత్తానికి శక్తిని ప్రసాదించే అమ్మవారి సహస్రనామాల్లో క్లిన్ కారా ఒకటి కాగా, అమ్మవారి అసమాన శక్తికి ఈ పదం అద్దం పడుతుంది. అపారమైన శక్తిని తనలో నిక్షిప్తం చేసుకుందనడానికి నిదర్శనంగా లలిత సహస్ర నామాల్లో క్లిన్ కారా అనే పేరును ఉపయోగిస్తారు. అంతటి గొప్ప పేరును మెగా ప్రినెన్స్ కు నామకరణం చేయడం విశేషం. కొణిదెల క్లింకార అనే పేరు ఇప్పుడు బ్రాండ్ అయిపోయింది.అయితే తాజాగా మెగా కోడలు ఉపాసన తన ఇంట్లో ఉగాది పండగ వేడుకలకి సంబంధించి ఓ వీడియో షేర్ చేసింది. ఇందులో ఉపాసన, క్లింకార, సురేఖలు పూజ మందిరంలో ప్రత్యేక పూజలు చేస్తున్నట్టు కనిపించింది. అయితే ఇందులో క్లింకార ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. చిన్నారిని ఫేస్‌ని లవ్ ఎమోజీతో కవర్ చేసిన కూడా సైడ్ యాంగిల్‌లో కాస్త కనిపిస్తుండడంతో ఫ్యాన్స్ పండగ చేసుకుంటున్నారు. బేబి పింక్ డ్రెస్ ధరించి పద్ధతిగా పూజలో కూర్చున్న క్లింకార ఫోటోలని నెటిజన్స్ తెగ వైరల్ చేస్తున్నారు.



EDITED, PRINTED AND PUBLISHED BY FAISAL KHAN PRINTED AT UJALA PRESS, LIG, 211 APHB COLONY ADILABAD, TELANGANA.
PUBLISHED FROM H.NO.4-4-120/C/3, SANJAY NAGAR COLONY, ADILABAD, TELANGANA STATE. EDITOR : FAISAL KHAN, RNI : APTEL/2013/53323, CELL : 94400 62685